సమీక్ష
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కడప
: fb.com/vaartha Digital
Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
10-7-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 159 పేజీలు: 10+4 వెల: 6.50

భారత్‌పై చైనా 'వాటర్ బాంబ్'!
కర్ణాటకలో సిఎం మార్పు అనివార్యమా?
5లో

# అడ్డంకులు సృష్టిస్తే సహించం

**ప్రభుత్వ పథకాలకు అడ్డుపడేవారిపై కఠిన చర్యలు**

**వైఎస్సార్సీ కుట్రలపై విచారణ జరిపిస్తాం: సిఎం చంద్రబాబు**

**రాజధానికి మలివిడతలో 34,964 ఎకరాల భూ సమీకరణ**

**స్పోర్ట్స్ అకాడెమీకి భూముల కేటాయింపు**

**క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం**

**మోటార్ వెహికల్ బిల్లులో పలు సవరణలు**


బుధవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, అచ్చెన్నాయుడు తదితరులు

**విజయవాడ, జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ బ్రాండ్ దెబ్బతినేలా వివిధ సంస్థలకు ఈ మెయిళ్లు పెట్టడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై విచారణకు ఆదేశిస్తామని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా వైఎస్సార్సీ అడ్డుకోవడం క్షమించరాని విషయం అన్నారు. ఆ పార్టీకుట్రలపై విచారణ చేయిస్తామని ప్రకటించారు. చేసిన తప్పులను ప్రత్యర్థులపైకి నెట్టేసే కుట్రలను వైఎస్సార్సీ అమలు చేస్తుందని విమర్శించారు. నిధులు రాకుండా తెరవెనుక అడ్డుకోవడం వారికి అలవాటుగా మారిందని ఆరోపించారు. పథకాలు ఇవ్వడం లేదంటూ దుష్ప్రచారం చేస్తుందని ఆక్షేపించారు. వైఎస్సార్సీ దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. ఈ విషయంలో మంత్రులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి చూపిన సంస్థలతో సమన్వయం చేసుకోవాలన్నారు.

బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు అధ్యక్షతన కేబినెట్‌భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఎజెండాలో అంశాలతో పాటు పలు విషయాలపై ఆయన చర్చించారు. ప్రభుత్వ పథకాలకు అడ్డంకిగా ఉంటున్న శక్తులపై తగిన రీతిలో బదులు చెప్పాలన్నారు. ఇక 20 ఏజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. అదేవిధంగా 50వ సిఆర్‌డిఎ అథారిటీ సమావేశం నిర్ణయాలకు మంత్రి వర్గం ఆమోదముద్ర వేసింది. ధాన్యం కొనుగోళ్ల బకాయిలు రూ.672 కోట్ల విడుదలకు మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. తద్వారా 31,000ల మంది రైతులకు బకాయిలు అందనున్నాయి. అన్నదాతలఖాతాల్లో 24 గంటల్లో బకాయిలు జమ చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ధాన్యం పాత బకాయిలు రూ.1000 కోట్లలో రూ. 672 కోట్ల నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ నగదును 24 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. నిధులు రైతుల ఖాతాల్లో వేసే బాధ్యతను పౌర సరఫరాల శాఖ మంత్రి >>2


బుధవారం నమీబియా అత్యున్నత పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విట్‌షియా మిరాబిలిస్' ను ప్రధాని మోడీకి అందజేస్తున్న అధ్యక్షురాలు డాక్టర్ నెటుంబో నంది ఎన్‌దైత్వా

## ప్రధాని మోడీకి నమీబియా అత్యున్నత పురస్కారం

**విండ్‌హాక్(నమీబియా), జూలై 9:** ఐదుదేశాల పర్యటనలోభాగంగా తన చిట్టచివరి పర్యటనగా నమీబియా పర్యటనలో ఉన్న ప్రధానిమోడీ ఆదేశ అత్యున్నత పురస్కారం అందుకున్నారు. 'ఆర్డర్ ఆఫ్‌ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విట్‌షియా మిరాబిలిస్' పురస్కారాన్ని ఆదేశ అధ్యక్షురాలు డాక్టర్ నెటుంబో నంది ఎన్‌దైత్వా ప్రధానిమోడీకి బుధవారం ఈ పురస్కారం అందచేసారు. నమీబియా రాజ్యాంగం దఖలుపరిచిన అధికారాల ఆధారంగా నమీబియా అత్యున్నత పురస్కారాన్ని విభిన్న రంగాల్లో విశిష్టసేవలందించిన భారతప్రధాని నరేంద్రమోడీకి అందచేస్తున్నందుకు ఎంతో గర్వంగా >>2

## నదుల అనుసంధానమే లక్ష్యం

### కృష్ణా డెల్టాకు వరప్రదాయిని పట్టిసీమ ఎత్తిపోతలు

### రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు


బుధవారం పవిత్ర సంగమం వద్ద గోదావరి జలాలకు హారతినిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల

**విజయవాడ, జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** నదుల అనుసంధానం వలన వ్యవసాయరంగానికి ఎంతో ప్రయోజనం ఉందని ఎపి జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం అందుకు కీలక ఉదాహరణ అన్నారు. డెల్టా భూములకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ఈ పథకాన్ని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూసిందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో నదుల అనుసంధానానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద గోదావరి జలాలకు మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు హారతి ఇచ్చారు. కృష్ణమ్మ చెంతకు గోదావరి జలాలు చేరిన చోట హారతి కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ప్రతి ఏటా మూడు వేల క్యూసెక్కుల గోదావరి నీరు వృధాగా సముద్రంలోకి పోయేదని ఆయన అన్నారు. ఆ నీరు వృధాగా పోకుండా సిఎం చంద్రబాబు పట్టిసీమ నిర్మాణం చేశారని గుర్తుచేశారు.

తాను 2014- 19 మధ్య ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు స్వయంగా ఆ పనులు తాను చూశానని నిమ్మల వెల్లడించారు. అసెంబ్లీలో ఆనాడు జగన్, పట్టిసీమను వట్టిసీమ అని హేళన చేశారని మండిపడ్డారు. ఇప్పుడు ఈ పట్టిసీమ ద్వారా 13 లక్షల ఎకరాలకు నీరు అందుతుందని తెలిపారు. చంద్రబాబు ముందుచూపు ఎలా ఉంటుందో, పట్టిసీమ నీరు ఉపయోగిస్తుండడమే ఒక ప్రత్యక్ష ఉదాహరణ అని స్పష్టం చేశారు. పట్టిసీమ కట్టినప్పటి నుంచి ఇప్పటివరకు కృష్ణ డెల్టాకు 263 టీఎంసీల నీటిని ఇచ్చామని నిమ్మల వివరించారు.

ఇప్పటివరకు 50వేల కోట్ల రూపాయల సంపదను ఈ పట్టిసీమ ఇచ్చిందని మంత్రి తెలిపారు. గత ఐదు సంవత్సరాలలో ఒక్క లిఫ్టుకు కూడా జగన్ ప్రభుత్వం మరమ్మతులు చేయలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి లిఫ్టులను మరమ్మతులు చేసి అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి నిమ్మల వెల్లడించారు. వైఎస్సార్సీ ప్రభుత్వంలో షట్టర్లకు కనీసం గ్రీస్ కూడా పెట్టలేదని నిమ్మల ఆక్షేపించారు. గత ప్రభుత్వ పాపాలు మనకు శాపలుగామారాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. శ్రీశైలం ప్రాజెక్ట్‌వద్ద రిపేర్ పనులకు ప్లాన్ చేస్తున్నామని తెలిపారు. ధవళేశ్వరం, శ్రీశైలం ప్రాజెక్టుల >>2

## డిసెంబరుకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు

### నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు


బుధవారం నిర్మాణంలో ఉన్న క్వార్టర్లు పరిశీలిస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు

**విజయవాడ, జులై9, ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అమరావతి క్వార్టర్స్‌లోనే ఉంటారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. అమరావతిలో నిర్మాణంలోఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్లను సభాపతి అయ్యన్నపాత్రుడు పరిశీలించారు. రాజధాని అమరావతిలో పనులు ఊపందుకున్నాయి. ప్రతిష్టాత్మక సంస్థల నిర్మాణాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శాశ్వత సచివాలయం, హైకోర్టు నిర్మాణం పనులు వేగం పుంజుకున్నాయి. గత నెలలో అమరావతికి వచ్చిన నిపుణుల బృందం ఐకానిక్ టవర్లు, శాశ్వత హైకోర్టుపునాదులను పరిశీలించింది. వారి సూచనల మేరకు ముందుకు సాగుతున్నారు. అమరావతిలో నిర్మాణంలో ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల >>2

## మామిడి రైతులు రౌడీలా?

### తోతాపురి కేజీకి రూ.12 రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్

### బంగారుపాళ్యం మార్కెట్ యార్డు మామిడి రైతుల పరామర్శలో మాజీ సిఎం జగన్


బుధవారం మామిడి రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ సిఎం జగన్

**చిత్తూరు, జులై 9 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వానికి మామిడి రైతులు రౌడీల్లా కన్పిస్తున్నారా! మామిడిరైతులను పరామర్శించడానికి వస్తున్న తనవద్దకు రావడానికి మామిడి రైతులు ప్రయత్నిస్తే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తారా! చిత్తూరు జిల్లాలో 500మంది మామిడి రైతులు మాత్రమేవున్నారా! చిత్తూరు జిల్లాలో 76 వేల మామిడి రైతులు వున్నారనే విషయం సైతం ప్రభుత్వం మరచిపోయిందని మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బంగారుపాళ్యం మామిడి మార్కెట్ యార్డులో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేయడంతో పాటు మామిడి రైతులను పరామర్శించడానికి బుధవారం వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా మామిడి మార్కెట్ యార్డులో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మామిడి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడన్నారు. చిత్తూరు జిల్లాలో మే మూడవ వారంలో పల్ప్ ఫ్యాక్టరీలు ప్రారంభించాల్సివుండగా జూన్ 3వ వారం నాటికి సైతం ప్రారంభించలేదన్నారు. పల్ప్ ఫ్యాక్టరీలపై ఒకేసారి ఒత్తిడి పెరగడంతో పల్ప్‌ఫ్యాక్టరీలు రైతులనుండి మామిడి కొనుగోలు చేయలేని పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం మామిడి రైతుకు కేజీకి రూ.12 చెల్లిస్తామని ప్రకటించిందని, ఇందులో ఫ్యాక్టరీలు కేజీకి రూ.8 చెల్లిస్తే ప్రభుత్వం కేజీకి రూ.4 సబ్సిడీ ఇస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఫ్యాక్టరీలు, ప్రభుత్వం ఎంత మంది రైతులకు కేజీకి రూ.12 చెల్లించారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరోజు మామిడి రైతులు రోడ్డెక్కిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతు జీవితం సర్వనాశం అయ్యిందని, పంటలు సాగు చేసిన ప్రతి రైతు మద్దతు ధర కోసం రోడ్డెక్కి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నిన్నటి వరకు ఫ్యాక్టరీలు మామిడి రైతుకు కేజీ తోతాపురి మామిడికి రూ.3, రూ.2.50 చెల్లించేవని, ఈ వేళ ఇక్కడికి తాను రావడంతో కేజీకి రూ.4 చెల్లిస్తున్నారన్నారు. ప్రభుత్వం మామిడి రైతు ప్రతి ఒక్కరికి కేజీకి రూ.12 వారి బ్యాంకు ఖాతాలో జమ చేయాలని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు.



## వాహనాలకు భారీగా గ్రీన్‌టాక్స్ తగ్గింపు

### - మంత్రి కె. పార్థసారథి

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని ఎపి సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ హడ్కో నుంచి తీసుకున్న రుణాలకు గ్యారంటీ ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తోట చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలనే ప్రతిపాదనకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పార్థసారధి వెల్లడిం >>2

## రాష్ట్ర బిజెపి అధ్యక్షుడుగా మాధవ్ బాధ్యతల స్వీకరణ

### విజయవాడలో లెనిన్ సెంటర్‌ను విశ్వనాథ సెంటర్‌గా పిలవాలని పిలుపు




బిజెపి ఎపి అధ్యక్షుడిగా బుధవారం బాధ్యతలు స్వీకరిస్తున్న మాధవ్

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** బిజెపి ఎపి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు పివిఎన్ మాధవ్ విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఎపి బిజెపి నూతన అధ్యక్షుడిగా మంత్రి సత్యకుమార్ యాదవ్,ఎంపీ పురందేశ్వరి తదితరుల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాకంటే ముందు అధ్యక్షులైనవారి శక్తియుక్తులతో ముందుకువెళ్తాను అన్నారు. ప్రతీ కార్యకర్త తానే అధ్యక్షుడయ్యానని అన్నంతగా పని చేస్తున్నారు. రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పలుకుతూ ఒక నిర్ణయాన్నిచ్చారని పేర్కొన్నారు. బిజెపి ఇచ్చిన ఈ పదివిని గౌరవంగా భావించి పని చేస్తాను. డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పించాను. కవిసామ్రాట్ విశ్వనాథ్ సత్యనారాయణకు నివాళులు అర్పించాను. రాష్ట్రానికి శాసన భాషగా తెలుగు ఉండాలని అని ఒక శాసన నిఘంటువు తయారు చేసిన విశ్వనాథ సత్యనారాయణకు నివాళులర్పించాను అని పేర్కొన్నారు మాధవ్. అయితే ఎపి బిజెపి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించడానికి ముందు తుమ్మలపల్లి >>2

## కుప్పంలో ప్రతిగ్రామానికి ఇ-ఆటోలు

### ఎయిర్‌పోర్టు పనులు డిసెంబర్‌లో మొదలు

### 110కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైన్ల నిర్మాణానికి చర్యలు: కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్



**కుప్పం, జులై 9 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో దేశంలోనే తొలిసారిగా కుప్పంనియోజకవర్గంలో ప్రతి గ్రామానికి చెత్త సేకరణకై ఇ -ఆటోలు ఏర్పాటుచేస్తున్నట్లు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం కడ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడ ప్రాంత అభివృద్ధి కోసం సింగపూర్ సంస్థచే మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కుప్పంలో ఎయిర్ పోర్టుకు భూసర్వే పూర్తయిందని త్వరలోనే అవార్డు పాస్ (పరిహారం)చేస్తామని పేర్కొన్నారు. డిసెంబర్ నెలలో పనులు మొదలు పెడతామన్నారు.చిన్న చిన్న సమస్యలు ఉన్న రైతులతో చర్చిస్తున్నట్లు తెలిపారు.

గతంలో ఎయిర్‌పోర్టుకు భూములిచ్చిన రైతులకు 13కోట్ల బకాయిలు ఉండగా వడ్డీతో కలిపి డబుల్‌గా 25 కోట్లు చెల్లించాలని సిఎం చంద్ర బాబు ఆదేశించారన్నారు. కుప్పం నియోజక వర్గంలో త్వరలోనే 110 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైన్ల నిర్మాణ పనులకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏడాది కాలంలోనే కుప్పంలో ఆరు పెద్ద పరిశ్రమలు వచ్చాయన్నారు. వీటిద్వారా 13వేల ఉద్యోగాలు ఖరారవుతాయన్నారు.

## సచివాలయ ప్రవేశ విధానంలో మార్పులు

**విజయవాడ,జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర సచివాలయంలో భద్రతను ఎపి ప్రభుత్వం కట్టుదిట్టం చేస్తోంది. ఆ క్రమంలో ప్రవేశద్వారాల వద్ద నూతన సాంకేతిక వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయిస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన అన్ని పరికరాలూ వచ్చాయి. ప్రవేశద్వారాల వద్ద వాటిని అమరుస్తున్నారు. అది పూర్తికాగానే సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, పాత్రికేయులకు స్మార్ట్‌కార్డులు ఇవ్వనున్నారు. గుర్తింపు కార్డునకు అదనంగా ఇది ఉంటుంది. ప్లెయిన్‌గా ఉండే ఈ కార్డులోని చిప్‌లో మనకు సంబంధించిన అన్ని వివరాలు నిక్షిప్తమై ఉంటాయి. దీన్ని స్కాన్ చేయగానే...డేటాబేస్‌లో ఉన్న వివరాలతో సరిపోల్చుటకొని ఆటోమేటిక్‌గా తలుపులు తెరుచుకుంటాయి. బెంగుళూరుకు చెందిన 'సత్యాలజీ'అనే సంస్థకు ప్రభుత్వం ఈ భాధ్యతలు అప్పగించింది. వారం రోజుల్లో ఈ పనులు పూర్తి చేస్తామని సంస్థ ప్రతినిధులుతెలిపారు. వాహనాల్లోవచ్చే ఉద్యోగులు, సిబ్బందికి రేడియో ఫ్రీకెన్సీ గుర్తింపు (ఆర్‌ఎఫ్‌ఐడీ)ను ఇస్తారు. ఈ ఆర్‌ఎఫ్‌డీ స్టిక్కర్‌ను వాహనం ముందు అతికిస్తారు. దాన్ని 'బూమ్ వారియర్' స్కాన్ చేస్తుంది. అనంతరమే గేట్లు తెరుచుకుంటాయి. ఫాస్ట్ ట్యాగ్ తరహాలో ఇది పని చేస్తుంది. ఇందుకు ఉద్యోగుల వాహనాల నెంబర్లను ఓ డేటాబేస్‌లో నిక్షిప్తం చేయనున్నారు.

## నేడు మెగా 'పేరెంట్-టీచర్స్' మీట్

**హాజరుకానున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్**

**2 కోట్ల మంది టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చే అవకాశం**

**విజయవాడ, జులై 9, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో రికార్డు సృష్టించేందుకు సిద్ధమైంది. ఒకే రోజున 2 కోట్ల మందితో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ప్రభుత్వం నిర్వహించనుంది. విద్యార్థులు, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉద్యోగులు, అధికారులు, దాతలు, పూర్వ విద్యార్థులు...ఇలా అందరినీ ఒక చోటుకు ప్రభుత్వం తీసుకొస్తోంది. ఈ బృహత్తర కార్యక్రమాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనతో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇది రెండో కార్యక్రమం. రేపు పుట్టపర్తి నియోజకవర్గం, కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ హాజరు కానున్నారు. విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఉపాధ్యాయులతో సిఎం మాట్లాడనున్నారు. ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, జూనియర్ కాలేజీలలో మెగా పిటిఎం 2.0ను ఒక ఉత్సవంలా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. 74,96,228 మంది >>2



బుధవారం నమీబియాలోని విండ్‌హోక్‌లో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ప్రవాసభారతీయులు

# నమీబియా అత్యున్నత పురస్కారం

>> ఉందని వ్యాఖ్యానించారు. నమీబియాలో శాంతి, సమన్యాయం స్థాపనకోసం సామాజిక ఆర్థిక అభివృద్ధికోసం ప్రధాని మోడీ అవిరళ కృషిచేసారని ఆమె ఈసందర్భంగా పేర్కొన్నారు. కేవలం నమీబియాకే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా శాంతిసామరస్యం కోసం విశేష కృషిచేసారన్నారు. ఈ పురస్కారంతో ప్రధానిమోడీ ప్రపంచ దేశాలనుంచి 27 అత్యున్న తపురస్కారాలను అందుకున్నట్లయింది. ప్రస్తుత పర్యటనలో ఇది నాలుగో పురస్కారం. 1995లో స్థాపించిన ఈపురస్కారాన్ని 1990లో నమీబియా స్వాతంత్ర్యం పొందినప్పటినుంచి అమలులోకి తెచ్చారు. విబిన్నరంగాల్లో నమీబియాకోసం అందించిన సేవలు, నాయకత్వ లక్షణాలున్న ప్రముఖులు, విదేశీ ప్రముఖులకు ఈపురస్కారాన్ని అందచేస్తున్నారు. నమీబియాలో అత్యంత పేరున్న ప్రముఖ ఎడారిమొక్క వెల్‌విట్షియా మిరాబిలిస్ పేరుతో ఈ అవార్డును అందిస్తున్నారు. అంతకుముందు ప్రధానిమోడీ నమీబియా అధ్యక్షురాలు నెటుంబో నాండిఎన్‌దైత్వాతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. డిజిటల్ టెక్నాలజీ, రక్షణరంగం, భద్రత, వ్యవసాయం, హెల్త్‌కేర్, విద్యారంగం, సంక్లిష్ట ఖనిజ వనరులపరంగా పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. ప్రతినిధిబృందం స్థాయిలో ఇరువురునాయకులు భారత్ నమీబియా సంబంధాలను పునఃసమీక్షించారు. వాణిజ్యం, ఇంధనం, పెట్రోకెమికల్స్ రంగాల్లోపరస్పర సహకారంపైనా విస్తృత స్థాయిలో చర్చలు జరిపామన్నారు. ప్రాజెక్టుచీతాలో నమీబియా సహకారాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించిన ప్రధానిమోడీ ఆదేశ అధ్యక్షురాలికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ అతిధిగృహంలో ఉభయులమధ్య చర్చలుజరిగిన తర్వాత నాలుగు ఒప్పందాలు జరిగాయి. హెల్త్, ఔషధాలు, నమీబియాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి కేంద్రం ఏర్పాటు, సిడిఆర్ఐ ఫ్రేమ్‌వర్క్, గ్లోబల్ బయోఫ్యూయల్స్ ఫ్రేమ్‌వర్క్ విబాగాల్లో ఈఒప్పందాలు చేసుకున్నారు. నమీబియాలో భారత ప్రధానిహోదాలో నరేంద్రమోడీ పర్యటన ఇదే మొదటిసారికాగా ఈ ఆఫ్రికా దేశంలో మూడుసార్లు భారత ప్రధానులు పర్యటించినట్లయింది.

## ముఖ్యమంత్రి పర్యటన సాగేది ఇలా..

**సత్యసాయి జిల్లా, జులై 09, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువులో మెగా పేరెంట్ టీచర్ మీట్ (పిటిఎం) కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేయనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన ఇలా కొనసాగునుంది. అధికార వర్గాలు తెలియజేసిన మేరకు ముఖ్యమంత్రి పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి. ముఖ్యమంత్రి ఉదయం 8 గంటలకు ఉండవల్లి నుండి విజయవాడ ఎయిర్‌పోర్ట్ బయలుదేరి 8:10 కి చేరుకుంటారు. 8.15 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్ట్ నుండి బయలుదేరి ఉదయం 9 గంటలకు శ్రీ సత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు. 9:10 గంటలకు ఎయిర్ పోర్ట్ నుండి బయలుదేరి 9:25 గంటలకు కొత్తచెరువులోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. 9:30 గంటల నుండి 9:50 గంటల వరకు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఇష్టాగోష్టి నిర్వహిస్తారు. 9:55 నుండి మధ్యాహ్నం 1:00 వరకు మెగా పేరెంట్ టీచర్ మీట్ సభలో పాల్గొంటారు. ఒంటిగంటకు కొత్తచెరువులోని బాలుర జడ్పీహెచ్ఎస్ స్కూల్‌ను సందర్శించి అక్కడినుండి పుట్టపర్తి ప్రశాంత నిలయంకు 1:15 గంటలకు చేరుకుంటారు. 02:15 గంటల వరకు ప్రశాంతి నిలయంలో గడిపిన అనంతరం అక్కడి నుండి బయలుదేరి 02:25 గంటలకు శ్రీ సత్య సాయి విమానాశ్రయంకు చేరుకోనున్నారు. 02:35 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 3:30 గంటలకు విజయవాడ విమానాశ్రయంకు బయలుదేరి వెళ్లనున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి.

## డిసెంబరుకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు

>> క్వార్టర్లను సభాపతి అయ్యన్నపాత్రుడు పరిశీలించారు. ఈ డిసెంబర్ నాటికి అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అమరావతి క్వార్టర్స్‌లోనే ఉంటారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. అక్కడ జోరుగా పనులు సాగుతున్న పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని నివాస సముదాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచనలు చేశారు. చట్టసభ సభ్యులకోసం మొత్తం 12 టవర్లలో 288 క్వార్టర్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. 35 మంది మంత్రులు, 36 న్యాయమూర్తుల క్వార్టర్స్ మార్చి నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మండలి ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ నివాస సముదాయాలు మంత్రుల క్వార్టర్స్‌తో పాటే ప్రత్యేక గుర్తింపు ఉండేలా చూడాలని సూచించారు. స్విమ్మింగ్ పూల్, ఆసుపత్రి, క్లబ్ హౌస్ వంటివి కూడా అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను స్పీకర్ ఆదేశించారు. సోలార్, గ్రౌండ్ వాటర్ రీఛార్జ్, వేస్ట్ వాటర్ యూజెస్ వంటి అన్ని వసతులు ఉండేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసం, రాజ్ భవనన్‌లు కృష్ణా నది వెంబడి ఉంటాయన్నారు. అమరావతి నిర్మాణానికి మలివిడతలో మరో 34,964 ఎకరాల సేకరణకు సిఆర్‌డిఎ ఇప్పటికే ఆమోదం తెలిపింది. తొలివిడతలో ఇచ్చిన ప్యాకేజీనే దీనికీ వర్తించనుంది. అలాగే రాజధానిలో 58 ఎకరాల్లో పిపిఎవిధానంలో నివాస, మిశ్రమఅభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టాలని అథారిటీ సమావేశంలో నిర్ణయించారు.. మరికొన్ని సంస్థలకు సైతం భూకేటాయింపులు చేస్తూ ఆమోదం తెలిపారు.
మహిళ సాధికార సభ్యుల సదస్సు సెప్టెంబర్ 14, 15 తేదీల్లో తిరుపతి వేదికగా చట్టసభల జాతీయ మహిళ సాధికార సభ్యుల సదస్సు ఉంటుందని శాసనసభపతి అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో సభాపతి అయ్యన్నపాత్రుడు మీడియాతో ముచ్చటించారు. ఏపీ ఆతిథ్యం ఇవ్వాలన్న పార్లమెంట్ స్పీకర్ సూచన మేరకు దీనిని నిర్వహిస్తున్నామని తెలిపారు. దాదాపు 500 మంది ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ కమిటీ సభ్యులు అన్ని రాష్ట్రాల నుంచి పాల్గొంటారన్నారు.



బుధవారం మంత్రి లోకేష్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న బిజెపి నూతన అధ్యక్షుడు మాధవ్

## లోకేష్‌ను కలిసిన రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షుడు మాధవ్

**విశాఖపట్నం ప్రతినిధి, జూలై 9, ప్రభాత వార్త :** రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన పివిఎన్ మాధవ్... మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లి నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్... మాధవ్‌ను మంగళగిరి శాలువాతో సత్కరించారు. ప్రతిపక్షంలో ఉండగా శాసనమండలిలో ప్రజాసమస్యలపై కలిసి పోరాడిన సందర్భాన్ని ఇద్దరు నేతలు నెమరు వేసుకున్నారు. మృదు స్వభావిగా పేరున్న మాధవ్‌కు రాష్ట్ర సమస్యలపై సంపూర్ణ మైన అవగాహన ఉంది. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం కలిసి పని చేద్దామని లోకేష్ అన్నారు.

## మాధవ్ బాధ్యతల స్వీకరణ

>> కళాక్షేత్రం వద్ద బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన మాధవ్ అనంతరం ర్యాలీగా బిజెపి రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. ఆయన వెంట భారీ సంఖ్యలో బిజెపి శ్రేణులు తరలివచ్చారు. ఇక, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ విగ్రహానికి పుష్ప మాల వేసి బాధ్యతలు స్వీకార కార్యక్రమానికి పివిఎన్ మాధవ్ బయలుదేరారు. అయితే ఈ సందర్భంగా పుస్తకప్రియులకు స్వర్గధామంగా ఉన్న విజయవాడలోని లెనిన్ సెంటర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. లెనిన్‌కి భారత దేశానికి ఎటువంటి సంబంధం లేదన్న ఆయన విశ్వనాథ సత్యనారాయణ విగ్రహం చుట్టూ మంచి వాతావరణం నిర్మాణం చేయాలి. వారి పట్ల నిర్లక్ష్యం తగదు అన్నారు. ఇక మీదట ఇది లెనిన్ సెంటర్ కాదు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సెంటర్‌గా పిలవాలిఅంటూ వ్యాఖ్యానించారు పివిఎన్ మాధవ్. ఇక సంస్థాగతంగా సభ్యత్వాలు ఎన్నికలు సంపూర్ణంగా జరిగాయి. బిజెపి ప్రతీ కార్యకర్త అంకిత భావంతో పని చేయడం వల్ల 25 లక్షల సభ్యత్వం చేరుకున్నాం అన్నారు. బిజెపి ఎంపి పురందేశ్వరి బిజెపిలో అంతర్గత ప్రజాస్వామ్యం ఆధారంగా అన్నిస్థాయిలలో అధ్యక్షుల ఎన్నిక జరిగింది. జాతీయ కౌన్సిల్ మెంబర్ల నియామకం కూడా జరిగింది. మాధవ్ తండ్రి చలపతిరావు పోరాట పటిమ కలిగిన వ్యక్తి ఎమర్జెన్సీలో కూడా చలపతిరావు దంపతులు జైలుకువెళ్లారు. సంస్థాగత అంశాలపట్ల పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి మాధవ్ అని పేర్కొన్నారు. కార్యకర్తలు అందరూ బిజెపి కుటుంబసభ్యులు రెండు సంవత్సరాల నా ప్రస్థానంలో నాకు సహకారం అందించిన వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు పురందేశ్వరి. ఇక రాష్ట్ర కార్యకర్తలు అందరూ మాధవ్‌ని అధ్యక్షుడిగా స్వాగతిస్తున్నారు. మాధవ్ అధ్యక్షుడుగా ప్రకటన జరిగాక పాజిటివ్ వైబ్రేషన్స్ వచ్చాయి అన్నారు. బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు రాష్ట్రంలో బిజెపిని మంచి స్థాయికి తీసుకెళ్లే పరిస్థితులు ఉన్నాయి. అన్ని రాష్ట్రాల్లో బలోపేతం అవ్వడమే ఎమ్మెల్సీ సోము వీర్రాజు బిజెపి ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు.

## రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్ల వద్ద సిసి కెమెరాల ఏర్పాటుపై అడ్వోకేట్స్ కమిటీ!

**విజయవాడ, జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు అంశంపై ఏపీ హైకోర్టు సందేహాన్ని వ్యక్తం చేసింది. ఈ అంశంపై అడ్వోకేట్ కమిటీ వేస్తామని వెల్లడించారు. ఒక హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా విజయవాడ మూడవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నివేదికను హైకోర్టు ధర్మాసనం ప్రస్తావించింది. విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో ఒక సీసీ కెమెరా మాత్రమే ఉన్నట్లు మేజిస్ట్రేట్ నివేదికలో పేర్కొన్నారని గుర్తుచేసింది. అయితే, స్టేషన్‌ను వ్యక్తిగతంగా తనిఖీ చేసి ఠాణా మొత్తం కవర్ అయ్యేలా సీసీకెమెరాలు ఏర్పాటు చేసినట్లు విజయవాడ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ సర్టిపై చేస్తూ కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారని తెలిపింది. పరస్పర భిన్న నివేదికల నేపథ్యంలో ఎస్‌డీపీవోలు సమర్పించిన నివేదికల వాస్తవికతను తేల్చేందుకు అడ్వోకేట్ కమిటీని ఏర్పాటు చేస్తామని హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని పోలీసుస్టేషన్లలో పర్యటించి ఎన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు? స్టేషన్ మొత్తం కనిపించేలా ఏర్పాటు చేశారా?లేదా? తదితర అంశాలపై కమిటీ నుంచి నివేదిక కోరతామని పేర్కొంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్ని స్టేషన్లలో సీసీకెమెరాలు ఏర్పాటు చేయలేదో వివరాలు తమ ముందు ఉంచాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎసజీపీ)ని ఆదేశిస్తూ విచారణను వారం రోజులకు వాయిదా వేసింది.
ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2019లో న్యాయవాది తాండవ యేగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ఆ మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని 2019 జూలై 15న ఆదేశాలిచ్చింది. ఏళ్లు గడుస్తున్నా ఉత్తర్వులు అమలుకాకపోవడంతో యోగేష్ 2022లో కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు పల్నాడుజిల్లా, మాచవరం పోలీసులు తన సోదరుడు గోపిరాజును అక్రమంగా నిర్బంధించారంటూ కటారు నాగరాజు గతేడాది నవంబరులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్‌ల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని పోలీసు యంత్రాంగం ఏపీ హైకోర్టుకు వివరించింది. ఇందుకు సంబంధించి ఆయా డిఎస్‌పిలు రూపొందించిన నివేదికలు హైకోర్టుకు సమర్పించారు.
పోలీస్ స్టేషన్ లోపల, బయట కనబడేలా వాటిని ఏర్పాటు చేశామన్న నివేదికలపై హైకోర్టు సందేహాలను లేవనెత్తింది. సిసి కెమెరాల ఏర్పాటుపై వాస్తవాల నిర్ధారణ కోసం అడ్వకేట్స్ కమిటీ వేస్తామని స్పష్టం చేసింది. పోలీసులు ఇచ్చిన నివేదికకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకూ పొంతన లేదని వ్యాఖ్యానించింది. విజయవాడ సైబర్ క్రైమ్ పిఎస్సే నిదర్శనమని చెప్పింది. చాలా పిఎస్‌లలో సిసి కెమెరాలను ఏర్పాటు ఎందుకు చేయలేదో చెప్పాలంది. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో అన్నీ కనిపించేలా సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని విజయవాడ అసిస్టెంట్ కమిషనర్ నివేదిక ఇచ్చారని, ఇక్కడికి చెందిన మరో కేసులో సంబంధిత మెజిస్ట్రేట్ మాత్రం కేవలం ఒక్క సిసి కెమెరా ఉందని తమకు నివేదిక ఇచ్చారని చెప్పింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు అన్ని పిఎస్‌లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ న్యాయవాది తాండవ యోగేష్ 2019లో వేసిన పిల్‌ను మంగళవారం జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం విచారించింది. రాష్ట్రంలో 1,392 పోలీస్ స్టేషన్లు ఉంటే 1,001 స్టేషన్లలో మాత్రమే సిసి కెమెరాలు ఉన్నాయని పిటిషనర్ వాదన. లాకప్‌లున్న అన్ని పిఎస్‌లలో ఏర్పాటు చేశామని ప్రభుత్వ వాదన. లాకప్‌లు లేనిచోట కెమెరాలు పెట్టలేదని చెప్పింది.

## వాహనాలకు భారీగా గ్రీన్‌టాక్స్ తగ్గింపు

>> చారు. ఈ నిర్ణయంతో పాటుఅమరావతిలో వరల్డ్ ఎకానమీ ఫోరం నిర్మాణ ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేసింది. కుళాయి నీరు అందించేందుకు రూ.10 వేలకోట్ల రుణాల సమీకరణకు క్యాబినెట్ అనుమతి ఇచ్చింది. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటు ద్వారా రూ.4 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని భావిస్తున్నాం. ఎపి స్పేస్ పాలసీ 2025-30కి మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. వైకాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్‌ట్యాక్స్‌ను దారుణంగా పెంచింది. దాన్ని రూ.3 వేల వరకు తగ్గించాం అని పార్థ సారథి తెలిపారు. గ్రీన్ ట్యాక్స్ రేటును తగ్గిస్తూ, ఈ వాహనాలు చెల్లించే త్రైమాసిక పన్నుపై ఆధారపడటం కాకుండా కొత్త పన్ను రేట్లను రూ.1,500 మరియు రూ.3,000/ గా నిర్ధారించారు. ఈ నిర్ణయం ద్వారా 9,56,429 మందికి లబ్ధి చేకూరనుంది. కాలం చెల్లిన వాహనాల సంఖ్యను తగ్గించడానికి గ్రీన్ ట్యాక్స్ పెంచే అవకాశం కేంద్రంఇవ్వగా గత ప్రభుత్వం గ్రీన్ ట్యాక్స్‌ను భారీగా పెంచింది. గతంలో ఏడేళ్లు దాటిన సరకు, ప్రజా రవాణా వాహనాలకు ఏడాదికి రూ.200 ఫీజు ఉండేది. కానీ గత ప్రభుత్వం దానిని మార్చి ఎక్కువ పన్నులు వేసింది. 7-10 ఏళ్ల వాహనాలకు సగం త్రైమాసిక పన్ను, 10-12 ఏళ్ల వాహనాలకు ఒక త్రైమాసిక పన్ను, 12 ఏళ్లు దాటిన వాహనాలకు రెండు త్రైమాసికాల పన్నులు వసూలు చేసే విధానాన్ని 2022 జనవరి 1 నుంచి అమలు చేశారు. దీనివల్ల వాహనదారులపై చాలా భారం పడింది. లారీ యజమానులు చాలా ఇబ్బంది పడ్డారు. గత విధానంలో ఏడాదికి రూ.20 వేల వరకు ఉన్న పన్నును ఇప్పుడు రూ.1,500 నుంచి రూ.3 వేలకు తగ్గించారు. ఈ నిర్ణయం ద్వారా 9,56,429 మందికి లబ్ధి చేకూరనుంది.

# నేడు మెగా 'పేరెంట్-టీచర్స్' మీట్

>> విద్యార్థులు, 3,32,770 మంది ఉపాధ్యాయులు, 1,49,92,456 మంది తల్లిదండ్రులు, దాతలు ఈ వేడుకలో పాల్గొనున్నారు. మొత్తంగా 2.28 కోట్ల మంది ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ మెగా పేరెంట్ టీచర్ సమావేశం సరికొత్త రికార్డు సృష్టించనుంది. ఇక ప్రతీ ఏడాది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయ సమావేశాన్ని పిటిఎం పేరిట ప్రభుత్వం నిర్వహించనుంది. కార్పొరేట్ స్కూళ్లకు మాత్రమే పరిమితమైన ఈ పేరెంట్ టీచర్ మీటింగ్స్‌ను ప్రభుత్వ అధీనంలో నడిచే పాఠశాలలో నిర్వహించాలని మంత్రి నారా లోకేష్ సంకల్పించారు. ఈ మేరకు వరుసగా రెండో ఏడాదికూడా పండుగవాతావరణంలో విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, ఇతర భాగస్వాములతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

**తల్లిదండ్రులకు పురోగతి కార్డుల అందజేత**

తమ పిల్లలు చదువులో ఎంత పురోగతి సాధిస్తున్నారు, వారి ప్రవర్తన ఎలా ఉంది, సామాజిక సమస్యలపై అవగాహన చేసుకుంటున్నారా అనే అంశాలపై తల్లిదండ్రులు నేరుగా తెలుసుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా కలగనుంది. అంతేకాదు...విద్యార్థుల చదువులకు సంబందించిన సమగ్ర పురోగతి కార్డులను తల్లిదండ్రులకు ప్రభుత్వం అందించనుంది.
తల్లిదండ్రులు కూడా వారి అభిప్రాయాలను, సూచనలను ఈ వేదిక ద్వారా ప్రభుత్వంతో పంచుకోవచ్చు. పాఠశాల విద్యలో పనితీరు, మోలిక సదుపాయాలు వంటి అంశాలపై చర్చించుకునే సదావకాశం ఈ కార్యక్రమం ద్వారా కలగనుంది.

# అడ్డంకులు సృష్టిస్తే సహించం

>> నాదెండ్ల మనోహర్‌కి ప్రభుత్వం అప్పగించింది. ఇదే అంశంపై మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. రైతులకు ధాన్యం కొనుగోళ్ల బకాయిలు రూ.672కోట్లు విడుదలకు మంత్రివర్గం సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం ద్వారా దాదాపు 32 వేల మంది రైతులకు ఈ నిధులు మంజూరు ద్వారా లబ్ది చేకూరుతోందన్నారు. 24 గంటల్లో రైతుల ఖాతాల్లో పెండింగ్ బకాయిలు జమ చేయాలని అధికారులను ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ప్రజా పంపిణీ అవసరాల కోసం పౌరసరఫరాల సంస్థ ద్వారా గత రబీ సీజన్‌లో ప్రభుత్వం ధాన్యాన్ని సేకరించింది. ఆ క్రమంలో మద్దతు ధరను రైతుల ఖాతాల్లో జమ చేయడంలో జాప్యం జరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా రూ.1,000 కోట్లు రుణం తీసుకోవడానికి అనుమతిస్తూ జులై 4వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందుకోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది .ఈ నిధులు వచ్చిన వెంటనే ధాన్యం బకాయిలను రైతుల ఖాతాల్లో జమ చేసేలా పౌరసరఫరాల సంస్థ అధికారులు చర్యలు చేపట్టనున్నారని మంత్రి సమావేశంలో వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా వైఎస్సార్సీ చూస్తుందని కేబినెట్‌లో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. ఎపిఎండీసీ బాండ్లల్లో పెట్టుబడులు పెట్టవద్దని ఈ మెయిళ్లు పెట్టారని తెలిపారు. 200 కంపెనీలకు తప్పుడు ఈ మెయిళ్లు పెట్టారని సిఎం చంద్రబాబు దృష్టికి ఆయన తీసుకెళ్లారు. వైఎస్సార్సీనే తమ పార్టీ సానుభూతిపరుడితో ఈ మెయిళ్లు పెట్టించిందని చెప్పారు. అదేవిధంగా అమరావతికి నిధులు రాకుండా తప్పుడు ఫిర్యాదులు చేసిందని, ఈ మెయిళ్ల అంశాన్ని కూడా తీవ్రంగా పరిగణించాలని మంత్రులు సిఎంకు తెలియజేశారు. ఈ క్రమంలో వీటిపై చంద్రబాబు స్పందించారు. ప్రభుత్వ బ్రాండ్ దెబ్బతినేలా వివిధ సంస్థలకు ఈ మెయిళ్లు పెట్టడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై విచారణకు ఆదేశిస్తామని తెలిపారు. నిధులు రాకుండా తెరవెనుక అడ్డుకోవడం వారికి అలవాటుగా మారిందని ఆరోపించారు. పథకాలు ఇవ్వడం లేదంటూ దుష్ప్రచారం చేస్తుందని ఆక్షేపించారు. వైఎస్సార్సీ దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. రాజధానికి మలివిడతలో 34,964 ఎకరాల భూ సమీకరణకు ఆమోదం.13 గ్రామాల పరిధిలో ఈ భూ సమీకరణ,అమరావతి నిర్మాణ పనులకు అవసరమైన ఇసుకను కృష్ణానది నుండి డ్రెడ్జింగ్,సిబిఐ,జడ్ఎస్ఐ భూములు కేటాయించే అంశాలపై చర్చించారు.స్పోర్ట్స్ అకాడమీకి భూముల కేటాయింపుపై చర్చ జరిగింది. జలవనరుల శాఖలో 71 పనులకు ఆమోదం తెలపనున్నారు. జలవనరుల శాఖలో వివిధ మీడియం ప్రాజెక్టుల మరమ్మత్తులకు నిధులపై చర్చించారు. ఎపి జలజీవన్ నీటి సరఫరా కార్పొరేషన్ ఏర్పాటుపై కేబినేట్‌లో చర్చ జరిగింది. ఎపి మోటార్ వెహికల్ బిల్లులో పలు చట్ట సవరణలు,పరిశ్రమలు,కార్మిక బిల్లులో పలు చట్ట సవరణలు చేసే అంశంపై చర్చించారు.అమరావతి పరిధిలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అమరావతి పరిధిలో భూమి లేని 1,575 పేద కుటుంబాలకు పింఛన్ కొనసాగింపుపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్ కొనసాగించేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. సమావేశంలో అభివృద్ధి పథకాలకు అడ్డంకులు సృష్టించాలనుకుంటున్న వైకాంగ్రెస్‌పార్టీకి తీవ్ర స్థాయిలో గుణపాఠం చెప్పాలని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఇంటింటికి మంచి నీటిని అందించే దిశలో ఎపి జలజీవన్ నీటి సరఫరా కార్పొరేషన్ ఏర్పాటుపై ఆయన సమావేశంలో ప్రస్తావించారు. సీఎం చంద్రబాబు ఇదే సమావేశంలో కొందరు మంత్రులు పనితీరు మార్చుకోవాలని చంద్రబాబు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య లిమిటెడ్‌కు (ఇప్పటికే పొందిన రూ.6700.00 కోట్ల రుణంతో పాటు) రూ.1000.00 కోట్ల అదనపు రుణాన్ని మంజూరు చేయడానికి, జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుండి క్రెడిట్ పొందేందుకై ప్రభుత్వ హామీని పొడిగిస్తూ మరియు 2024- 25 రబీ కార్యకలాపాల వర్కింగ్ క్యాపిటల్ అవసరాలను (పెండింగ్‌లో ఉన్న రైతు బకాయిల కోసం) తీర్చడానికి మరియు వాటా మూలధనాన్ని 10 కోట్ల నుండి 20 కోట్లకు పెంచడానికి ఇంటర్‌కార్పొరేట్ లోన్‌గా విజయవాడలోని స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు బదిలీ చేయడానికి జీవో నెంబరు.25, వ్యవసాయ కోఆపరేటివ్ విభాగం, ద్వారా జారీ చేయబడిన ఉత్తర్వులను ఆమోదించడానికి వ్యవసాయ,సహకార శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది.
కోకో రైతులకు సరసమైన ప్రోత్సాహక ధరలను అందించడానికి, వారి ఆర్థిక ప్రగతికి మద్దతునివ్వడానికి, రాష్ట్రంలో కోకో సాగును స్థిరీకరించేందుకు మరియు నష్టాలతో అమ్ముకోకుండా రైతులను రక్షించడానికి ప్రభుత్వ మద్దతు ధరగా కిలోకు రూ. 50/ చొప్పున రూ. 14.884 కోట్లు మంజూరు చేయడానికి మరియు ప్రస్తుత సీజన్‌లో నిర్దేశించిన అమ్ముడుపోని 2976.76 మెట్రిక్ టన్నుల కోకో గింజలను ప్రామాణిక ఆపరేటింగ్ విధానంతో సేకరించేందుకు వ్యవసాయ మరియు సహకార శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది.

### వారం - వర్జ్యం

10-07-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు
పౌర్ణమి రా.2.05
పూర్వాషాఢ పూర్తి
వర్జ్యం : మ.2.52-4.33
దు.ఉ.10.03-10.55, 2) మ.3.16-4.08
శుభసమయం:ఉ.6.15-7.00, సా.6.10-7.00
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**మేషం:** సన్నిహితుల సహాయంతో ముఖ్యమైన వ్యవహారాలు పూర్తిచేస్తారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

**వృషభం:** ఆస్తి వ్యవహారాలలో ఎదురైన చికాకులు కొంతవరకు తీరుతాయి. వివాహం ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి.

**మిథునం:** కొంతకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు కొంతవరకు తీరుతాయి.

**కర్కాటకం :** జీవిత భాగస్వామి సహాయ సహకారాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వస్తులాభాలు.

**సింహం:** బంధువుల నుండి శుభవార్తలు అందుకొంటారు. ఆస్తి వ్యవహారాలలో ఎదురైన చికాకులు కొంతవరకు తీరుతాయి.

**కన్య :** కాంట్రాక్టులు అతికష్టం మీద దక్కించుకొంటారు. రాజకీయ, పారిశ్రామిక రంగాలలోని వారికి కొంత అనుకూలంగా వుండును.

**తుల :** మీలోని ప్రతిభకు గుర్తింపు పొందుతారు. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**వృశ్చికం:** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. సంతానం నాకు సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.

**ధనుస్సు:** గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**మకరం:** కొత్త కార్యక్రమాలకు, వ్యాపారాలు ప్రారంభిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**కుంభం:** భాగస్వామ్య వ్యాపారాలు ప్రారంభిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మీనం :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## నదుల అనుసంధానమే లక్ష్యం

>> మరమ్మతులకు రూ. 350 కోట్ల నిధులు విడుదల చేశామని వెల్లడించారు. శ్రీశైలం ప్రాజెక్టు జాతి సంపద అని, మనం దాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. వెంటిలేటర్ మీద ఉన్న ఆర్థిక వ్యవస్థను ఐసీయూలకు తెచ్చామని వ్యాఖ్యానించారు. నీళ్లు పారించాలని చంద్రబాబు అనుకుంటూ ఉంటే, జగన్ రప్పరప్ప అంటూ రక్తం పారించాలనుకుంటున్నారని నిమ్మల దుయ్యబట్టారు. మహిళలను కించపరిచే సంస్కృతి వైఎస్సార్సీ అధినాయకత్వం నుంచి ఉందని మండిపడ్డారు. ఆరోజు చెల్లిని తల్లిని జగన్ అవమానించారని, ఇవాళ కూడా ఆ పార్టీ అదే తీరులో ఉందని దుయ్యబట్టారు. పట్టిసీమ నిర్మాణమైన రోజు నుంచి ఇప్పటి వరకూ గోదావరి వరద జలాలను కృష్ణా డెల్టాకు ఉపయోగించుకుంటున్నామన్నారు. రాయలసీమకు సంబంధించిన ఏ రిజర్వాయర్‌ను చూసినా 90 నుంచి 95 శాతం నీటి సామర్థంతో నిల్వ చేయగలిగాం. దీనికి ప్రధానంగా సీఎం చంద్రబాబు ముందుచూపు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అప్పట్లో కేవలం రూ.1300 కోట్లతో పట్టిసీమను నిర్మిస్తే ఇప్పుడు దాని ద్వారా రూ.50,000 వేల కోట్ల సంపదను సృష్టించిందంటే ఇది కృష్ణాడెల్టాకు వరప్రదాయినిగా భావించవచ్చునన్నారు.

## సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన క్వాంటమ్ వ్యాలీకి భూమి

**విజయవాడ, జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి రాజధాని అమరావతిలో స్థల సేకరణ దిశలో కార్యచరణను చేపట్టారు. రూ.4వేల కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్ట్ కోసం ఉద్దండరాయునిపాలెం,లింగాయపాలెం మధ్య సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన ప్రభుత్వం 50 ఎకరాలను కేటాయించింది. ఈ స్థలంలో మట్టి పరీక్షలు నిర్వహించారు. జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తయ్యాయి. ఈ-3 రోడ్డు,ఎన్-10 రోడ్డు అనుసంధానమయ్యే ప్రాంతంలో ప్రాజెక్టు రానుంది. క్వాంటమ్ వ్యాలీ లోని ఐకానిక్ భవనం కోసం డిజైన్లు తయారవుతున్నాయి. సిద్ధమైన వాటిలో సిఎం చంద్రబాబు పలుమార్పులు సూచించారు. దీంతో నమూనాకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఇది ఖరారైనతర్వాత టెండర్లు పిల్చి కాంట్రాక్టరును ఎంపిక చేయనున్నారు. వచ్చే జనవరి నాటికి క్వాంటమ్ వ్యాలీని అమరావతిలో అందుబాటులోకి తీసుకుని రావాలని ఎపి ప్రభుత్వం భావిస్తోంది.,అనుకున్న సమయానికి వ్యాలీని పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉంది.

## హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్మోహాన్ రావు అరెస్టు

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** గత మార్చిలో జరిగిన ఐపిఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు (ఎస్ఆర్‌హెచ్)ను టికెట్ల విషయంలో తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఘటనలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు సహా ఇతర సభ్యులను సిఐడి అధికారులు బుధవారం నాడు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అప్పట్లో జరిగిన గోల్‌మాల్ వ్యవహారాలకు సంబంధించి కీలక పత్రాలను కూడా సిఐడి జప్తు చేసింది. అనంతరం అరెస్ట యిన వారిని లక్‌డికాపూల్‌లోని సిఐడి కార్యాలయానికి తరలించి అక్కడ ప్రశ్నిస్తున్నారు.
బిసిసిఐ పరిధిలో దేశ వ్యాప్తంగా వున్న రాష్ట్రస్థాయి క్రికెట్ సంఘాలలో తీవ్రమైన అభియోగాలను ఎదుర్కొంటున్న హెచ్‌సిఎ మరోమారు వార్తల్లో నిలిచింది. హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు సహా ఆయన సహచర సభ్యులను సిఐడి అరెస్టు చేయడం సంచలనం రేపింది. ఈ ఏడాది ముగిసిన ఐపిఎల్ సీజన్‌లో హైదరాబాద్ ఫ్రాంఛైజీ అధిపతి ఎస్ఆర్‌హెచ్‌కు ఉప్పల్ స్టేడియం వాడుకునేందుకు హెచ్‌సిఎ అనుమతి ఇచ్చింది.

# తిరుమల సమాచారం

## టిటిడి భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

### - బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు



**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి దాతలు,భక్తులు ఇచ్చిన భూములు తెలంగాణాలో కూడా ఉన్నాయని, భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర బిజెపి నూతన చీఫ్: రామచంద్రరావు తెలిపారు. ఖమ్మంలో కూడా టిటిడి స్థలాలు ఉన్నాయని, అక్కడ అన్యమతస్తులు కొందరు రాజకీయ అండతో వాటిని కబ్జాచేసుకుని గోడను కూలగొట్టి వ్యాపారాలు చేసుకుంటున్నారని అన్నారు. దేవుని స్థలాలను వాణిజ్యకార్యకలాపాలకు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఆక్రమణలు ఆపాలని, టిటిడి భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడేందుకు బిజెపి తరపున ప్రయత్నిస్తానని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళతానన్నారు. బిజెపి తెలంగాణ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా బుధవారం ఉదయం అనురులతో కలసి తిరుమలకు చేరుకున్న రామచంద్రరావుకు టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి స్వాగతం పలికి దర్శనం చేయించారు. ఆలయ అదికారులు రంగనాయకులు మండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తెలంగాణ బిజెపి చీఫ్‌గా శ్రీవారి దర్శనం చేసుకున్నామని ఆనందం వ్యక్తం చేశారు.

## హోటళ్ల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు, పరిశుభ్రత ప్రధానం

### - టెండర్‌ప్రాసెస్‌పై యజమానులకు అవగాహన



**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం తిరుమలకు వస్తున్న భక్తుల అవసరాలకు తగ్గట్లు సాంప్రదాయమైన ఆహారపదార్థాలను అందించేందుకు టిటిడి తాజాగా జనతా,పెద్ద హోటళ్ళకు టెండర్లు ఖరారుచేస్తోంది. ఈ టెండర్లలో వ్యాపారులు పాల్గొని నిర్వహణకు ముందు హోటళ్ళ నిర్వాహకులతో బుధవారం మధ్యాహ్నం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సమావేశం నిర్వహించారు. తిరుమలకు శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు జనతా,పెద్ద హోటళ్ళు, క్యాంటీన్లలో నాణ్యమైన రుచికరమైన సాంప్రదాయ ఆహారపదార్థాలను అందించాలన్నారు. తిరుమలకు వస్తున్న భక్తులకు సేవా దృక్పథంతో నాణ్యమైన ఆహారపదార్థాలు, లాభాపేక్ష లేకుండా పరిశుభ్రతతో నిర్దేశించిన ధరలకు అందించాలని ఇఒ తెలిపారు. గతనెల 23న జారీచేసిన నోటిఫికేషన్ మేరకు సదరు ఈఐఒ సంబంధించిన సందేహాలపై గుర్తింపు ఉన్న హోటళ్ళ నిర్వాహకులు తమ ఆసక్తిని వ్యక్తం చేసేందుకు ప్రీ బిడ్ సమావేశమయ్యారు. నిర్ధారించిన నియమాలకు లోబడి హోటళ్ళు, క్యాంటీన్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పెద్దహోటళ్ళ నిర్వాహకులు, టిటిడి అదనపు ఎప్ఎఒ రవిప్రసాదు, తిరుమల ఎస్టేట్ అధికారి కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వానరాల నుండి భక్తులకు రక్షణ

### - స్మార్ట్‌స్టిక్స్‌తో ఆలయ పరిసరాల్లో నిఘా



**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో వానరాలు(కోతులు)బెడద తీవ్రమైంది. అటవీప్రాంతంలో ఉండే వానరాలు ఆహారం కోసం జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. గత వారంరోజులుగా తిరుమల ఆలయం పరిసరాల్లో మాఢవీధుల్లో కూడా వానరాలు సంచారం పెరిగింది. కాటేజీలు,అతిథిగృహాలు, ప్రముఖులు బసచేసే ప్రాంతాల్లోనూ వీటి సంచారంతో భక్తులు భయపడుతున్నారు. భక్తుల చేతుల్లో సంచులను లాగేయడం, ప్రసాదాలను లాక్కెళ్లడం చేస్తున్నాయి. దీంతో టిటిడి ఈ వానరాలను పట్టుకోవడం, లేదా దూరంగా తరిమేయడం చేసేందుకు టిటిడి అటవీశాఖను ఆదేశించింది. టిటిడి డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు వానరాల బెడదను తప్పించేందుకు బ్యాటరీతో పనిచేసే స్మార్ట్‌స్టిక్స్ తెప్పించారు. ఈ స్టిక్స్‌కు పైభాగంలో ఫోకస్‌లైటింగ్ అమర్చారు. ఎక్కడైనా వానరాలు ఉంటే వాటిని తరిమేయడానికి ఈ స్టిక్‌క్రింద ఉన్న బటన్ నొక్కితే లైట్ వెలిగి ఆ కాంతికి వానరాలు పరారవుతాయి. వీటిని ప్రస్తుతం రెండు తెప్పించారు. అవసరమైన ప్రాంతాల్లో ఈ రెండింటిని అటవీశాఖ సిబ్బంది వినియోగిస్తారు.

## వెంకటేశ్వరస్వామి దర్శనంతో అనుభూతి

### - శ్రీవారి సేవలో తమిళనాడు సిజె జస్టిస్ శ్రీరామ్



**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** భగంతుని నామస్మరణతో ప్రజలు భక్తిభావంతో మెలిగినపుడే ఆ దేవుని దర్శనం అనుభూతి కలుగుతుందని తమిళనాడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీరామ్ విశ్వాసం వెలిబుచ్చారు. కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుంటే మనసు ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని అన్నారు. తిరుమలలో భక్తులకు దర్శన ఏర్పాట్లు బావున్నాయని, భక్తులు సంతోషంగా స్వామివారిని దర్శనం చేసుకోగలుగుతున్నారన్నారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో తమిళనాడు సిజె జస్టిస్ శ్రీరామ్ కుటుంబంతో కలసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కేంద్రం సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతం: ఎమ్మెల్యే సిఎం రమేశ్



**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఏడాది పాలనలో అమలుచేస్తోందని, విజయవంతంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తోందని బిజెపి ఎమ్మెల్యే సిఎం రమేశ్ తెలిపారు. క్రమక్రమంగా హామీలు అమలుచేసుకుంటూ వాగ్దానాలను నిలబెట్టుకుంటోందన్నారు. కేంద్రం సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు, సాఫ్ట్‌వేర్ సంస్థలు వస్తున్నాయన్నారు. పురోభివృద్ధిని కూటమి ప్రభుత్వం సాధిస్తుందన్నారు. కృష్ణగోదావరి నదులు నీటితో పుష్కలంగా నిండాయని, రైతులకు ఎటువంటి నీటిసమస్యలేకుండా దేవదేవుడు కరుణించాడని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులతో కలసి బుధవారం ఎమ్మెల్యే సిఎంరమేశ్ తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## స్థానికత ఉన్న హోంగార్డులను రాష్ట్రానికి రప్పించండి

### - సీఎం చంద్రబాబుకు విజ్ఞాపన పత్రాలు ఇచ్చిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



హోంగార్డులు, విదేశీ వైద్యా గ్రాడ్యుయేట్లు సమస్యలపై సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ కె.రామకృష్ణ

**విజయవాడ, జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** హోంగార్డుల వేతనాల పెంపు, విదేశీ వైద్య విద్య పట్టభద్రుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ప్రభుత్వాన్ని కోరింది.సుదీర్ఘకాలం నుంచి అపరిష్కృతంగా ఈ సమస్యలున్నాయని ప్రభుత్వానికి తెలిపింది.సీపీఐ రాష్ట్ర కార్యాలయం విడుదల చేసిన ప్రకటనను అనుసరించి ఈ అంశంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి,మాజీ ఎంఎల్ఏ కె.రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన ఆయన విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. వైద్యవిద్యలో విదేశాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఏపీకి చెందిన విద్యార్థులకు ఏపీ వైద్య మండలి శాశ్వత రిజిస్ట్రేషన్ నిరాకరిస్తోందని ఈ నిబంధనను సవరించేలా చూడాలని ఆయన ముఖ్యమంత్రికి విన్న వించారు. వైద్య నిపుణుల కొరత ఉన్న ప్రస్తుత తరుణంలో ఏపీఎంసీ నిబంధనల్ని మార్చుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణా, మహారాష్ట్ర, ఒడిశా, యూపీ లాంటి రాష్ట్రాల్లో ఇప్పటికే నిబంధనల్ని సవరించారని తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో హోంగార్డుల వేతనాల పెంపు, పోలీసు సెలక్షన్లలో రాయితీలు కల్పించే అంశంపైనా నిర్ణయం తీసుకోవాలని రామకృష్ణ కోరారు. ఏపీ తెలంగాణా రాష్ట్రాల స్థానికత కలిగిన హోంగార్డులను సొంత రాష్ట్రాలకు బదిలీ చేసేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 400 మంది ఏపీ స్థానికత కలిగిన హోం గార్డులు తెలంగాణాలో పనిచేస్తున్నారని వారిని రాష్ట్రానికి రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రామకృష్ణ సీఎంను కోరారు. వేతనం పెంపుతో పాటు పోలీసు సెలక్షన్లలో నిబంధనలను సడలించి హోంగార్డులకు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మహిళల పట్ల వైకాంగ్రెస్ తీరు సిగ్గుచేటు

### నారా భువనేశ్వరి



**విజయవాడ,జులై 9, ప్రభాతవార్త ప్రతి నిధి:** వైకాంగ్రెస్ పార్టీకి మహిళల పట్ల ఎటువంటి ద్వేష పూరిత అభిప్రాయం ఉందో మాజీ ఎంఎల్ఏ ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలు బహిర్గతం చేశాయని నారా భువనేశ్వరి అన్నారు. 'ఎక్స్' వేదికగా ఆమె మహిళల పట్ల వైకాపా తీరు సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. మహిళా వ్యతిరేక మనస్తత్వాన్ని ఆయన వ్యాఖ్యలు బహిర్గతం చేశాయని చెప్పారు.సమాజంలో ఇలాంటి వ్యాఖ్యలకు స్థానం లేదు. ఎంఎల్ఏ ప్రశాంతి రెడ్డికి నా సంఘీభావం ప్రకటిస్తున్నా... ఆమెపై చేసిన అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తునన్నారు.,.మహిళల పట్ల అవమానకర పదాలు వారి విలువను తగ్గించలేదు. స్త్రీల గౌరవాన్ని దెబ్బతీసే ఏ ప్రయత్నమైనా ఖండించాల్సిందేనన్నారు.వైకాంగ్రెస్ పార్టీ నేతలు ఇంకా ఈ విషయంలో ప్రసన్నకుమార్‌రెడ్డిని సమర్థించడం సరికాదన్నారు.

## ఉచిత బస్సు పథకం అమలుకు సన్నద్ధం

### ఆర్టీసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు



**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీలో అన్నీ విద్యుత్ బస్సులనే తీసుకోవాలని ఆర్టీసీ పాలకవర్గం నిర్ణయించిందని ఆ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. వీటికోసం బస్టాండ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయనున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా తగిన వసతులు కల్పించాలని నిర్ణయించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అధ్యక్షతన పాలకమండలి తొలి సమావేశం విజయవాడలోని ఆర్టీసీ కార్యాలయంలో జరిగింది. ఇందులో అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్టీసీ సంస్థ గతంలో 1,489 బస్సులు కొనుగోలు చేయగా, వీటిలో 904 బస్సులకు బాడీబిల్డింగ్‌కు టెండర్లు పిలిచి ఇచ్చారు. 518 ఎక్స్‌ప్రెస్ బస్సులకు మాత్రం రీటెండరు పిలిచి అదనపు ధరతో బాడీ బిల్డింగ్‌కు కాంట్రాక్టరు కు అవకాశం కల్పించారు. దీనికి రూ.75 కోట్ల చెల్లింపుల అంశం బోర్డులో చర్చకు రాగా కొందరు సభ్యులు దీన్ని ప్రశ్నించారు. మళ్లీ టెండరు పిలిచి, ధర ఎందుకు పెంచాల్సి వచ్చిందో వివరాలన్నీ వచ్చే బోర్డు సమావేశం నాటికి తెలియజేయాలని అన్నారు. రాయలసీమ జిల్లాల్లో బస్టాండ్ల పరిస్థితి ఎలా ఉందో కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకు ఆర్టీసీ సన్నద్ధమవుతోంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ నెరవేర్చడంలో భాగంగా ఆగస్టు 15 మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన దృష్ట్యా దీన్ని అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు సంస్థ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ అధ్యక్షతన ఏపీఎస్ ఆర్టీసీ పాలక మండలి సమావేశమైంది. విజయవాడలోని ఆర్టీసీ కేంద్ర కార్యాలయంలో జరిగిన భేటీకి ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్లు, ఈడీలు, సహా బోర్డు సభ్యులుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆర్టీసీకి సంబంధించి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తీర్మానాలు చేశారు.

## అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం అర్హుల జాబితా సిద్ధం

### - వ్యవసాయ శాఖ సంచాలకులు ఢిల్లీరావు

**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం అర్హుల జాబితా సిద్ధమైంది. ఏపీ వ్యవసాయశాఖ సంచాలకులు ఢిల్లీరావు ఈ విషయాన్ని ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్హులైన రైతుల జాబితాలను సంబంధిత రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రంలో ఉన్న జాబితాలో రైతులు వారి పేర్లను పరిశీలించుకోవచ్చని వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు తెలిపారు. అన్నదాత సుఖీభవ పోర్టల్ లోనూ ఆధార్ నెంబర్ ద్వారా తన అర్హతను తెలుసుకోవచ్చని వెల్లడించారు. మన మిత్ర వాట్సాప్ ద్వారా కూడా రైతులు వారి అర్హతను తెలుసుకునే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఆధార్ నెంబర్‌ను మన మిత్ర వాట్సాప్ నంబరు 9552300009కు పంపితే వివరాలు లభ్యమవుతాయని సూచించారు. రైతు పేరు లేని పక్షంలో, అర్హత ఉందని భావిస్తే రైతు సేవా కేంద్రంలో అర్జీతో పాటు పత్రాలు సమర్పించాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పోర్టల్ లోనీ గ్రీవెన్స్ మాడ్యులులో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 13 వరకు మాత్రమే గ్రీవెన్స్ నమోదు చేసుకునే అవకాశం ఉందని డిల్లీరావు స్పష్టం చేశారు. వివరాలు రైతులకు మరింత చేరేలా వ్యవసాయ శాఖ సిబ్బంది ముమ్మర ప్రచారం చేయాలని డిల్లీరావు ఆదేశించారు. అర్హులుగా 47.77 లక్షల రైతులు: ఖిఅన్నదాతా సుఖీభవ పీఎం కిసాన్‌ఖి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 47.77 లక్షల రైతు కుటుంబాలను అర్హులుగా గుర్తించామని కొద్ది రోజుల క్రితం వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయాల సర్వే ఆధారంగా 98 మందికి ఈకేవైసీ పూర్తయిందని తెలిపారు. ఈ ప్రక్రియ ఇంకా 61,000 మందికి పూర్తి చేయాల్సి ఉందని ఢిల్లీరావు వివరించారు. సొంతభూమి కలిగిన డీ.పట్టాదారులు, ఎసైన్డ్, ఈనాం భూముల రైతులను కూడా అర్హులుగా గుర్తించామని ఢిల్లీరావు పేర్కొన్నారు. వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ జత కాకున్నా, తప్పుగా జోడించినా, చనిపోయిన ఖాతాలు, నోషనల్ ఖాతాలు కలిగిన రైతులు రెవెన్యూ అధికారులను వద్దకు వెళ్లి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. అనంతరం వారికి కూడా ఈ సుఖీభవ పథకం వర్తింపజేస్తామని తెలిపారు. రైతుల అభ్యర్థనలు స్వీకరించేందుకు త్వరలో అన్నదాతా సుఖీభవ పోర్టల్ అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. భూమిలేని ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాల కౌలు రైతులు గుర్తింపు కార్డు పొందడంతోపాటు ఈపంటలో పేరు నమోదు చేసుకోవాలని ఢిల్లీరావు సూచించారు. అర్హత ప్రకారం అందరికి లబ్ధి చేకూరుస్తామని అక్టోబరు, 2026 జనవరి నెలల్లో 2 విడతలుగా కౌలు రైతులకు అన్నదాతా సుఖీభవ పీఎం కిసాన్ మొత్తాన్ని అందిస్తామన్నారు.

## ఐఐటి, నీట్‌లో అర్హత సాధించిన గురుకుల విద్యార్థులకు రూ.1 లక్ష ప్రభుత్వ ప్రోత్సాహకం

**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** ఐఐటీ, నీట్ లో అర్హత సాధించి మెడిసిన్ ఇంజనీరింగ్ లో సీట్లు సాధించిన డా.బి. ఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు రూ.1 లక్ష ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలని ఎపీఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ ఆఫ్ గవర్నెన్స్ నిర్ణయించింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అధ్యక్షతన ఎపీఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యాలయంలో 75 వ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఆమోదం తెలిపింది. ఐఐటి, నీట్ లో అర్హత సాధించి మెడిసిన్, ఇంజనీరింగ్ లో సీట్లు సాధించిన డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యార్థులకు రూ.1 లక్ష ప్రభుత్వ ప్రోత్సాహం, ఐఐటి, నీట్ లో అతి తక్కువ మార్కులతో అర్హత సాధించలేకపోయిన 120 మంది విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్ రాష్ట్రంలోని 10 ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లలో డిప్యూటేషన్ పై గురుకులాల్లో పనిచేసే ఉత్తమ ఉపాధ్యాయుల నియామకం గురుకులాలు, ఎస్సి సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు 11 రకాల వస్తువులతో కాస్మోటిక్ కిట్స్ ప్రతి గురుకులంలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు గురుకులాల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు వీటితో పాటు గురుకులాల్లో పదవ తరగతి, ఇంటర్ సెకండియర్ లో ఖాళీ సీట్ల అడ్మిషన్లకు బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఆమోదం తెలిపింది. ఎపీఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ సమావేశంలో కీలకంగా నిర్ణయం తీసుకున్నారు.ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో అనారోగ్యంతో మృతి చెందిన పల్నాడు జిల్లా వినుకొండ డా. బి.ఆర్ అంబేద్కర్ గురుకులానికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని సంకీర్తన భాయ్ తల్లిదండ్రులకు సాంత్వన పథకం కింద ఆర్థిక సాయంగా రూ.3 లక్షల చెక్కును మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అందజేశారు.ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ ఎం.ఎం నాయక్, సెక్రటరీ ప్రసన్న వెంకటేష్, సోషల్ వెల్ఫేర్ డైరక్టర్ లావణ్య వేణి, ఎపీఎస్‌డబ్ల్యు ఆర్ఇఐఎస్ అడిషన్ ల్ సెక్రటరీ సునీల్ రాజ్ కుమార్, ఎపీఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ డిప్యూటీ సెక్రటరీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## గరివిడి పశువైద్య కళాశాలకు లభించని విసిఐ అనుమతులు

### ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇతర కళాశాలల్లో ఇంటర్న్‌షిప్‌కు అనుమతి

### ఉత్తర్వులు జారీచేసిన తిరుపతి ఎస్‌వివియు రిజిస్ట్రార్ డాక్టర్ పి.రవికుమార్

**గరివిడి (విజయనగరం జిల్లా), జూలై 9 ప్రభాతవార్త:** గరివిడి పశువైద్య కళాశాలకు వి సి ఐ (వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) అనుమతులు లభించ లేదు. ప్రభుత్వం కృషి ఫలితంగా హౌస్ సర్జన్(ఇంటర్షిప్)కి వెళ్లే ఫైనల్ ఇయర్ విద్యార్థులకు మాత్రం విసిఐ అనుమతులు రాకపోయిన నేపథ్యంలో వి సి ఐ అనుమతులు ఉన్న తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం పరిధిలో గల గన్నవరం,తిరుపతి, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలలో జాయిన్ చేసేందుకు అనుమతులు మంజూ రయ్యాయి. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ (న్యూ ఢిల్లీ) డైరెక్టర్ జయచంద్ర భానురెడ్డి గరివిడి కళాశాల పశువైద్య విద్యార్థులకు వేరే కళాశాల ద్వారా ఇంటర్షిప్‌కి అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశు విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ పి. రవికుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు ప్రతులను నాలుగు కళాశాలల డీన్, అసోసియేట్ డీన్‌లకు రిజిస్ట్రార్ రవికుమార్ పంపించారు. విసిఐ అనుమతులు లభించని విద్యార్థులకు వేరే కళాశాల ద్వారా ఇంటర్షిప్ చేసేందుకు అనుమతి, ఆపై సర్టిఫికెట్ చెల్లుబాటుకి అవకాశం లభించడంతో విద్యార్థుల ఊరట ఏర్పడింది. ఈ అనుమతులకి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ మంత్రి కృషి ఫలించిందని చెప్పవచ్చు.

## కొమ్మినేనికి హైకోర్టులో ఊరట, బెయిలు షరతుల్లో సవరణ

**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుకు ఏపీ హైకోర్టు స్వల్పఊరట నిచ్చింది.బెయిల్ షరత్తుల్లో సవరణ చేసింది.రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో జర్నలిస్ట్ కొమ్మనేని శ్రీనివాసరావుకు మంగళగిరి కోర్టు విధించిన షరతులను అనుసరించి కొమ్మినేని తుళ్ళూరు పోలీసు స్టేషన్‌కు నిర్దేశిత వారాల్లో హాజరు కావాల్సి ఉంది. ఈ నిబంధనను .హైకోర్టు పాక్షికంగా సవరించింది. ఇకపై ఆయన తుళ్ళూరుకు బదులుగా తాడేపల్లి పోలీసు స్టేషన్ హాజరు అయ్యేందుకు ఆయనకు వీలు కల్పిం చింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లిఖార్జునరావు ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలపై తుళ్ళూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ఓ టీవీ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీం కోర్టు బెయిలు మంజూరు చేస్తూ,షరతులను విధించే అధికారం ట్రయల్ కోర్టుకు ఇచ్చింది.. దీంతో మంగళగిరి కోర్టు,ప్రతి నెలా రెండు,నాలుగో శనివారాలు తుళ్ళూరు పోలీసు స్టేషన్లో హాజరుకావాలని కొమ్మినేని శ్రీనివాసరావుకు షరతులు విధించింది. తుళ్ళూరు ఎస్‌హెచ్‌వో ముందు హాజరుకు వెళితే తనపై దాడి జరిగే ప్రమాదం ఉందని,తాడేపల్లి పీఎస్‌కు వెళ్లేందుకు వెసులుబాటు ఇవ్వాలని కొమ్మినేని కోరారు.

## స్లీపర్ సెల్స్ పై సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలు నిలుపుదల!

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో రాష్ట్రంలో స్లీపర్ సెల్స్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తులను గుర్తించేందుకు పిటిషనర్లు సమర్పించిన వివరాల ఆధారంగా విచారణ జరపాలంటూ డీజీపీని ఆదేశిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సీజే నేతృత్వంలోని ధర్మాసనం నిలిపివేసింది. హైకోర్టు ప్రదాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అనంతరం కేంద్ర నిఘా వర్గాల సమాచారం ప్రకారం పాకిస్థాన్-ఐఎస్ఐకి చెందిన పలువురు స్లీపర్ సెల్స్‌గా భారతదేశంలో ఉన్నారని అందులో కొందరు ఏపీలోని నంద్యాల, గుంటూరు, కడప, తదితర ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్నారని పేర్కొంటూ న్యాయవాది ఎస్.గౌతమి ప్రొద్దుటూరుకు చెందిన ఎ.శివకుమార్ హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి పిటిషనర్లు సమర్పించిన వివరాల ఆధారంగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డీజేపీని ఆదేశించారు. ఈ ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం ధర్మాసనం ముందు అప్పీల్ చేసింది. మంగళవారం జరిగిన విచారణనలో ప్రభుత్వం తరపున ఏజీ వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించాలని అభ్యర్థించారు.

## రాజధానిలో ఎన్టీఆర్ విగ్రహానికి 10 నమూనాలు మంత్రి నారాయణ

**విజయవాడ,జూలై 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో అత్యంత ఎత్తయిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉంది.ఇందుకు పూర్వరంగం సిద్ధమైంది.రాజధాని లోని నీరుకొండ హిల్ ఏరియాలో ఎన్టీఆర్ భారీ విగ్రహం స్మారకాన్ని నిర్మించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. క్రమంలో రాజధానిలో నిర్మించే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి పది నమూనాలు సిద్ధం చేయాలని పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సంబంధిత కన్సల్టెన్సీ ప్రతినిధులకు సూచించారు. వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. విగ్రహ నమూనా దాని చుట్టుపక్కల చేపట్టే నిర్మాణాలపై కన్సల్టెన్సీ ప్రతినిధులతో పురపాలక శాఖ మంత్రి సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు.

విగ్రహ నమూనాలు,ఇతర డిజైన్లపై ప్రాథమిక ప్రతిపాదనలను షెలాడియా సంస్థ ప్రతినిధులు వివరించారు. నిర్మాణ ప్రాంతంలో మట్టి పరీక్షలు,ఇతర సర్వేలు చేస్తున్నట్లు చెప్పారు. నమూనాల రూపకల్పనలో టిడిపి నేత టీడీ జనార్ధన్ సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి వారికి సూచించారు.

KAKINADA MUNICIPAL CORPORATION

'e' PROCUREMENT TENDER NOTIFICATION

Roc No. 1389/2025/E4, Dated: 09.07.2025

Tenders invited through ap e procurement platform for 14 works, Tenders invited through with an estimated amount value of **Rs. 4,12,10,724/-** from the eligible contractors in the following manner.

**Four Works for an amount of Rs. 22,09,776/-**
Last date and time for downloading bid documents: Dt: 15-07-2025 upto 10-00 AM

**Four Works for an amount of Rs. 23,08,032/-**
Last date and time for downloading bid documents: Dt:21-07-2025 upto 10-00 AM

**Six Works for an amount of Rs. 3,66,92,916/-**
Last date and time for downloading bid documents: Dt:28-07-2025 upto 10-00 AM

Tender Inviting Authority: Commissioner, Municipal Corporation, Kakinada
**Mail: kkd_mplcorp@yahoo.com, Call Centre Phone:0884-2357722**
Further details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in

OFFLINE TENDER RFP

R.o.c.No. 3088/2025/E2 Dated: 09-07-2025

Kakinada Municipal Corporation is inviting Tenders from interested reputed firms/ organizations/ agencies. **FOR 3RD PARTY QUALITY CONTROL**
The interested agencies are paying Rs. 10,000/- for each work respectively which is Non-refundable in the form of DD drawn in favour of the Commissioner, Municipal Corporation at any Nationalized Bank payable at Kakinada.

| S.No | Description | Date & Time |
|---|---|---|
| 1 | RFP Issue Start Date & time | From 11.00 A.M. 14/07/2025 |
| 2 | RFP Issue End Date & time | 4.00P.M. 21/07/2025 |
| 3 | RFP document receiving Closing Date & time | 4.00P.M. 22/07/2025 |
| 4 | Opening of Technical Bids Date & time | 5.00 P.M. 22/07/2025 |

Contact Mobile No: **9849906516; kmcengineeringsection@gmail.com**
Sd/- **Bhawna,** I.A.S.
Commissioner, Municipal Corporation, Kakinada

వార్త

దోష రహితమైన దాన్ని నిందించడం, ప్రశంసకు అర్హత లేనిదాన్ని పొగడ్డం, మనిషి డబ్బుకోసం ఏం చేయడానికి అయినా వెనుకాడడు.


-పంచతంత్ర

# ద్వంద్వ ప్రమాణాలకు చెక్!

అంత్యరుద్ధాలు, దేశాల మధ్య అనుచిత వైరుధ్యాలు, వాదోపవాదాలు ఉద్యమాలతో సతమతమవుతున్న పెక్కు దేశాల ఏర్పాటు వాద ఆకాంక్షలు తీరేందుకా అన్నట్లు బ్రెజిల్‌లో జరిగిన 'బ్రిక్స్' సమావేశాలు ఒకింత ఊరటనిచ్చాయనే చెప్పాలి. సమస్య, పరిష్కారం రెండూ ఒకదానివెంట ఒకటి ఉన్నా ముందు సమస్యలపై విశ్లేషణ జరగందే పరిష్కార మార్గాలు ఎంచుకోలేని పరిస్థితి ఉంటుంది. కానీ మొదటి ప్రస్తావనలోనే రియో డీ జనీరో ప్రకటన ద్వారా ఉగ్రవాదంపై పోరుబాటను బ్రిక్స్ నేతలు ఆవిష్కరించినట్లయ్యింది. పశ్చిమాసియా దేశాల మధ్య ఏర్పడిన వైరుధ్యాలు, విభిన్నతల మధ్య కొన్ని ఆందోళన పరిస్థితులు ఏర్పడ్డాయన్న విషయం తెలిసిందే. 'బ్రిక్స్' సభ్యదేశం అమెరికా ఇతర దేశాల వాణిజ్యంపై విపరీతంగా సుంకాల విధింపు కూడా ఈ సదస్సులో ప్రస్తావనార్హంగా మారింది. వివిధ దేశాల మధ్య ఆంక్షలు, పక్షపాతం, వంటి అంశాలన్నీ చర్చనీయాంశాలయ్యాయి. తొలుత బ్రెజిల్, రష్యా, చైనాలతో ఏర్పడిన 'బ్రిక్స్'లో ఆ తర్వాత భారత్ చేరింది. దక్షిణాఫ్రికా కూడా సభ్యత్వం తీసుకుంది. ప్రస్తుతం 11 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈసారి ఈ సదస్సుకు రష్యా, ఈజిప్టు, ఇరాన్, చైనా అధ్యక్షుడు హాజరుకాలేదు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ గతంలో అన్ని సమావేశాలకు హాజరైనా ఈసారి ఆ దేశ అంతర్గత రాజకీయ సమస్యలవలన రాలేదు. ఆయా దేశాల ఆకాంక్షల మధ్య బ్రిక్స్, సార్క్, వంటి అనేక దేశాల గ్రూపులు ఎప్పటికప్పుడు భవిష్యత్ నిర్ణయాలు తీసుకుంటూనే ఉంటాయి. స్నేహ సౌహార్ద్ర సంబంధాలను మెరుగుపరుచుకుంటూనే ఉంటాయి. చాలా కాలంగా అచేతనంగా ఉన్న దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం (సార్క్) స్థానంలో భారత్‌తో సహా అన్ని దక్షిణాసియా దేశాలతో మారో గ్రూపు ఏర్పాటు చేసేందుకు చైనా నాయకత్వంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాలు కలిసి వస్తే కొత్త కూటమిని ఏర్పాటు చేసే ప్రయత్నాలు చాపకింద నీరులా జరుగుతున్నాయి. సార్క్‌కు కేవలం ఇది కొత్త రూపంగా ఉండబోతోంది. సార్క్‌లో భారత్, అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక దేశాలు సభ్యదేశాలుగా ఉన్నా, వాటి బంధాన్ని భారత్‌లోని 'యురీ' సైనిక శిబిరంపై ఉగ్రదాడి ద్వారా పాకిస్థాన్ 'సార్క్'ను చెల్లాచెదురు చేసింది. అందుకే 'సార్క్'ను కొత్త రూపంలో తేవడం ద్వారా దక్షిణాసియాలో ఉద్రికత్తలను పరస్పర అవగాహన ద్వారా నియంత్రించుకోవచ్చుననే భావనలో కొన్ని ప్రధాన దేశాలు యోచిస్తున్నాయి. 'బ్రిక్స్' సదస్సులో భారత ప్రధాని నరేంద్రమోడీ వివరించిన అంశాలన్నీ ప్రధానంగా అన్ని సభ్యదేశాలూ ఆలోచించదగినవే. కృత్రిమ మేధాయుగంలో దేశాభ్యుదయం గురించి ఆలోచించేవారు వెనుకబడి ఉండరాదన్నది ఆయన సందేశం. పర్యావరణ పరిరక్షణకు ఆర్థిక సహాయం, సుస్థిరాభివృద్ధి, సాంకేతికత లభ్యత వంటి అంశాలో గ్లోబల్‌సౌత్‌కు తగిన ప్రాతినిధ్యం కానీ, వెసులుబాటు కానీ దక్కలేదని మోడీ ఆవేదన. అభివృద్ధి, వనరుల పంపిణీ, భద్రత సహా అన్ని అంశాలలోనూ ద్వంద్వప్రమాణాలే పాటించబడుతున్నందున గ్లోబల్ సౌత్ దేశాలకు అన్యాయమే జరిగిందన్నారు. అంతర్జాతీయ సంస్థల్లో ప్రాతినిధ్యం దక్కకపోవడం పట్ల మేడీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుత అవసరాలకువీలుగా భద్రతా మండలిని 'సంస్కరించుకోవాల్సిన పరిస్థితిని ప్రధాని నొక్కిచెప్పారు. ఆదివారం నాటి బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో మోడీ స్వరమే ప్రధానంగా వినపడింది. ఇటీవల పహల్గామ్ దాడిని ప్రస్తావిస్తూ ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు సాగించాలని, ఉగ్రవాదులపై ఆంక్షలు విధించేందుకు సంకోచించడం సరికాదని హితవు చెప్పారు. ఉగ్రవాదాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమర్థిస్తే అది మనల్నే కబళిస్తుందన్న ధోరణిని వ్యక్తం చేశారు. కృత్రిమ మేధ, ఆర్థిక వ్యవహారాలు, బహుళపక్షవాద అనే అంశాలపై 'బ్రిక్స్' సమావేశంగా ప్రధానంగా దృష్టి సారించింది. చాలా కాలంగా అన్యాయమవుతున్న దక్షిణాఫ్రికా దేశాలను ముందుగా సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్న తర్వాతనే నరేంద్రమోడీ బ్రెజిల్ 'బ్రిక్స్' సమావేశంలో వారికి ప్రాతినిధ్య ప్రతినిధిగా సమస్యలకు ఆవేదనను ఏకరువు పెట్టారు. పూర్తిగా కాకపోయినా కొంతలో కొంతైనా 'బ్రిక్స్' సమావేశం అనేక దేశాలకు ఆశాకిరణంగా కనపడింది. ఏ మాత్రం మొహమాటం లేకుండా అమెరికా, చైనాలు భారత్ వాణిజ్యంపై పెడుతున్న ఆంక్షలు, సుంకాల విషయాన్ని నిర్ద్వంద్వంగా మోడీ బయటపెట్టారు. 'క్రిటికల్ మినరల్స్' అనబడే లిథియం, నికెల్, గ్రాఫైట్స్ వంటి ప్రధాన ఖనిజాల ఎగుమతులపై చైనా విధిస్తున్న ఆంక్షలు ఆహ్వానించదగినవి కావని ప్రధాని ఎలుగెత్తారు. ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ, డ్రోన్ల వంటి అత్యాధునిక సాంకేతిక ఉత్పత్తుల తయారీలో క్రిటికల్ మినరల్స్' ఉపయోగిస్తుంటారు. కృత్రిమ మేధవల్ల కలిగే ప్రయోజనాలు, దుష్పరిణామాలను గురించి చర్చించేందుకే వచ్చే యేడాది భారత్‌లో 'ఎఐ ఇంపాక్ట్ సదస్సు'కు బ్రిక్స్ దేశాలను భారతప్రధాని ఆహ్వానించడం భవిష్యత్ సాంకేతికత విషయమై ఓముందడుగు వేసినట్లే. బ్రిక్స్ శాస్త్ర పరిశోధనల బాంఢాగారాన్ని ఏర్పాటును ప్రత్యేకించి ప్రధాని ప్రకటించారు. వాతావరణంలో ప్రతికూల మార్పుల నుండి తట్టుకోడానికి వీలుగా పారిస్ వాగ్దానాలను భారత్ తనవంతుగా ఇప్పటికే నెరవేర్చిందని, 2070కల్లా 'నెట్‌జీరో' స్థాయికి చేరి పుడమిని రక్షించే నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు ప్రధాని వివరించారు. ఈ 'బ్రిక్స్' సదస్సు నిర్ణయాలు. విశ్వమానవాళికి శుభదాయకం కావాలి. సమన్వయం, సహకారం విధానాలలో వచ్చే యేడాది భారత్‌లో జరిగే బ్రిక్స్ సమావేశంలో సౌహార్ద్ర సంబంధాలు ఇనుమడిస్తాయని ఆశిద్దాం.

---

ఎవరిని ప్రశంసిస్తున్నాం అన్నది గొప్ప విషయం కాదు. ఎవర్ని నిందిస్తున్నాం అనేదే బాధాకరమైన విషయం.



విలియం ఆస్లర్

ప్రపంచపు నైతిక స్పృహను సమీకరించుకోగలిగితే, గొప్ప సైన్యానికి మించిన శక్తి మనికి లభిస్తుంది.



ఉడ్రోవిల్సన్

# విద్యాహక్కు చట్టంపై అవగాహన పెంచాలి

**నేటి ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన ప్రపంచంలో విద్యలో విలువైన విద్యా ప్రమాణాలు అత్యంత ప్రాధాన్యతను పోషిస్తాయి. విషయ అవగాహన, ప్రశ్నించడం పరికల్పన చేయడం, ప్రయోగాత్మకమైన సమాచార నైపుణ్యాలు నిజ జీవిత వినియోగం విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా అవసరం. కాబట్టి ఇలాంటి విద్యా ప్రమాణాలు లేని జీవన ప్రయాణం గాఢాంధకారమైన మార్గంగానే గోచరిస్తుంది. అందుకే జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోగలిగే మహాయుధంగా ప్రతి ఒక్కరికి విద్యాహక్కు చట్టంకు అనుగుణంగా మానవీయ విలువలతో కూడిన గుణాత్మక విద్య తప్పనిసరి.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

విద్యను సామాజిక అంశంగా నాటి నుండి నేటి తరం వరకు గుర్తిస్తున్నప్పటికీ ప్రస్తుతం ఆధునిక జీవన విధానంలో ప్రామాణికమైన, గుణాత్మకమైన విద్యను అభ్యసించిన పరిజ్ఞానమే దేశాభివృద్ధిలో అత్యంత కీలకంగా మారుతుంది. కచ్చితత్వం, విశ్వసనీయ ఆదర్శవంతమైన మంచి ఆలోచనాత్మక ధోరణితో ఉన్న విద్యావ్యవస్థ దేశానికి ఎంతో ఉపయోగకరమైనది. ఇందుకు అవసరమైనటువంటి విధి విధానాలపై ప్రభుత్వాలు ప్రత్యేకంగా విద్యాహక్కు చట్టాల రూపకల్పన చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యా హక్కు చట్టాల అమలు విధానంలో అనేక సందేహాత్మక అనుమానాలు రేకెత్తుతున్నాయి. విద్యా విభాగం రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ విద్యా బడ్జెట్ కేటాయింపుల్లో ఇంకా ఎక్కువ నిధిని ముఖ్యంగా పాఠశాల విద్యకు కేటాయించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్న భిన్న వాదనలు ఉండటం గమనార్హం. భారత దేశంలో రెండు వేల పది సంవత్సరం ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి అమల్లోకి వచ్చిన విద్యా హక్కుచట్టం దేశంలోని బడిఈడు పిల్లలు అందరూ తప్పనిసరిగా వివిధ యాజమాన్యాల కింద పనిచేసే విద్యాసంస్థలలో గుణాత్మక విద్యను అభ్యసించే విధంగా విద్యాహక్కు చట్టం ఉచిత నిర్బంధ విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, చట్టపరంగా దేశంలోని ఆరు నుండి పద్నాలుగు సంవత్సరాల బాలబాలికలకుఉచిత నిర్బంధ విద్యను కఠినంగా అమలు అయ్యేలా చర్యలు చేపట్టిన ప్రభుత్వం బాల కార్మిక వ్యవస్థ లేకుండా నిర్దిష్టమైన చర్యలు చేపట్టింది. విద్యాహక్కు చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చిన ప్రభుత్వం వివిధ యాజమాన్యంలోని పాఠశాలలో విద్యార్థులకు అనువైనటువంటి కనీస మౌలిక వసతులు కల్పించే విధానాలను రూపొందించింది. అయితే కార్యచరణలో పూర్తిస్థాయిలో ఏ మేరకు సఫలీకృతమవుతున్నదో, లేదో అనే చర్చ సమాజంలో జరుగుతున్నది. సంస్కారవంతమైన విలువలతో కూడిన ఉత్తమమైన విద్య ఎంతో ఉన్నతమైనది. జీవితంలో ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే రీతిలో మంచి ఆలోచన విధానాలకు పదును పెట్టే విధంగా పాఠశాల విద్యకు విద్యాహక్కు చట్టం అధిక ప్రాధాన్యతనీ మరింతగా ఇవ్వవలసిన అవసరం ఉందనే అభిప్రాయం లేకపోలేదు. మారుమూల ప్రాంతాల్లో సైతం విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చే విధంగా పాఠశాలలను నెలకొల్పి ఉచిత విద్యతోపాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, నోటు పుస్తకాలు తదితరమైనవి ఉచితంగా అందుబాటులోకి తెచ్చే విధంగా ప్రభుత్వం ప్రయత్నాలు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలోమాత్రం అనుకున్నంత స్థాయిలో విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలలో నమోదు కావడం లేదన్న విమర్శలు, విద్యావ్యవస్థ మొత్తం ప్రభుత్వ పరంగా నడిపించాలనే వాదనలు ఉన్నప్పటికీ, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలదే పై చేయి అవు





తుండడం, ఆర్థిక వైవిధ్యాలతో ఉన్నా కూడా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలపై మొగ్గు చూపుతుండడం గమనార్హం. కానీ ప్రైవేట్ పాఠశాలలో విద్యా హక్కు చట్టం అమలు విధానంపై అనేక సందేహాలు ఉండడం ,విద్యా హక్కు చట్టం కేవలం ప్రభుత్వ పాఠశాలకే వర్తిస్తాయా లేక ప్రైవేట్ పాఠశాలకు కూడా వర్తిస్తుందా అనే సంశయం విద్యార్థుల తల్లిదండ్రులలో ఉండటం దీనిపై ప్రభుత్వాలు కూడా ఖచ్చితమైన దిశానిర్దేశం సూచించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. విద్యాహక్కు చట్టాల అమలు విషయంలో కూడా ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాల్సి ఉండాలన్న వాదనలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. గతంలో దేశంలో విద్యాభివృద్ధి కొరకు ఓబిబి, అపెప్, డిపెప్, సర్వశిక్ష అభియాన్ లాంటి కార్యక్రమాలు జాతీయ విద్యా ప్రణాళిక ప్రకారం నిర్వహించబడినప్పటికీ, రెండు వేల ఐదు సంవత్సరంలో విద్యా లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థులకు భావవ్యక్తీకరణ కీలకమైనదని భావించిన విద్యా కమిషన్, నిరంతర సమగ్ర మూల్యాంకనం విధానంతో ఒకటి నుండి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను కూడా సమగ్ర మూల్యాంకను ఆధారంగా రూపొందించి పాఠశాలల్లో బోధనభ్యాసనాలు కొనసాగిస్తూ వస్తున్నాయి. అయితే దేశంలో విద్యా హక్కు చట్టం అమలు అనుకున్న స్థాయిలో లేకపోవడానికి గల కారణాలు ఏవైనా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు మరింత అభివృద్ధి పరచవలసి ఉంది. ప్రభుత్వాలు విద్య విషయమై అనేక సందర్భాల్లో ప్రస్తావిస్తున్నప్పటికీ ,విద్యకు బడ్జెట్ మాత్రం ఆశించిన స్థాయిలో లేకపోతుందనే భిన్న వాదనలు ఉన్నాయి. విద్యా హక్కు అమలు విధానంలో భాగమైన పాఠశాల మౌలిక వసతులు, పరిపూర్ణమైన స్థాయిలో విద్యార్థులు ఉపాధ్యాయుల నిష్పత్తికి అనుగుణంగా తరగతి గదుల నిర్మాణం చేస్తున్నప్పటికీ, ప్రాథమిక తరగతి స్థాయిలో ప్రతి విషయం బోధనకు ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరి ఉండవలసిందే అనే అభిప్రాయాలు వినపడుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో కొన్ని సందర్భాల్లో చదువుకు అయ్యే ప్రవేశ రుసుములపై నియంత్రణ లేకపోవడం, ఒకఎత్తు అవుతుంటే విద్యాహక్కు చట్ట ప్రకారం ఒకటి నుండి పదవ తరగతి వరకు దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వికలాంగులకు సంబంధించినటువంటి వారి విషయంలో ఇరవై ఐదు శాతం ఉచిత విద్యను అందించవలసినటువంటి కార్పొరేట్ విద్యా సంస్థలు ఏ మేరకు విద్యా హక్కు చట్టాన్ని అమలు పరుస్తున్నాయో పరిశీలించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న విభిన్నమైన వాదనలు తెరపైకి వస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ నేటి ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన ప్రపంచంలో విద్యలో విలువైన విద్యా ప్రమాణాలు అత్యంత ప్రాధాన్యతను పోషిస్తాయి. విషయ అవగాహన, ప్రశ్నించడం పరికల్పన చేయడం, ప్రయోగాత్మకమైన సమాచార నైపుణ్యాలు నిజ జీవిత వినియోగం విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా అవసరం. కాబట్టి ఇలాంటి విద్యా ప్రమాణాలు లేని జీవన ప్రయాణం గాఢాంధకారమైన మార్గంగానే గోచరిస్తుంది. అందుకే జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోగలిగే మహాయుధంగా ప్రతి ఒక్కరికి విద్యాహక్కు చట్టంకు అనుగుణంగా మానవీయ విలువలతో కూడిన గుణాత్మక విద్య తప్పనిసరి. ●

# చేపల రైతు చేతుల్లోనే ఆహార భద్రత!

రామ కిష్టయ్య సంగనభట్ల

ప్రతి సంవత్సరం జూలై 10న భారత దేశం జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంది. దేశ ఆహార భద్రతకు, పోషకాహార అవసరాలకు తోడ్పడుతున్న మత్స్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న లక్షలాది చేపల రైతులు, మత్స్యకారులు, ఆక్వా ప్రెన్యూర్ల అంకిత భావానికి, కృషికి గుర్తింపుగా ఈ దినోత్సవం నిర్వహించబడుతుంది. ఇది కేవలం ఒక రోజు వేడుక మాత్రమే కాకుండా, దేశ మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ప్రేరణాత్మక దినంగా నిలుస్తోంది. ఈ దినోత్సవాన్ని జూలై 10న జరుపుకోవడానికి ఒక ప్రత్యేక నేపథ్యం ఉంది. 1957లో ఇదే తేదీన, ప్రముఖ భారతీయ మత్స్య శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి, డాక్టర్ కె.హెచ్. అలీకున్హి ఒడిశాలోని అంగుల్‌లో మేజర్ కార్ప్ చేపలపై హైపోఫిసేషన్ అనే శాస్త్రీయ సాంకేతికతను విజయవంతంగా ప్రయోగించారు. ఈ సాంకేతికత ద్వారా చేపల ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. దీని ఫలితంగా దేశంలో వాణిజ్య ఆక్వాకల్చర్‌కు బలమైన భూమిక ఏర్పడింది. మత్స్య పాలనలో శాస్త్రీయత, ఉత్పాదకత పెరిగి నీలి విప్లవానికి నాంది పలికింది. నీలి విప్లవం ఫలితంగా భారత దేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద చేపల ఉత్పత్తి దారుగా నిలిచింది. దేశం మొత్తంలో చేపల ఉత్పత్తిలో సుమారు 65 శాతం వాణిజ్య ఆక్వాకల్చర్ ద్వారానే లభిస్తోంది. 2023-24 సంవత్సరానికి గాను భారత్‌లో చేపల ఉత్పత్తి సుమారు 174 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, వీటిలో 131 లక్షల మెట్రిక్ టన్నులు ఆక్వాకల్చర్ నుంచి లభించాయి. అంతే కాకుండా, దేశీయ మత్స్య ఉత్పత్తిలో భారత్ వాటా ప్రపంచ స్థాయిలో 8 శాతంగా ఉంది. ఈ రంగం దాదాపు 2.8 కోట్ల మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జీవనాధారంగా మారింది. ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తెలంగాణ, కేరళ, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోని చేపల ఉత్పత్తిలో దాదాపు 35 శాతం వాటాను కలిగి ఉంది. సరైన విధా



నాలు, సాగు కోసం అనుకూల వాతావరణం, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో ఈ రాష్ట్రాలు మత్స్యరంగంలో అత్యుత్తమ స్థానాలను ఆక్రమించాయి. కేంద్ర ప్రభుత్వం నీలి విప్లవాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన వంటి పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా చేపల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, పోస్ట్‌హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, శీతల భద్రపరిచే భవనాలు, రవాణా సదుపాయాలు, మార్కెటింగ్ మద్దతు వంటి రంగాల్లో అభివృద్ధికి పునాదులు వేశాయి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళల పాత్రను పెంచడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. 2023-24లో దాదాపు 2,500 కోట్ల మేర బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. నూతన ఆవిష్కరణలతో బయోఫ్లాక్, ఆర్సీ ఆర్ఎస్, ఇంటెన్సివ్ కల్చర్ పద్ధతులు రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ఉత్పత్తిని అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. నీటివనరుల సమర్థ వినియోగం, ఆరోగ్య సంరక్షణ, చేపల నిర్వహణ వంటి అంశాల్లో శాస్త్రీయ మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే, ఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా తక్కువ కావు. నీటి కాలుష్యం, సకాలంలో మార్కెట్ మద్దతు లేకపోవడం, సరైన ధరకే విక్రయానికి అవకాశాలు లేకపోవడం, రవాణా లోపాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. జలవనరుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కూడా తక్షణ పరిష్కారం కోరుకుంటున్నాయి. జాతీయ చేపల రైతుల దినోత్సవం సందర్భంగా కేంద్రం, రాష్ట్రాల స్థాయిలో అవార్డులు, సన్మానాలు, శిక్షణా శిబిరాలు, ప్రదర్శనలు, సెమినార్లు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించడం ద్వారా మత్స్య రంగ అభివృద్ధికి కొత్త దిక్సూచి చూపే ప్రయత్నం జరుగుతోంది. ఈ వేదికల్లో రైతులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు పరస్పరంగా జ్ఞానాన్ని పంచుకుంటూ వ్యవస్థను మెరుగుపరిచే మార్గాలు అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ చేపల రైతుల దినోత్సవం కేవలం స్మరణ దినంగా మాత్రమే కాక, మత్స్య రంగానికి విశిష్ట దిశానిర్దేశం చేసే ఒక ఉద్యమంగా మారాలి. ప్రతి నీటి రైతు భారత ఆహార భద్రతకు కాపలా దారుడిగా నిలుస్తున్నాడు. వారి శ్రమకు, అంకిత భావానికి గౌరవం తెలుపడమే ఈ దినోత్సవ ఉద్దేశం. ●

# సైబర్ నేరస్తుల పట్ల అప్రమత్తత అవసరం

కామిడి సతీష్‌రెడ్డి

నిత్యం మనం వాడే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, చార్జింగ్ కేబుల్ డివైజ్ ఏదైనా సరే వానిని ఏమార్చి కొల్లగొట్టేందుకు సైబర్ నేరగాళ్లు ప్రతిచోటా మాటు వేసి ఉంటున్నారు. వీరు చేసే మోసాల గురించి అవగాహన కలిగి ఉండటం, తగిన జాగ్రత్తలు తీసుకోవటం ద్వారానే వారికి అడ్డుకట్ట వేయగలమని సంబంధిత శాఖ అధికారులు, ఆయా బ్యాంక్ అధికారులు అంటున్నారు. నేటి ఆధునిక కాలంలో ఆన్‌లైన్ షాపింగ్, ఆన్లైన్ డబ్బు చెల్లింపులు అతి సర్వ సాధారణమైనాయి. జేబులో డబ్బులు అవసరం లేకుండానే మొబైల్ ఫోన్ చేతిలో ఉంటే ఏ విధమైన చెల్లింపులైనా చేసే అవకాశం ఉంది. అతి తెలివిగా కేటుగాళ్లు (హ్యాకర్లు) మనంమొబైల్ వాడకంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా డబ్బులు కొల్లగొట్టేస్తారు. మనం చేసే ఏ చిన్న పొరపాటైనా సైబర్ నేరగాళ్లకు వరంగా మారుతుంది. కాబట్టి చాలా అప్రమత్తం, జాగ్రత్తగా ఉండాలి. పాస్‌వర్డ్‌లు సరిగ్గా పెట్టుకోకపోయినా, వారి మాయమాటలకు పడిపోయినా ఖాతాల్లో ఉన్నదంతా ఊడ్చిపెట్టుకుపోతుందని హెచ్చరిస్తున్నారు. ప్రతీ రోజు ఏదో ఒకచోట సైబర్ క్రైమ్ జరుగుతూ వుంది. మన అలసత్వం, అమయాకత్వాన్నే ఆసరాగా చేసుకొని కూర్చున్నచోటి నుంచే కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు సైబర్ నేరగాళ్లు. వీరి బారి నుంచి కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు సూచిస్తూ ఆర్బీఐ కొన్ని సూచనలు చేసింది. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తున్నప్పుడు సెక్యూర్ పేమెంట్ గేట్‌వేస్‌ను ఎంచుకోవాలి. లేదంటే మన సమాచారం మూడో వ్యక్తికి చేరే ప్రమాదం ఉన్నట్టే. మీ పాస్‌వర్డ్‌లు, పిన్ నంబర్లు, క్రెడిట్, డెబిట్‌కార్డుల నంబర్లు, సీవీవీ నంబర్లు భద్రంగా ఉంచుకోవాలి. మీ బ్యాంకు ఖాతాల వివరాలు క్రెడిట్, డెబిట్‌కార్డుల నంబర్లు సహా ఇతర వివరాలు ఎప్పుడూ మీ ల్యాప్‌టాప్స్, డెస్క్‌టాప్స్, వెబ్‌సైట్స్‌లో సేవ్ చేసి పెట్టుకోవద్దు. మీకు తెలియని వ్యక్తులు, సంస్థల నుంచి వచ్చే ఈ మెయిల్స్‌లోని అటాచ్‌మెంట్లు, ఫైళ్లపై ఎట్టిపరిస్థితుల్లో క్లిక్ చేయవద్దు. వాటితో మీ కంప్యూటర్‌లోకి ఫిషింగ్ లింక్‌లు వచ్చే ప్రమాదం ఉంది. కొత్తవారితో మీ చెక్‌బుక్ కాపీలు, కేవైసీ డాక్యుమెంట్లు షేర్ చేయవద్దు. డివైజ్ లేదా కంప్యూటర్ సెక్యురిటీ ఇలా తరచూ మీ పాస్‌వర్డ్‌లు మారుస్తూ ఉండాలి. మీ డివైజ్‌ల్లో మంచి యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లు ఇన్‌స్టాల్ చేసుకోవడంతోపాటు తరచూ డివైజ్‌లను అప్‌డేట్ చేసుకోవాలి. మీ కంప్యూటర్, ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్లకు తప్పక పాస్‌వర్డ్ పెట్టుకోవాలి. మనకు తెలియని సోర్స్‌ల నుంచి యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దు. మోసపోతే వెంటనే ఫిర్యాదు చేయాలి. మనం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తించిన వెంటనే సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అదేవిధంగా 24 గంటలపాటు పనిచేసే సైబర్‌క్రైం హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. మన తెలుగు రాష్ట్రాలతో సహ ఇతర రాష్ట్రాల్లోనూ ఈ హెల్ప్‌లైన్ సేవలు ఉంటాయి. మనం కాల్ చేసిన వెంటనే పోలీసులు మన బ్యాంక్ ఖాతాను స్తంభింపజేస్తారు. దీనివల్ల మరింత సొమ్ము



మనఖాతా నుంచి పోకుండా కాపాడుకోవచ్చు. తర్వాత కేసు దర్యాప్తు ఉంటుంది. ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లో క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇంటర్నెట్ బ్యాంకింగ్ చేస్తున్నప్పుడు ఎల్లప్పుడు వర్చువల్ కీబోర్డు (కంప్యూటర్ స్క్రీన్‌పైన కీబోర్డు కనిపిస్తుంది)ను వాడాలి. సాధారణ కీబోర్డుపై మనం ఏయే నంబర్లు నొక్కామన్నది ఇతరులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. మీరు ఇంటర్నెట్ బ్యాంకింగ్ చేసిన వెంటనే లాగ్‌అవుట్ కావాలి. తరచూ మీ పాస్‌వర్డ్‌ను మారుస్తూ ఉండాలి. ఇంటర్నెట్ బ్యాంకింగ్‌కు మీ ఈ మెయిల్‌కు ఒకే పాస్‌వర్డ్‌ను ఎట్టిపరిస్థితుల్లో పెట్టకోవద్దు. సైబర్‌కేఫ్‌లు, ఇతర పబ్లిక్ కంప్యూటర్లలో ఇంటర్నెట్ బ్యాంకింగ్ చేయకపోవడం ఉత్తమం. పాస్‌వర్డ్ పక్కాగా ఉండేలా చూసుకోవాలి. మీ పాస్‌వర్డ్ మీ ఆన్‌లైన్ బ్యాంకు ఖాతాలకు, సోషల్ మీడియా ఖాతాలకు తాళం వంటిది. ఇది పక్కాగా ఉండేలా చూసుకోవాలి. అవకాశం ఉన్న ప్రతి చోటా టూ ఫ్యాక్టర్ (రెండంచెల సెక్యూరిటీ) ఆథంటికేషన్ పెట్టుకోవాలి. సైబర్ క్రిమినల్స్, హ్యాకర్లు స్పైవేర్‌ను టార్గెట్ చేసిన ఫోన్లలో ప్రవేశపెట్టేందుకు చాలా ఈజీ మార్గం ఫేక్ యాప్స్. మామూలుగా స్మార్ట్‌ఫోన్ల యూజర్లకు అవసరమైన యాప్స్‌ను పోలినట్టుగానే ఉండే నకిలీ యాప్స్ ప్లేస్టోర్‌లో పెడతారు. వాటిలో వాస్తవానికి అసలైన యాప్ ఉండదు. మనం తెలియక ఆ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేశామంటే ఆటోమేటిక్‌గా ఫోన్ హ్యాక్ అయిపోతుంది. సోషల్ మీడియాలో, కొన్ని రకాల వెబ్‌సైట్లలో, పోర్న్ సైట్లలో కూడా ఈ ఫేక్‌యాప్స్‌కు సంబంధించిన లింక్ ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. పొరబాటున కూడా వాటిని క్లిక్ చేయకూడదు. అలాగే కొత్త యాప్స్ డౌన్‌లోడ్ చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవడం మంచిది. వాట్సాప్, ఈమెయిల్స్, ఎస్ఎంఎస్ ద్వారా కూడా హ్యాకర్లు స్పైవేర్ లింకులు పంపుతారు. లోన్లు ఇస్తామని, జాబ్ ఆఫర్ అని, సర్‌ప్రైజ్ గిఫ్ట్ అని, లక్కీ డిప్ అని, ఫోన్‌కు కొత్త ఫీచర్స్ అని ఇలా రకరకాల ఫేక్ లింక్స్ క్రియేట్ చేసి వాట్సాప్, ఈమెయిల్, లేదా ఎస్ఎంఎస్ ద్వారా పంపి, మీ ఫోన్‌ను హ్యాక్ చేసే ముప్పు ఉంటుంది. పొరబాటున ఆ లింక్‌ను క్లిక్ చేస్తే ఫోన్‌లో హ్యాకర్ పంపిన వైరస్ ఇన్‌స్టాల్ అవుతుంది. దీంతో అది మన డేటాను మొత్తం హ్యాకర్‌కు పంపేస్తుంది. ఫోన్ ఆ హ్యాకర్ కంట్రోల్‌లోకి వెళ్లిపోతుంది. అందుకే అనవసరంగా పనికిరాని లింక్‌లు ఓపెన్ చేయకుండా ఉంటే బెటర్. మన పర్సనల్ డేటా పొరబాటున హ్యాకర్లకు దొరికితే హ్యాకర్లు సిమ్ కార్డు స్వాప్ టెక్నిక్ వాడుతారు. ఆ డేటా సాయంతో హ్యాకర్లు టెలికాం ఆపరేటర్‌కు కాల్ చేసి సిమ్ రిప్లేస్‌మెంట్ కోసం డిమాండ్ చేస్తారు. ఒకవేళ సిమ్ ఇష్యూ అయితే మన ఫోన్‌లో ఉన్న పాత సిమ్ డీయాక్టివేట్ అవుతుంది. దీంతో ఇక హ్యాకర్‌కు మన ఫోన్ నంబర్ ఫుల్ యాక్సెస్ వచ్చేస్తుంది. దీంతో మన బ్యాంక్ లావాదేవీలు, ఓటీపీలు అన్నీ ఆ ఫోన్‌కే వెళ్తాయి. అయితే ప్రస్తుతం సిమ్ తీసుకోవాలంటే ఆధార్ లింక్, బయో మెట్రిక్ తప్పనిసరి కావడంతో ఈ ప్రమాదం కొంత వరకు తగ్గుతుంది. కానీ సిమ్ క్లోనింగ్ అనే మరో ప్రక్రియ ద్వారా మన సిమ్ యాక్టివ్‌లో ఉండగానే, మన నంబర్‌తోనే ఇంకో సిమ్ క్రియేట్ చేసే టెక్నాలజీ కూడా వచ్చింది. ఇది ఇంకా ప్రమాదకరం. అందుకే ఆధార్ నంబర్ లాంటి మన పర్సనల్ డేటాను లీక్‌కాకుండా చూసుకోవాలి. బ్లూటూత్ సహాయంతో కూడా హ్యాకర్లు ఒక నిర్ణీత దూరంలో ఉన్న ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను హ్యాక్ చేసే చాన్స్ ఉంది. ఇందుకోసం హ్యాకర్లు ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తారు. ఈ హ్యాకింగ్ ఎక్కువగా బహిరంగ ప్రదేశాల్లో జరుగుతుంది. పబ్లిక్ వైఫైని వాడే వాళ్లు హ్యాకర్లకు ఈజీ టార్గెట్ అవుతారు. అందుకే పబ్లిక్ వైఫైని వాడకపోవడం మంచిది. అలాగే మీ వైఫైని ఓపెన్‌గా వదిలేయకుండా ఉండాలి. కచ్చితంగా స్ట్రాంగ్ పాస్‌వర్డ్ పెట్టుకోవాలి. సైబర్ నేరాల గురించి సరైన అవగాహన పెంచుకుని ఎవరికి వారు రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. ●

# ప్రజావాక్కు



### విషపూరిత రసాయనాలను వాడొద్దు

ఇటీవలవ్యవసాయంలో విస్తృతంగావినియోగిస్తున్న గ్లైఫోసేట్ అనే విషపూరిత రసాయనంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అనేక పరిశోధనలు, నివేదికలు దీని ప్రమాదకరతను స్పష్టం చేస్తున్నప్పటికీ, మన దేశంలో ఇది ఇంకా వ్యవసాయ చట్టాల కింద నియంత్రణలో లేకుండా వినియోగించబడుతోంది. ఇది రైతులకు, వ్యవసాయ కార్మికులకు, పర్యావరణానికి, జల వనరులకు, వన్యప్రాణులకు తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తుంది. గ్లైఫోసేట్ అనేది హెర్బిసైడ్‌గా ఉపయోగించే రసాయనం. ఇది ముళ్లపొదల్లో స్పష్టమైన ప్రభావం చూపుతుందనేది నిజమే. కానీ దీని దీర్ఘకాలిక ప్రభావాలు మాత్రం అత్యంత భయంకరమైనవిగా బయటపడుతున్నాయి. ఇది కేన్సర్‌ను తేవచ్చు అనేవిషయం ప్రపంచ ఆరోగ్య సంస్థకి చెందిన అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధన సంస్థ నివేదిక ద్వారా స్పష్టం అయింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రమాదంలో ప్రాథమిక హక్కులు

హక్కుల గురించి మాట్లాడడం రాయడం ఒక మృగ్యం అయిపోతున్న పరిస్థితిలో ఉన్నాం. సంచార స్వేచ్ఛ లేదు జైళ్లలో కనీసం విచారణ లేకుండా కుక్కబడిన పరిస్థితి ఉంది. దళితులలోఆదివాసులలో ఈతీవ్రత మరింత ఎక్కువ అయితే రాజ్యాంగం ఆశించింది అందించింది ఇదేనా అనే భావన కలుగుతుంది. ఇవ్వాళ ఆదివాసులు తమకు ఏమి కావాలి అని దానిని వాళ్లే నిర్ణయించుకుంటారు అని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ దాని అమలులో మాత్రం ఆ ఛాయలు కనిపించవు. నిరసన తెలిపేందుకు అవకాశం లేదు. చివరికి తనకు నచ్చిన ఆహారం తినే స్వేచ్ఛకూడా లేదు. రాజ్యాంగ సభచర్చలలోఎక్కువ కాలం నలిగిన ప్రాథమిక హక్కుల ఉనికే ప్రమాదంలో ఉంది.

- భారత అవినాష్, జనగామ

### తండాలకు తారు రోడ్డు వేయాలి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాలలోని మారుమూల గిరిజన తాండాలకు తారు రోడ్డువేయాలి. గిరిజన తాండాలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం తండాల రోడ్ల పరిస్థితి అధ్వాన్నస్థితిలో ఉంటున్నాయి. కావున ప్రభుత్వాలు తక్షణం గిరిజన తండాలకు తారు రోడ్డు సౌకర్యం కల్పించాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

### పోటీకి అనర్హులు

అమెరికా అధ్యక్షుడి ఎన్నికలలో డోనాల్డ్ ట్రంప్‌కు కుడి భుజంగా అహర్నిశలు పనిచేసి లక్షల డాలర్లు ఖర్చు చేసి తన స్నేహితుడి విజయానికి బాటలు పరచిన అపర కుబేరుడు టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ట్రంప్ నిర్ణయాలతో విభేదించి స్నేహబంధాన్ని విడనాడి ప్రజాస్వామ్య పరిరక్షణకు 'అమెరికా పార్టీ' అనే పేరుతో ఓ కొత్త పార్టీకి పునాది రాయిని వేయడం జరిగింది. అమెరికాలో దాదాపు 55రాజకీయ పార్టీలున్నాయి. ఎన్ని ఉన్నా ఎన్నికల పోటీలో నిలబడేవి ముఖ్యంగా డెమొక్రటిక్, కన్సర్వేటివ్ పార్టీలు మాత్రమే. అదే ఇండియాలో రెండు వేల అయిదు వందల పార్టీలున్నాయని మన ప్రధాని ఘానా దేశ పర్యటనలో చెప్పారు. మస్క్ పెడుతున్న పార్టీకి అమెరికాలో అనూహ్య మద్దతు లభిస్తోందని వార్తలొస్తున్నాయి. ఇందులో రాజ్యాంగ పరమైన చిక్కేమిటంటే మస్క్ పుట్టింది సౌత్ ఆఫ్రికాలో. అందుచేత అమెరికా అధ్యక్షునిగా పోటీ చేయడానికి ఆయన అర్హత ప్రశ్నార్థకమే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి

దశాబ్దాలుగా అన్ని రంగాల్లో వెనకబడి కుంగిపోతున్నా తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి. గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలో కాపు కులంతో తెలగ కులాన్ని జతచేయడం వల్లనే ఉత్తరాంధ్రలో ఉన్న తెలగ కులాన్ని బీసీగా గుర్తించడం లేదు. ఎందుకంటే కాపులు ఆర్థికంగా బలమైన వారు కాని తెలగ కులస్తులు కేవలం వ్యవసాయాన్ని నమ్మి ఆర్థికంగా ఎదగలేకపోయారు. రిజర్వేషన్ల లేకపోవడం వల్ల ఉద్యోగులు సంపాదించలేకపోయాం. రాజకీయాల్లో రాణించలేకపోయం. అందుకే మా జీవితాల్లో ప్రగతి సూర్యోదయాన్ని చూడలేకపోయాం. అందుకే ఉత్తరాంధ్రలో తెలగకులాన్ని జాగృతం చేయాలి.

-జి.అశోక్ కుమార్, విశాఖపట్నం

### వికలాంగుల నైపుణ్యాలు మెరుగుపరచాలి

వైకల్యం అనేది శరీరాలకి కానీ మనసుకు, నైపుణ్యాలకు, చైతన్యానికి అడ్డు కాదని వికలాంగులు వివిధ రంగాలలో నిరూపిస్తున్నారు. వికలాంగులలో ఉన్నత విద్యావంతులు, రచయితలు, గాయకులు, ఆర్టిస్ట్, క్రీడలు, నటన, చిత్రకారులు, వివిధ సంస్కృతిక రంగాలలో అద్భుతమైన ప్రతిభ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ఆయా రంగాలలో పేరు ప్రతిష్టలు పొందిన వారి చేత వికలాంగులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి


ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భారత్‌పై చైనా 'వాటర్ బాంబ్'!

## బ్రహ్మపుత్ర నదీజలాలపై భారీ డ్యామ్ నిర్మాణం



**ఇటానగర్,జూలై 9:** భారత్‌తో సరిహద్దులో ప్రపంచంలోనే అతిపెద్ద జల విద్యుత్ డ్యాంను చైనా నిర్మిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దీన్ని చైనా వాటర్ బాంబ్‌గా ఉపయోగించే అవకాశం ఉందని అరుణాచల్‌ప్రదేశ్ సిఎం పెమా ఖండూ వ్యాఖ్యానించారు. చైనా మిలటరీ కంటే ఈ డ్యాంతోనే అతిపెద్ద ప్రమాదం పొంచి ఉందన్నారు. చైనా వ్యూహాలకు దీటుగా భారత్ కూడా పలుచర్యలు తీసుకుంటోంది. భారత్‌లోని అరుణాచల్‌ప్రదేశ్‌కు సమీపంలో ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ డ్యాంను చైనా నిర్మిస్తోంది. దీనికి యార్లుంగ్ త్సాంగ్పో ఆనకట్టగా పేరపెట్టింది. టిబెట్‌లో యార్లంగ్ సాంగ్పో నదిగా ప్రసిద్ధమైన బ్రహ్మపుత్ర నదిపై ఈ జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి 2024లో చైనా సర్కారు ఆమోదం తెలిపింది. 137 బిలియన్ డాలర్ల వ్యయంతో ఐదేళ్లలో దీన్ని నిర్మించాలని డ్రాగన్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇది 60 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలదు. బ్రహ్మపుత్రనది భారత్‌లోని అరుణాచల్‌ప్రదేశ్‌లోకి ప్రవేశించేందుకు మలుపు తిరిగే ప్రదేశంలో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు సాయంతో చైనా బ్రహ్మపుత్ర నదిలో జలప్రవాహాన్ని నియంత్రించగలదు. భారీ మోతాదులో వరద నీటిని భారత భూభాగంపైకి వదిలి విధ్వంసం సృష్టించగలదు. అందుకే దీన్ని వాటర్ బాంబ్‌గా అరుణాచల్‌ప్రదేశ్ సిఎం పెమా ఖండూ అభివర్ణించారు.

చైనా మిలటరీ కంటే ఈ ఆనకట్టే భారత్‌కు అత్యంత ప్రమాదకరమని పెమాఖండూ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ జల ఒప్పందంపై చైనా సంతకం చేసి ఉంటే ఈ డ్యాం వల్ల భారత్‌కు పెద్దగా సమస్య వచ్చేదికాదని పెమా ఖండూ తెలిపారు. ఎందుకంటే ఆ ఒప్పందం ప్రకారం బ్రహ్మపుత్ర జలాలను కొంతమేర తప్పనిసరిగా కిందకు వదలాల్సి వస్తుందన్నారు. అంతర్జాతీయ జల ఒప్పందంపై చైనా సంతకం చేయనందున వేసవికాలంలో బ్రహ్మపుత్ర జలాలను భారత్‌లోకి రాకుండా చైనా మళ్లించే అవకాశం ఉందన్నారు. తద్వారా అసోం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. వర్షాకాలంలో బ్రహ్మపుత్ర నదికి భారీగా వరద ఉంటుంది. ఒకేసారి పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేస్తే దిగువనున్న ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. చైనా ఎప్పుడు ఏం చేస్తుందో ఎవరికీ తెలియదు. ఆనకట్ట నిర్మించి వారు అకస్మాత్తుగా నీటిని విడుదల చేస్తే, మన మొత్తం సియాంగ్ బెల్ట్ నాశనం అవుతుంది. ముఖ్యంగా ఆది తెగ సహా ఆ తరహా సమూహాలు అక్కడ ఎక్కువగా నివాసం ఉంటారు. ఆది తెగ ఆస్తి, భూమి, ముఖ్యంగా మానవ జీవితం వినాశకరమైన ప్రభావాలను ఎదుర్కొంటాయి. అసోంలో కూడా బ్రహ్మపుత్ర నది వరద వల్ల భారీ నష్టం సంభవిస్తుందన్నారు.

చైనా నిర్మిస్తున్న డ్యాం పూర్తైతే సియాంగ్, బ్రహ్మపుత్ర నదులు ఎండిపోయే ప్రమాదం ఉందని పెమా ఖండూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకోసమే అరుణాచల్‌లో కూడా ఓ ప్రాజెక్టునునిర్మించనున్నాం. దానివల్ల మా నీటి అవసరాలను దానిద్వారా తీర్చుకునే అవకాశం ఉంటుంది. చైనా నిర్మిస్తున్న ప్రాజెక్టు భారత్‌చైనా సరిహద్దుకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. రక్షణ పరంగానూ భారత్‌కు దీనివల్ల సమస్యలు పొంచిఉన్నాయి. యుద్ధ పరిస్థితులు తలెత్తితే ఈ ప్రాజెక్టులో నిల్వచేసిన నీటిని చైనా వాటర్ బాంబ్‌గా ప్రయోగించే ప్రమాదం ఉంది.



### ఆసియాలోనే అత్యంత వృద్ధ ఏనుగు కన్నుమూత!

**భోపాల్, జూలై 9:** ఆసియాలోనే అత్యంత వృద్ధ ఏనుగుగా పేరుపొందిన 'వత్సల' మహిళా ఏనుగు మంగళవారం తుదిశ్వాస విడిచింది. మధ్యప్రదేశ్‌లోని టైగర్ రిజర్వులో ఇది మృతిచెందింది. ఏనుగు ముందుకాళ్ల గోళ్లకు గాయాలు కావడంతో అభయారణ్యంలోని ఖైరైయాన్ కాలువసమీపంలో కూర్చుని ఉండిపోయింది. వైద్యులు, సిబ్బంది ఎంత ప్రయత్నించినప్పటికీ పైకి లేవలేకపోయింది. తర్వాత మృతిచెందినట్లుపన్నా టైగర్ రిజర్వు ప్రకటన విడుదలచేసింది. 100 ఏళ్లకుపైగా బతికిన ఈ ఆడ ఏనుగును దాదీమా, నానిమా అనే పేర్లతోపిలిచేవారు. వత్సల మృతితో వన్యప్రాణుల చరిత్రలో ఒక అధ్యాయం ముగిసిందని సీనియర్ అటవీ అధికారి ఒకరు తెలిపారు. అటవీ అధికారులు సిబ్బంది సమక్షంలో ఆ ఏనుగుకు అంత్యక్రియలు నిర్వహించామని తెలిపారు వృద్ధాప్యం వల్ల వత్సలకు దృష్టిలోపం వచ్చింది. ఎక్కువదూరం నడవలేకపోయింది. హినౌటా ఎలిఫెంట్ క్యాంప్ నుంచి ప్రతిరోజు స్నానం చేయించడానికి తినడానికి దీన్ని ఖౌరైయాన్ కాలువ వద్దకు తీసుకెళ్లేవారు. ప్రతిరోజూ వత్సలకు వైద్య నిపుణుల సమక్షంలో రీక్షలు నిర్వహించేవారు. పూర్తి సంరక్షణ వల్లనే వత్సల చాలా ఏళ్లు బతికిందని అధికారులు తెలిపారు. కేరళలోని నర్మదాపురంలో పుట్టిన ఈ ఏనుగును పన్నాకు తీసుకొచ్చారు. గత కొన్నేళ్లుగా పన్నా పులల సంరక్షణ కేంద్రంలో పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ వచ్చింది. వత్సల మృతిపై రాష్ట్ర సిఎం మోహన్ యాదవ్ విచారం వ్యక్తంచేసారు.

# బీహార్‌లోనూ ఓట్లను తొలగించే కుట్ర చేస్తున్నారు..

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపణలు!



**పాట్నా, జులై 9:** బీహార్‌లో ప్రతిపక్షాల ఓట్లను తొలగించే కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. మహారాష్ట్ర తరహాలో నితీశ్‌కుమార్ పార్టీ తమకు అనుకూలమైన వారి ఓట్లు మాత్రమే జాబితాలో ఉండేలా మార్పులు చేస్తోందని విమర్శించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేపట్టిన బీహార్ బంద్‌లో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభకు, మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో ముందుగా ఇండియా కూటమికి మెజారిటీ ఉన్నట్లు పలు సర్వేలు వెల్లడించాయని రాహుల్ పేర్కొన్నారు. కానీ అనుకోని విధంగా తాము ఆయా ఎన్నికల్లో ఓడిపోయామన్నారు.

అనంతరం ఓటర్ల జాబితాను పరిశీలిస్తే ఎన్నికలకు వారం రోజుల ముందు దాదాపు కోటి మంది కొత్త ఓటర్లను చేర్చినట్లు గుర్తించామన్నారు. అలా కొత్త ఓటర్లను చేర్చిన అన్ని నియోజకవర్గాల్లో బిజెపి గెలుపొందిందని ఆరోపించారు. బీహార్‌లోను అదే కుట్ర పన్నుతున్నారని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల తర్వాత తాము ఓటర్ల జాబితా అడిగినప్పటికీ ఎన్నికల కమిషన్ అధికారులు ఇప్పటివరకు దానిని తమకు అందించలేదని రాహుల్ ఆరోపించారు. రాజ్యాంగ విలువలను రక్షించాల్సిన ఎన్నికల కమిషన్ తన బాధ్యతలు మరిచి బిజెపి సూచనల మేరకు పనిచేస్తోందని విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షాలు నిర్వహిస్తున్న బీహార్ బంద్‌పై బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్ ప్రభుత్వంలో ఎలాంటి తప్పులు చూపించడానికి అవకాశం లేకపోవడంతో కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమిషన్‌ను లక్ష్యంగా చేసుకున్నారని బిజెపి నేత షానవాజ్ హుస్సేన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్ బంద్ ముసుగులో వారు చేస్తున్న గూండాయిజాన్ని రాష్ట్ర ప్రజలుస్వయంగా చూస్తున్నారన్నారు. భారత పౌరులు మాత్రమే రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో ఓటు వేయాలనే ఆలోచనతో మాత్రమే ఇసి ఓటర్ల జాబితాలను సవరిస్తుందన్నారు.

# చైనా, పాక్, బంగ్లాల మైత్రితో భారత్‌కు పొంచి ఉన్న పెనుముప్పు

## సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్



**న్యూఢిల్లీ, జూలై 9:** చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల కలయిక భారత్ సుస్థిరత, భద్రతకు తీవ్ర సవాళ్లను సృష్టించగలదని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యానించారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని పలు దేశాల్లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభాన్ని అదునుగా చేసుకొని, వాటిపై విదేశీ శక్తులు పట్టును పెంచుకునే ముప్పు ఉందన్నారు. దీనివల్ల కూడా భారత్‌కు సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని చెప్పారు. అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ సీడీఎస్ ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లలో పాక్ కొనుగోలు చేసిన ఆయుధాల్లో దాదాపు 70 నుంచి 80 శాతం చైనావేనని ఆయన గుర్తు చేశారు. చైనా ఆయుధ తయారీ కంపెనీలతో పాకిస్థాన్ పెద్దఎత్తున ఒప్పందాలను కుదుర్చుకుందని అనిల్ చౌహాన్ తెలిపారు. ఆయా కంపెనీల ఆయుధ తయారీ యూనిట్లు, నిపుణులు పాక్ గడ్డపై కూడా కార్యకలాపాలు సాగిస్తుండొచ్చని అంచనా వేశారు. అణ్వస్త్ర దేశాలైన భారత్ పాక్‌లు మే 7 10 మధ్య తొలిసారిగా నేరుగా సైనిక శక్తులతో తలపడ్డాయన్నారు. నాలుగు రోజుల ఆపరేషన్ సిందూర్ వేళ చైనా సరిహద్దుల్లో ఎలాంటి అసాధారణ సైనిక చర్యలూ చోటుచేసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. చైనా పాక్ మధ్య వ్యూహాత్మక స్నేహం ఉందని, ఆపరేషన్ సిందూర్ చాలా తక్కువ రోజులే కొనసాగడంతో చైనా వైపు నుంచి స్పందన రాలేదని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. అయినప్పటికీ ఆ రెండు దేశాల స్నేహాన్ని తప్పకుండా భారత్ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పాక్ అణ్వాయుధ బ్లాక్ మెయిలింగ్‌కు భయపడకుండా ఆపరేషన్ సిందూర్‌ను భారత్ నిర్వహించిందన్నారు. రెండు అణ్వస్త్ర దేశాల మధ్య సైనిక ఘర్షణకు ఆపరేషన్ సిందూరే ఏకైక ఉదాహరణగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. భారత్ చేపట్టిన ఈ సైనిక చర్య చాలా ప్రత్యేకమైందని, దాని నుంచి ఆసియా దేశాలతో పాటు యావత్ ప్రపంచం పాఠాలను నేర్చుకోవచ్చన్నారు.

**ఇకపైనా సంప్రదాయక సైనిక ఘర్షణలే**

రాబోయే కాలంలోనూ సంప్రదాయక సైనిక ఘర్షణలే జరిగే అవకాశం ఉంది. అణ్వాయుధాల వినియోగం దాకా పరిస్థితులు తీవ్రతరం కావు. ఇందుకు మూడు ప్రాథమిక కారణాలు ఉన్నాయి. మొదటి కారణం ఏమిటంటే అణ్వాయుధాలను తొలుత ప్రయోగించకూడదనే భారత్ పాలసీ. అందుకే ఏ పరిస్థితుల్లోనైనా పాక్ కూడా భారత్‌తో సాధారణ తరహా (సంప్రదాయక) సైనిక ఘర్షణకే దిగుతుంది. రెండోకారణం ఏమిటంటే ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేసింది. దీనికి ప్రతిగా పాక్ సంప్రదాయక సైనిక ఘర్షణనే మొదలుపెట్టింది. మూడో కారణం ఏమిటంటే భారత్‌తో జరిగే సైనిక ఘర్షణలను ఏ స్థాయికి తీసుకెళ్లాలనేది పాక్ ఇష్టం. పాక్ స్పందించే రేంజ్ కంటే పెద్ద రేంజ్ లోనే భారత్ బలమైన సమాధానం ఇవ్వగలదు. ఈవిషయం పాక్‌కు బాగా తెలుసు. అందుకే అది సంప్రదాయక ఘర్షణకే పరిమితం అవుతుందిఖ అని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు.

**బాలిస్టిక్, హైపర్ సోనిక్, క్రూయిజ్ క్షిపణులతో పెద్దసవాల్**

సంప్రదాయక సైనిక ఘర్షణను పతాక స్థాయికి తీసుకెళ్లే సత్తా భారత్‌కు ఉందని సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. సైబర్, ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ మార్గాల్లోనూ దాడులు జరిపే సత్తా మన దేశానికి ఉందన్నారు. శత్రువులు ఈ తరహా దాడులు చేసినా ధీటుగా ఎదుర్కోగలమని ఆయన పేర్కొన్నారు. అయితే బాలిస్టిక్, హైపర్ సోనిక్, క్రూయిజ్ రకాల క్షి పణులు, పెద్దసంఖ్యలో డ్రోన్లు, దిశను మార్చుకుంటూ ప్రయాణించే మిస్సైళ్లు, డ్రోన్ల నుంచి పూర్తిస్థాయి రక్షణను కల్పించే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఇంకా ప్రపంచంలో ఎక్కడా అందుబాటులోకి రాలేదన్నారు. రాబోయే కాలంలో ఈ తరహా సవాళ్లను ఎదుర్కొనేలా భారత్ సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. ఏ క్షణమైనా శత్రుదేశాల దాడులను తిప్పికొట్టగల సైనిక సంసిద్ధత, 365 రోజుల్లో 24/7 అలర్ట్‌గా ఉండే వైఖరి అవసరమన్నారు.

# కర్ణాటకలో సిఎం మార్పు అనివార్యమా?

### అభివృద్ధి కోసమే ఢిల్లీకి వచ్చామంటున్న సిఎం, డిప్యూటీలు

**న్యూఢిల్లీ, జూలై 9:** కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవి మార్పుపై జరుగుతున్న ప్రచారం ఇప్పుడు ఢిల్లీకి చేరింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఇద్దరూ ఒకేసారి హస్తినలో పర్యటిస్తుండటంతో రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు ఊపందుకున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు నాయకత్వ మార్పును కోరుతున్నారనే వార్తల నేపథ్యంలో, ఇద్దరు కీలక నేతలు కాంగ్రెస్ అధిష్టానంతో సమావేశం కానున్నారనే ప్రచారం ఈ ఊహాగానాలకు ఊతమిస్తోంది. అయితే, ఈ పర్యటన పూర్తిగా రాష్ట్ర అభివృద్ధి పనులకు సంబంధించిందేనని అటు సిద్ధరామయ్య, ఇటు డికె శివకుమార్ స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన డికె శివకుమార్, తాను రాష్ట్ర నీటి పారుదల ప్రాజెక్టులకు నిధుల గురించి చర్చించేందుకు వచ్చానని తెలిపారు. మంత్రివర్గంలో ఎలాంటి మార్పులు ఉండబోవని ఆయన తేల్చిచెప్పారు. "సీఎం సిద్ధరామయ్య రక్షణ మంత్రితో సమావేశం కోసం వచ్చారు. మా పర్యటనలన్నీ అభివృద్ధి కోసమే" అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోరానని, ఆయన పాట్నా పర్యటన నుంచి తిరిగి రాగానే కలుస్తానని డికె వివరించారు. మరోవైపు, పార్టీ కర్ణాటక ఇన్‌చార్జ్ రణ్‌దీప్ సుర్జేవాలా బెంగళూరులో ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నారు. దీనిపై డికె స్పందిస్తూ, జిల్లా స్థాయిలో పార్టీని పునర్‌వ్యవస్థీకరించాలని అధిష్టానం కోరుతోందని, దానిపైనే సుర్జేవాలా కసరత్తు చేస్తున్నారని చెప్పారు. 2023లో కాంగ్రెస్ ఘన విజయం సాధించినప్పటి నుంచి సీఎం పదవిపై చర్చ కొనసాగుతూనే ఉంది. అప్పట్లో కుదిరిందని చెబుతున్న ఒప్పందం ప్రకారమే మార్పు జరగనుందనే వాదనలు వినిపిస్తున్నా, కాంగ్రెస్ దీనిపై అధికారికంగా స్పందించలేదు.

# ఆస్ట్రేలియాపై భారతీయులకు పెరుగుతున్న క్రేజ్!



**మెల్‌బోర్న్, జూలై 9:** పర్యాటకం కోసం ఆస్ట్రేలియా వెళ్లే భారతీయుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. సులభతరం చేసిన వీసా నిబంధనలు, పెరిగిన విమాన సర్వీసులు ఇందుకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. అందమైన ప్రకృతి, ప్రత్యేకమైన వన్యప్రాణులు, సిడ్నీ ఒపెరా హౌస్ వంటి అద్భుత కట్టడాలు ఉన్న ఆస్ట్రేలియా అంటే భారతీయులకు ఎప్పటి నుంచో ఆసక్తి ఉన్నప్పటికీ, ఈ ఏడాది పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. టూరిజం ఆస్ట్రేలియా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది మార్చితో ముగిసిన సంవత్సరంలో సుమారు 4.50లక్షల మంది భారతీయులు ఆస్ట్రేలియాను సందర్శించారు. ఇది గతేడాదితో పోలిస్తే 9.4 శాతం అధికమని టూరిజం ఆస్ట్రేలియా కంట్రీ మేనేజర్ (ఇండియా అండ్ గల్ఫ్) నిశాంత్ కాశికర్ తెలిపారు. పర్యాటకుల పెరుగుదలకు ప్రధాన కారణం సులభతరం చేసిన వీసా ప్రక్రియ అని ఆయన వివరించారు. అమెరికా, యూకే వంటి దేశాలతో పోలిస్తే ఆస్ట్రేలియా వీసా విధానం పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉండటం, పాస్‌పోర్ట్‌ను భౌతికంగా సమర్పించాల్సిన అవసరం లేకపోవడం, బయోమెట్రిక్స్ లేదా ఇంటర్వ్యూలు వంటివి లేకపోవడంతో భారతీయులకు చాలా సౌకర్యంగా మారిందని పేర్కొన్నారు.

వీసాతో పాటు భారత్‌ఆస్ట్రేలియా మధ్య విమాన కనెక్టివిటీ కూడా భారీగా పెరిగింది. కరోనాకు ముందు వారానికి కేవలం 8 విమానాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 27కు చేరింది. అంతేకాకుండా అమెరికా డాలర్‌తో పోలిస్తే ఆస్ట్రేలియన్ డాలర్ మారకం రేటు స్థిరంగా (సుమారు రూ. 55.56) ఉండటం కూడా సానుకూల అంశమని కాశికర్ అన్నారు. సిడ్నీ, మెల్‌బోర్న్ వంటి నగరాలతో పాటు ఇప్పుడు టాస్మానియా, కంగారూ ఐలాండ్ వంటి కొత్త ప్రదేశాలను చూసేందుకు కూడా భారత పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారని ఆయన తెలిపారు.



### ఆర్థిక నేరస్తురాలు మోనికా కపూర్


# అమెరికాలో అరెస్టు

**న్యూఢిల్లీ, జూలై 9:** రెండుదశాబ్దాలుగా ఆర్థికనేరాల్లో నిందితురాలిగా ఉంటూ తప్పించుకుని అమెరికాలో తలదాచుకున్న ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారు మోనికా కపూర్‌ను ఎట్టకేలకు సిబిఐ భారత్‌కు రప్పించింది. దిగుమతి లైసెన్స్‌లను దుర్వినియోగంచేసి కోట్లాదిరూపాయలు మోసానికి పాల్పడిందన్న అభియోగాలు ఎదుర్కొంటున్న ఆమె రెండుదశాబ్దాల క్రితమే అమెరికాలో ఆశ్రయం పొందుతున్నారు. ఆమెపై ప్రత్యేకించి మోనికా ఓవర్సీస్ సంస్థపేరిట 2.36 కోట్ల బంగారం దిగుమతుల్లో కూడా మోసం ఉందని సిబిఐ గుర్తించింది. 1998లో ఆమె తన సోదరులు రాజన్‌ఖన్నా, రాజీవ్‌ఖన్నాలతోకలిసి శిక్షార్హమైన నేరాలకు పాల్పడినట్లు అభియోగాలు నమోదయ్యాయి. షిప్పింగ్ బిల్లులు ఫోర్జరీ చేయడం, ఇన్వాయిస్‌లు, బ్యాంక్ సర్టిఫికేట్లు, ఎగుమతుల్లో అవకతవకలు వంటివాటికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. బంగారం ఉచిత దిగుమతులకోసం ఆరు లైసెన్సులు తీసుకుని వాటిని దుర్వినియోగంచేసారని, వాస్తవానికి ఆ లైసెన్సులు జ్యూయెలరీ ఎగుమతులకు నిర్దేశించినవని సిబిఐ వాదించింది. ఎగుమతులకు బదులుగా అహ్మదాబాద్ కేంద్రంగా ఉన్న డీప్ ఎక్స్‌పోర్ట్స్‌కు విక్రయించినట్లు నేరం మోపారు. అంతేకాకుండా మోనికా సంస్థ దిగుమతులను ఎలాంటి సుంకాలు లేకుండా బంగారం దిగుమతులుచేసుకున్నదని, దీనివల్ల భారత ఖజానాకు 1.44 కోట్లనష్టం వాటిల్లినట్లు అభియోగాలు నమోదుచేసారు. ఆమె సోదరులను ఢిల్లీకోర్టు 2017లో ఒకకేసులో శిక్ష విధించింది. ఇక మోనికా కపూర్ అయితే విచారణ, దర్యాప్తు, కోర్టు విచారణను తప్పించుకుంటూ వస్తోంది. 1999లో ఆమె అమెరికాకు వెళ్లిపోయారు. 2002లో కేసునమోదుకాగా ఛార్జిషీటు 2004లో దాఖలుచేసారు. కాగా మోనికా కపూర్‌ను ఉద్దేశ్యపూర్వక ఎగవేత దారుగా 2006లో ప్రకటించారు. ఇందుకు సంబంధించి నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ కాగా ఇంటర్‌పోల్ రెండ్‌కార్నర్‌నోటీసు కూడా జారీచేసింది. 2010లో భారత ప్రభుత్వం ఆమెను తమకు అప్పగించాలని అమెరికాను అభ్యర్థించింది. అయితే ఈ అప్పగింత ప్రక్రియ న్యాయపరమైన సవాళ్లతో జాప్యం జరిగింది. కపూర్ తన అప్పగింతను సవాల్‌చేసింది.

తనను అక్కడ చిత్రహిం సలకు గురిచేస్తారని, ఆమె వాదించింది. ఐక్య రాజ్య సమితిఒప్పందం ప్రకారం అమెరికా విదేశీ వ్యవహారాలు, సంస్కరణలు పునర్‌వ్యవస్థీకరణ చట్టానికి వ్యతిరేకంగా 1998లో ఆమె చేసిన క్లెయిమ్‌లన్నింటినీ తిప్పికొట్టారు. కాగా తాజాగా మోనికాకపూర్‌ను అమెరికాలో అదుపులోకి తీసు కుంది. అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం ఎఎ 292లో కపూర్‌ను సిబిఐ అధికారులు భారత్‌కు తీసుకువచ్చారు. ఈ అప్పగింత ఒక మేజర్ రికార్డు అని ఉద్దేశ్యపూర్వక ఎగవేతత దారులు ఎక్కడ ఉన్నా ఎప్పటికైనా భారత్‌కు రావాల్సిందేనన్న వాదనను నిజంచేసిందని సిబిఐ అధికారులు చెపుతున్నారు.

# గురుత్వాకర్షణ లేని స్థితిలో మెంతి, పెసరసాగుపై అధ్యయనం

## భారత్ వ్యోమగామి శుభాంశు శుక్లా



**న్యూఢిల్లీ, జూలై 9:** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వివిధ పరిశోధనలు చేస్తున్నారు. అందులో భాగంగా తాజాగా ఆయన ఐఎస్ఎస్‌లో రైతు అవతారం ఎత్తారు. రోదసిలో గురుత్వాకర్షణ లేని పరిస్థితుల్లో మెంతి, పెసర సాగుపై ఉండే ప్రభావాలపై అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా చిన్నపాటి గాజు పాత్రలో మెంతి, పెసర విత్తనాలను వేసి ఐఎస్ఎస్‌లోని నిల్వ ఫ్రీజర్ ఉంచి జీరో గ్రావిటీలో అవి ఏ విధంగా మొలకెత్తుతాయనే విషయాన్ని అధ్యయనం చేశారు. వాటికి సంబంధించిన ఫొటోలను తీశారు. ధార్వాడ్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన రవికుమార్ హోసమణి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన సుధీర్ సిద్ధపురెడ్డి అనే ఇద్దరు శాస్త్రవేత్తల సహాయంతో శుక్లా ఈ ప్రయోగాన్ని చేశారు. భూమిపైకి వచ్చాక ఆ మొలకలలో వచ్చిన జన్యుమార్పులు, పోషక విలువలను పరిశీలించినట్లు ఆక్సియం స్పేస్ వెల్లడించింది. మరో ప్రయోగంలో శుక్లా మైక్రో ఆల్గేలను అధ్యయనం చేశారు. వీటికి జీరో గ్రావిటీలో ఆహారం, ఆక్సిజన్, జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని పరిశీలించారు. స్టెమ్ సెల్ పరిశోధన, విత్తనాలపై సూక్ష్మ గురుత్వాకర్షణ ప్రభావాన్ని అధ్యయనం చేయడం, వ్యోమగాములు స్టేషన్‌లోని స్క్రీన్‌తో సంభాషించేటప్పుడు సమాచారాన్ని విశ్లేషించే వారి మానసిక సామర్థ్యం వంటి విషయాలను గమనిస్తున్నామని ఈ విషయాలు తనకు ఆనందాన్ని కలిగిస్తున్నాయని శుక్లా పేర్కొన్నారు. పరిశోధకులకు, స్పేస్‌స్టేషన్‌కు మధ్య వారధిగా ఉండి, వివిధ పరిశోధనలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు.

యాగ్జియం -4 ప్రైవేట్ స్పేస్ మిషన్‌లో భాగంగా శుభాంశు శుక్లా మరో ముగ్గురు వ్యోమగాములతో కలిసి గతవారం ఐఎస్ఎస్ చేరుకున్న సంగతి తెలిసిందే. అంతరిక్షంలోకి వెళ్లినప్పటి నుంచి శుక్లా అనేక ప్రయోగాలు చేశారు. ఖగోళంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై అధ్యయనం చేశారు. ఖగోళంలో మానవ జీర్ణవ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక వీడియోను భారత విద్యార్థుల కోసం చిత్రించారు. ప్రయోగాల్లో భాగంగా వ్యోమగాముల బృందం తమ మానసిక ఆరోగ్యంపై సైతం అధ్యయనం నిర్వహించింది.

# ఉత్తరకొరియా పౌరులను అప్పగించిన దక్షిణకొరియా

**సియోల్, జూలై 9:** తన ప్రత్యర్థి ఉత్తర కొరియాతో సంబంధాలను మెరుగుపరుచుకునేలా దక్షిణ కొరియా కీలకమైన చర్య చేపట్టింది. ఈ ఏడాది సముద్రంలో రక్షించిన ఆరుగురు ఉత్తర కొరియా పౌరులను సురక్షితంగా వారి స్వదేశానికి తిరిగి పంపినట్లు దక్షిణ కొరియా యూనిఫికేషన్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ పరిపాలనలో ఇరు దేశాల మధ్య సయోధ్యను పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలలో ఇది ఒక ముఖ్యమైన పరిణామంగా భావిస్తున్నారు.

ఈ ఏడాది మార్చి, మే నెలల్లో వేర్వేరు సమయాల్లో కొందరు ఉత్తర కొరియా పౌరుల పడవలు దారి తప్పి దక్షిణ కొరియా సముద్ర జలాల్లోకి ప్రవేశించాయి. వారిని దక్షిణ కొరియా అధికారులు రక్షించి అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి వారు తమను స్వదేశానికి పంపాలని పదేపదే కోరుకుంటున్నారని, వారి పూర్తి అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ ఉదయం ఇరు దేశాల మధ్య ఉన్న సముద్ర సరిహద్దు రేఖ దాటించి వారిని ఉత్తర కొరియా అధికారులకు అప్పగించినట్లు తెలిపింది. ఈ అప్పగింత ప్రక్రియ కోసం ఉత్తర కొరియాను సంప్రదించేందుకు సియోల్ చేసిన ప్రయత్నాలు విఫలమైనప్పటికీ, చివరికి ఉత్తర కొరియా అధికారుల సహకారంతో ఇది విజయవంతంగా పూర్తయింది.

గత నెలలో కొరియాల మధ్య సంబంధాలను మెరుగుపరిచే చర్యలలో భాగంగా, సరిహద్దుల్లో ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా ప్రచారం చేసే లౌడ్‌స్పీకర్లను దక్షిణ కొరియా సైన్యం ఆపివేసింది. ఈ చర్య ఇరు దేశాల మధ్య నమ్మకాన్ని పునరుద్ధరించడానికి, కొరియా ద్వీపకల్పంలో శాంతిని పెంపొందించడానికి సహాయపడుతుందని అప్పట్లో రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. చర్చలను పూర్తిగా నిలిపివేయడం అవివేకమని, అమెరికాతో సమన్వయం చేసుకుంటూనే ఉత్తర కొరియాతో సంబంధాలు మెరుగుపరచుకోవాలని అధ్యక్షుడు లీజేమ్యుంగ్ గత వారం వ్యాఖ్యానించిన విషయం గమనార్హం. 195053 యుద్ధం కేవలం యుద్ధ విరమణతో ముగిసింది కానీ శాంతి ఒప్పందం జరగనందున, సాంకేతికంగా ఇరు దేశాలు ఇప్పటికీ యుద్ధ వాతావరణంలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటువంటి చర్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# ప్రజల సేవ కోసమే టెక్నాలజీ

ప్రజలకు వైద్య ఖర్చుల భారం తగ్గించాలి - పంటల సాగు మొదలుకుని మార్కెటింగ్ వరకు రైతులకు అండగా నిలవాలి - వివిధ శాఖల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చేపడుతున్న కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, జూలై 9,ప్రభాతవార్తప్రతినిధి:** అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పుడైనా సరే తాను టెక్నాలజీ గురించి పదే పదే మాట్లాడేది ప్రజల కోసం.. ప్రజలకు మెరుగైన సేవలందించడం కోసమేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వివిధ శాఖల్లో గేట్స్ ఫౌండేషన్ తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై బుధవారం సచివాలయంలోని మొదటి బ్లాకులో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, పర్యావరణం, ఇన్ఫ్రా, ఆర్టీజీఎస్, స్వర్ణాంధ్ర విజన్2047, ప్రభుత్వ పాలనలో ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్ వంటి అంశాల్లో గేట్స్ ఫౌండేషనుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. ఆయా రంగాల్లో టెక్నాలజీని వినియోగించుకుని ప్రజలకు సేవలను మరింత దగ్గర చేసే అంశంపై గేట్స్ ఫౌండేషన్ సహకారం తీసుకుంటోంది. ఈ సందర్భంగా ఆయా శాఖల్లో బిల్ గేట్స్ ఫౌండేషన్ తో కలిసి చేపడుతున్న కార్యక్రమాల ప్రగతి, పురోగతి వంటి అంశాలపై సీఎం చర్చించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రస్తుత యుగంలో టెక్నాలజీ పెద్దఎత్తున అందుబాటులో ఉంది. టెక్నాలజీ ద్వారా చాలా వరకు పనులు త్వరితగతిన పూర్తి చేయగలుగుతున్నాం. అయితే ఆ టెక్నాలజీ ప్రజలకు ఎంతవరకు చేరువ చేయగలిగామనేదే ప్రధానం. రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సేవలందిస్తోంది. ఆగస్టు 15వ తేదీ నాటికి.. దాదాపు 95 నుంచి 97 శాతం ప్రభుత్వ సేవలు ప్రజలకు ఆన్ లైనులోనే అందుబాటులోకి వచ్చేస్తాయి. ఈ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు.. వారికి అర్థమయ్యేలా అవగాహన కల్పించాల్సిన అవసరం కూడా ఉంటుంది. బిల్ గేట్స్ ఫౌండేషన్ వద్ద ప్రపంచ వ్యాప్తంగా ఆయా రంగాల్లో అనుసరించే విధానాలకు సంబంధించిన సమాచారం ఉంటుంది. అలాగే టెక్నాలజీ పరంగా ఆయా అంశాల్లో ఎలా ముందుకెళ్లాలనే విషయంలోనూ వారికి నైపుణ్యం ఉంది. అందుకే వారితో కలిసి పని చేస్తున్నాం. అయితే ఆయా రంగాల్లో మనం అందిపుచ్చుకున్న సాంకేతికతను ప్రజలకు.. మరీ ముఖ్యంగా పేదలకు అందుబాటులోకి తేవాలి. టెక్నాలజీ ద్వారా ప్రజలు లాభం పొందాలి. అప్పుడే సాంకేతికతకు సార్థకత చేకూరుతుంది." అని చంద్రబాబు చెప్పారు. వైద్యం, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో ప్రభుత్వం టెక్నాలజీని వినియోగించడానికి ప్రత్యేక కారణం ఉంది. ఈ రంగాలు ప్రజలు, పేదలకు అత్యంత అవసరమైనవి. రానాను వైద్యమనేది సామాన్యునికి భారంగా మారుతోంది. ప్రజలపై వైద్య ఖర్చుల భారం తగ్గాలి. కొన్ని కొన్ని రోగాలకు కోట్లాది రూపాయల మేర డబ్బులు అవసరమవుతున్నాయి. అందుకే ఆరోగ్య రంగాన్ని టెక్నాలజీతో అనుసంధానించే అంశంపై దృష్టి పెట్టాం. ప్రతిఆరు నెలలకోసారి ప్రజలకు రక్త పరీక్షలు చేపట్టాలి. రోగాలు ఏమైనా వచ్చే అవకాశం ఉందా.. అనేది ముందుగానే గుర్తించాలి. ఆ డేటా ఆధారంగా ప్రజలకు ముందుగానే ఆరోగ్య సలహాలు.. సూచనలు అందించేలా చూడాలి. ప్రజల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేయడం ద్వారా వారికి కావాల్సిన వైద్య సేవలు, సూచనలు అందించాలి. ప్రతి రోజూ వ్యాయామం, యోగా వంటివి చేస్తే.. సగం రోగాలు తగ్గిపోతాయి. అలాగే మన ఆరోగ్య పద్ధతులు మార్చుకుంటే చాలా రోగాలు దరిచేరవు. ఇక పుట్టిన పిల్లల్లో వైకల్యం మొదలుకుని.. పోషకాహార లోపాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాన్ని గుర్తించగలగాలి. దీని కోసం కేర్ అండ్ గ్రో విధానాన్ని అనుసరిస్తున్నాం. ఎవరెవరికి ఏయే ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉన్నాయో తెలుసుకుని.. వారిని నిరంతరం మానిటర్ చేసేలా ఉండాలి. ఆఫ్ లైన్, ఆన్ లైన్ మెడికల్ కన్సల్టేషన్ ఉండాలి.

## సభ్యసమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు సరికాదు : ఉండవల్లి శ్రీదేవి




**నెల్లూరు రూరల్, జూలై 9, ప్రభాతవార్త** మహిళలపై సభ్య సమాజం తల దించుకునేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవీ అన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు చీదరించుకుంటున్నారని చెప్పారు. బుధవారం మధ్యాహ్నం నెల్లూరు నగరంలోని విపిఆర్ నివాసానికి వచ్చిన ఆమె ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కలిసి సంఘీభావం తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతిరెడ్డి గారి వ్యక్తిత్వ హననానికి పాల్పడడం దారుణమని, పూజించాల్సిన మహిళలపై సభ్యసమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు సరికాదన్నారు. ఇటీవల అమరావతి మహిళలపై వైసీపీ నేతలు నీచంగా మాట్లాడారని గుర్తు చేశారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ మహిళల గురించి దారుణంగా మాట్లాడుతున్నారని చెప్పారు. ఎంపీగా పోటీ చేసి డిపాజిట్లు దక్కని అనిల్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీలో ఉన్నప్పుడు వేమిరెడ్డి దంపతులని దేవుళ్ళు అన్నారని, ఇప్పుడు పార్టీ మారిపోతే వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సమంజసం కాదన్నారు. తల్లి, చెల్లిని పక్కన పెట్టారని, బాబాయ్ హత్య జరిగితే చెల్లికి న్యాయం చేసారా అని ప్రశ్నించారు. నారా లోకేష్‌కి చీర, సారె పంపిస్తామని మాజీ మంత్రి రోజా అన్నారని, అసెంబ్లీలో ఇష్టంవచ్చిన్నట్లు మాట్లాడారని అన్నారు. అందుకే మోనార్క్‌గా వ్యవహరించిన జగన్మోహన్ రెడ్డిని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారన్నారు.

పర్యటనల పేరుతో కార్యకర్తలన్ని చంపేస్తున్నారని, అమరావతికి పరిశ్రమలు రానీకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎస్సి కార్పొరేషన్ నిధులను గత ప్రభుత్వం తొక్కేసిందని, ప్రసన్న కుమార్ రెడ్డి తన వ్యాఖ్యలని వెనక్కి తీసుకుని ప్రశాంతిరెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## శాకంబరి అలంకారానికి ముస్తాబైన కాణిపాకం

**- విరాళంగా 20 టన్నుల కూరగాయాలు**

**కాణిపాకం, జూలై 9 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాయలలంలు ఆషాడ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి జరుగనున్న శాకాంబరి అలంకారంకు ముస్తాబయ్యాయి. 2022 నుండి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమనికంఠేశ్వరాలయంలో శ్రీమరగదాంభిగా దేవి, దుర్గాదేవిలకు వివిధ రకాల కూరగాయలు, పండ్లుతో శాకాంబరి అలంకారంను నిర్వహిస్తున్నారు. ఈఏడాది ప్రధాన ఆలయంలో కూడా శాకాంబరి అలంకారం నిర్వహించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ఈమేరకు అలంకరణకు అవసరమైన కూరగాయలను భక్తులు ఉచితంగా సమర్పించాలన్న విజ్ఞప్తితో భక్తులు వారికి తోచిన విధంగా వివిధ రకాల కూరగాయలు, పండ్లును విరాళంగా దేవస్థానంకు అందజేశారు. దీనితో పలమనేరు, కరా ్నటక రాష్ట్రం వడ్డేపల్లె, కోలారు, ముళబాగళ్, బెంగుళూరు, తమిళనాడు రాష్ట్రం హోసూరు ప్రాంతాలలోని కూరగాయల మార్కెట్ యజమానుల నుండి విరాళంగా అందజేసిన వివిధ రకాల కూరగాయలు, పండ్లు, కరివేపాకులతో ప్రధాన ఆలయం, మణికంఠేశ్వ రాలయంలను సరా ్వంగ సుందరంగా అలంకరిస్తున్నారు. ఈఆలయాల ప్రాంగణం మొత్తా్న్ని కూరగాయలు, పండ్లుతో అలంకరిస్తున్నారు. వేకువ జామున అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన అనంతరం కూరగాయలు, పండ్లుతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

## జగన్ బంగారుపాళ్యం పర్యటనను వివాదం చేసే ప్రయత్నం : మాజీ మంత్రి అంబటి రాంబాబు

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ సీఎం వైఎస్ జగన్ మామిడి రైతాంగాన్ని పరామర్శించే చిత్తూరు జిల్లా పర్యటనకు అడ్డుకునేందుకు బంగారుపాళ్యం పర్యటనను వివాదం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు.మూడు వేల మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలకు నోటీసులు ఇచ్చారు. పెట్రోల్ బంకుల వద్ద పోలీసులను కాపలా పెట్టారు. అనేకమందిని హౌస్ అరెస్ట్ చేశారు. హెలీప్యాడ్ వద్ద జనం ఎక్కువ వచ్చారని లాఠీఛార్జ్ చేశారు. విచ్చలవిడిగా పోలీస్ యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారు. పోలీసులు ఉంది లా అండ్ ఆర్డర్ కాపాడడానికా జగన్ పర్యటనను అడ్డుకోవడానికా? అంటూ విగ్రహం వ్యక్తం చేశారు. జగన్ బయటకు వస్తున్నారంటేనే వేలమంది పోలీసులు బంగారుపాళ్యం వచ్చారు. జగన్‌ను చూడడానికి వీల్లేదన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు అంబటి రాంబాబు. జగన్ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో మామిడి రైతుల సమస్యలను తెలుసుకుంటున్నారు. అనేక మార్లు అనుమతిలేదని చివరికి గత్యంతరంలేక అనుమతి ఇచ్చారు. బంగారుపాత్యం హెలిప్యాడ్ హెలిప్యాడ్ వద్ద అనేక ఆంక్షలు పెట్టారు. పెట్రోల్ బంక్‌లో పెట్రోలు కొట్టకుండా నిర్బంధిస్తున్నారు. జన సమీకరణ చేస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఎస్పీ మణికంఠ మాట్లాడడం బాధాకరం అన్నారు. అయితే, నారా లోకేష్ ఏం చెప్తే అది చేస్తారా? ఐపీఎస్ అధికారి అనే విషయాన్ని మరిచి నారా లోకేశ్ కోసం చెంచాలు మాదిరిగా కొందరు పోలీసులు పని చేస్తున్నారు అని దుయ్యబట్టారు. అయితే, మీ లాఠీతో జగన్‌కు వస్తున్న ఆదరణను ఆపలేరన్నారు. మామిడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత పెంచుకుంటుంది. జగన్ మాజీ ముఖ్యమంత్రి అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. ప్రజల ప్రవాహాన్ని ఉప్పెనను మీరు ఆపలేరు చిత్తూరు మామిడి పంటను ధర లేక రోడ్ల మీద పడవేసి రైతులు ఆందోళన చెందుతున్నారు. అనేక వాహనాలను తనిఖీ చేసి, కొన్ని వాహనాలకు నోటీసులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు, మామిడి రైతులను పరామర్శిస్తే తప్పు ఏంటి? మీకు ఎందుకు అంత భయం అని నిలదీశారు రాంబాబు, ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారు. మేము ఎక్కడ జన సమీకరణ చేయటంలేదు. బుర్ర లేని నారా లోకేశ్ మాటలు ఐపీఎస్ అధికారులు వినటం బాధాకరం అన్నారు. కూటమిప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులు ఒక్కొక్కటి వికటిస్తున్నాయి. ప్రజలకు మీరు మంచి చేస్తే భయం ఎందుకు? రాష్ట్ర డీజీపీ మాకు కనీసం అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదు. అందుకే ఆయనకు మళ్లీ పోస్టింగ్ పొడిగిస్తున్నారు.

## పేదరికాన్ని రూపుమాపడంలో కలిసికట్టుగా పని చేయాలి:మంత్రి కొల్లు రవీంద్ర

పేదల సంక్షేమాభివృద్ధికి పి-4 కార్యక్రమం




పి-4 కార్యక్రమం అమలుపై జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ, జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంలో భాగంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్షిప్ (పి 4) విధానం ద్వారా పేదల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కృషానణజిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం నియోజకవర్గానికి సంబంధించి పి-4 కార్యక్రమం అమలుపై పట్టణ, గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులు, పార్టీ నాయకులు తదితరులతో సమావేశమై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4 కార్యక్రమ ఉద్దేశాన్ని వారు వివరించి, సలహాలు, సూచనలు కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పి 4 ప్రపంచంలోనే ఒక గొప్ప కార్యక్రమం అని పేర్కొంటూ, మెరుగైన సమాజ నిర్మాణం కోసం రూపకల్పన చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన వ్యక్తుల సహకారంతో దిగువ కుటుంబాలను పైకి తీసుకురావాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అని, తద్వారా 2029 నాటికి సమాజంలోని పేదరికాన్ని జీరో స్థాయికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ప్రణాళిక ద్వారా పేదరిక నిర్మూలన, సమాజ అభివృద్ధికి మోలిక సదుపాయాలు, విద్య, వైద్యం అందించేందుకు సాధ్యమవుతుందన్నారు. పి 4 పథకం సమాజంలోని అగ్రశ్రేణి 10 శాతం ధనవంతులను ప్రోత్సహించి, దిగువన ఉన్న 20 శాతం పేద ప్రజలను దత్తత తీసుకొని వారికి మద్దతు ఇచ్చేలా చేస్తుందని, ధనవంతులు మార్గదర్శిగా వ్యవహరిస్తూ దిగువన ఉన్న బంగారు కుటుంబాలకు చేయూతనందించేలా చేస్తుందన్నారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్లో 19,17,151 బంగారు కుటుంబాలు గుర్తించగా, అందులో 1,64,546 బంగారు కుటుంబాలను 10,343 మంది మార్గదర్శిలు దత్తత తీసుకోవడం జరిగిందని తెలిపారు. కృష్ణాజిల్లాలో 68,948 బంగారు కుటుంబాలను గుర్తించగా, అందులో 2,723 బంగారు కుటుంబాలను 3,44 మంది మార్గదర్శలు దత్తత తీసుకున్నారని, మచిలీపట్నం నియోజకవర్గంలో 9,778 బంగారు కుటుంబాలు గుర్తించామని, అందులో 398 బంగారు కుటుంబాలను 106 మంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని మంత్రి తెలిపారు.

### అందరికీ మంచి జరగాలని ప్రార్థించా : తెలంగాణ ఎమ్మెల్సీ

**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలపై మెండుగా ఉండాలని ఆకాంక్షించినట్లు తెలంగాణ ఎంఎల్‌సి అంజిరెడ్డి తెలిపారు.

స్వామివారిని విఐపి బ్రేక్‌లో దర్శించుకున్నారు. స్వామివారు ముహిమాన్విత దేవుడని, ఆయన దర్శనంతో మనసు ఆనందంగా ఉందన్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## రొట్టెల పండగకు 2 లక్షల మంది భక్తులు

**నెల్లూరు కలెక్టరేట్, జూలై 9, ప్రభాతవార్త** నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగకు 4వ రోజు భక్తుల రద్దీ కొనసాగింది. నెల్లూరు నగరవాసులు భారీగా విచ్చేశారు. బుధవారం సుమారు 2లక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, మున్సిపల్ కమిషనర్ నందన్ ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్ల పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం, కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి.

## అంబరాన్నంటిన శాకంబరి ఉత్సవ సంబరాలు

**ఇంద్రకీలాద్రి, జూలై 9, ప్రభాతవార్త** ఇంద్రకీలాద్రిపై శాకంబరి ఉత్సవాల సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం నాడు జగన్మాత దుర్గమ్మ వారు శాకంబరి మాతగా దర్శించుకోటానిక భక్తజనం వెల్లువలా తరలివచ్చారు. క్యూలైన్లన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులకు త్వరితంగా దర్శనమయ్యేలా ఇఓ వికె శీనా నాయక్ చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం కలియతిరుగుతూ భక్తుల సౌకర్యాలపై ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. దుర్గమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులకు కదంబ ప్రసాదాన్ని అందించారు.

– నేడు గిరి ప్రదక్షణ:


దుర్గమ్మ వారు వేంచేసియున్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ కార్యక్రమం గురువారం ఆషాఢమాసం గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం 5.55లకు ఘాట్‌రోడ్డులో వేంచేసియున్న శ్రీ కామధేను ఆలయం వద్ద ప్రారంభిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ వ్యాసపౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున గిరి ప్రదక్షణ కార్యక్రమంలో పాల్గొని శ్రీ అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలన్నారు.

– నేడు పూర్ణాహుతి :

10 వ తేదీన గురువారం సప్తశతీ పారాయణం, మహావిద్యా పారాయణము, హోమము, శాంతి పౌష్టిక హోమాలు, మంటపపూజ, ఉదయం 9.30కు పూర్ణాహుతి నిర్వహిస్తారు.

– అలరించిన నృత్యనీరాజనం:

దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం కోలాటం, నృత్యప్రదర్శనలు భక్తులను అలరించాయి.



కూరలు, పండ్లతో అలంకరించిన దుర్గమ్మ ఆలయ ప్రాంగణం



శాకంబరిగా భక్తులను అనుగ్రహిస్తున్న దుర్గమ్మ

విజయవాడకు చెందిన శ్రీవాగ్దేవి నృత్యాలయం విద్యార్థులు నృత్యాచార్యులు సప్ప శివకుమార్ ఆధ్వర్యంలో నృత్యాన్ని ప్రదర్శించారు.


– ఇఓకు క్రికెటర్ ఎంఎస్‌కె ప్రసాద్ అభినందనలు:

దుర్గమ్మవారిని ప్రముఖ క్రికెటర్ ఎంఎస్‌కె ప్రసాద్ దర్శించుకున్నారు. ఆయనకు ఇఓ దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటో అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించగా ప్రసాద్ ఇఓను అభినందించారు.

## పుట్టపర్తిలో సత్యసాయి భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు

**- సౌకర్యాల లేమితో అధికారుల పాట్లు - నేడు కొత్తచెరువులో సిఎం చంద్రబాబు పర్యటన - ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి భారీ ఏర్పాట్లు**

**అనంతపురం జులై 8 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం కొత్త చెరువు మండలంలో గురువారం పర్యటించనున్నారు. కొత్త చెరువు మండలంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాల, సత్యసాయి బాలుర, బాలికల పాఠశాలలో జరిగే మెగ ఆపిటిఎం-2.0(మెగా పేరెంట్ టీచర్స్) కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ పాల్గొంటున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించే ఆలోచనతో రాష్ట్ర వ్యాప్తంగా గురువారం పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువు మండల కేంద్రంలో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ పాల్గొంటున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సిందూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జిల్లా అధికార యంత్రాంగం సర్వశక్తులు వడ్డుతున్నారు. ఇందులో భాగంగా, సత్యసాయి జిల్లాలో కొన్ని ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు వార్త ఓ ప్రయత్నం చేస్తోంది. అనంతపురం జిల్లా నుంచి సత్యసాయి జిల్లా కొత్తగా ఏర్పడింది. కొత్త జిల్లాలు ఏర్పాటు చేసినప్పుడు సత్యసాయిబాబా పేరును జిల్లాకు నామకరణం చేయడం హర్షం వ్యక్తం అవుతోంది. అదే సమయంలో పుట్టపర్తి కేంద్రంగా కొత్తగా ఏర్పడిన శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భవనాలు అధిక శాతం శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అనుబంధంగా ఉన్న భవనాల్లోనే నడుస్తున్నాయి. పక్కాగా ప్రభుత్వ భవనాలు లేనందున అధికారులు, సిబ్బంది అనేక అవస్థలకు గురవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి పోయే ప్రజలు కూడా అనేక అవస్థలకు గురవుతున్నారు. పుట్టపర్తితోపాటు కొత్తచెరువు, బుక్క పట్నం మండలాల్లో వివిధ శాఖలకు సంబంధించి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఎక్కువ భాగం భగవాన్ సత్యసాయి బాబా నిర్మించిన భవనాల్లోనే కార్యాలయాలు ఉన్నాయి. స్వచ్ఛందంగా ప్రభుత్వ కార్యాలయాలు నడుపుకునేందుకు సత్యసాయిసి సెంట్రల్ ట్రస్ట్ వారు తాత్కాలికంగా అనుమతి ఇచ్చినప్పటికీ అన్ని సౌకర్యాలతో ప్రభుత్వ భవనాలను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తగిన చొరవ తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు. సత్యసాయి జిల్లా కేంద్ర మైన పుట్టపర్తికి మడకశిర తదితర అన్ని ప్రాంతాల నుంచి లింక్ రహదారులు ఇంకా పకడ్బందీగా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ఆ దిశలో నిర్మాణాలు కొనసాగుతున్న ప్పటికీ పూర్తి చర్యలు తీసుకోవాల్సి ఉంది. అదే సమయంలో పుట్టపర్తి మండలంలోని కప్పలబండ ఏపిఐఐసి ఆధ్వర్యంలో ప్రోత్సహించేందుకు 100 ఎకరాల భూమి కొనుగోలు చేశారు.



## రేపు వెలగపూడిలో 'ప్రపంచ జనాభా దినోత్సవం'


**- హాజరుకానున్న సిఎం చంద్రబాబు**
**- ఏర్పాట్లు పరిశీలించిన గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి**

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూలై 9:** ఈ నెల 11వ తేదీన తుళ్ళూరు మండలం వెలగపూడి లోని రాష్ట్ర సచివాలయం సమీపంలో 'ప్రపంచ జనాభా దినోత్సవం' సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ తో కలసి పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమానికి సంబంధించి సభాస్థలి ఏర్పాట్లు, బారికేడ్లు,, వాహనాల పార్కింగ్ , సీటింగ్ , త్రాగునీరు, పారిశుద్ధ్య పనులు తదితర నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో చర్చించి సూచనలు జారీ చేశారు.

## అమరావతి స్ఫూర్తితో 'తుడ' అభివృద్ధి

**- సంస్థ పరిధిలో ప్రతి గ్రామానికి రోడ్లు, తాగునీరు, డ్రైన్ల నిర్మాణం**
**- పంచాయతికార్యదర్శుల సమావేశంలో తుడ చైర్మన్ దివాకర్‌రెడ్డి కీలక నిర్ణయాలు**

**తిరుపతి,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రఖ్యాతిగాంచిన తిరుపతి నదరానికి శ్రీవారి దర్శనార్థం ప్రతిరోజూ లక్షలాదిమంది భక్తులు వస్తున్నారని, ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రశాంతంగా దేవుని దర్శనం చేసుకుని సంతోషంగా తిరిగి వెళ్ళేవిధంగా అన్ని సౌకర్యాలు తుడ కల్పిస్తుందని తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. సిఆర్‌డిఎ పరిధిలో రాజధాని అమరావతి నిర్మాణం శరవేగంగా జరుగుతోందని, దాన్ని స్ఫూర్తిగా తీసుకుని తుడ పరిధిలో అభివృద్ధి పనులు మొదలుపెట్టామన్నారు. రాష్ట్రఅభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువమంత్రి నారాలోకేశ్ పడుతున్న కష్టంలో భాగం కావాలన్న సంకల్పంతో తుడ అభివృద్ధికి కష్టపడుతున్నామన్నారు. తుడ అభివృద్ధిలో కీలకమైన గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో బుధవారం తిరుపతిలోని కచ్చపి సమావేశం మందిరంలో తుడ ఉపాధ్యక్షుడు శుభం బన్సల్‌తో కలసి తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి సుదీర్ఘసమావేశం నిర్వహించారు. తుడ పరిధిలోని ప్రతి గ్రామానికి రోడ్లు, తాగునీరు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. ఈ పనుల్లో పంచాయతి కార్యదర్శులు పూర్తిసహాయసహకారాలందించాలని ఆయన కోరారు. తుడ పరిధిలో లేఅవుట్ల అనుమతులు సరళతరం చేస్తున్నామని, అక్రమ లే అవుట్లు ,అనుమతులులేని భవన నిర్మాణాలు పంచాయతి కార్యదర్శులు గుర్తించాలన్నారు. సమాజ అభివృద్ధిలో మీ భాగస్వామ్యం కీలకమని స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రచరిత్రలోనే



మొదటిసారి 4 మున్సిపాల్టీలు, 9నియోజకవర్గాలు, 39 మండలాల ఎంపిడిఒలు, 1,100పైగా గ్రామపంచాయతీలు కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. పంచాయతి పరిధిలో కార్యదర్శులు అక్రమ లేఅవుట్లు ఎలా గుర్తించాలి, ఎలా అనుమతులు ఇవ్వాలని,భవననిర్మాణాల అనుమతులు తదితర అంశాలనుకూలంకుషంగా వివరించారు. మండలాలు, జిల్లాల అభివృద్ధిలో గ్రామపంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైందని, వారి హోదాకు ఎలాంటి భంగం కలగకుండా చూస్తామని తుడ ఛైర్మన్ స్పష్టం చేశారు.

## పరామర్శల పేరుతో జగన్ విధ్వంసకర ర్యాలీలు: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతుల పరామర్శ పేరుతో విధ్వంసకర ర్యాలీలు చేయడం జగన్ కే చెల్లాయని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. బంగారుపాళ్యంలో హెలిప్యాడ్ నుంచి పర్యటన చేసే స్థలం వద్దకు ర్యాలీగా రావడంపై మండిపడ్డారు. హెలిప్యాడ్ వద్దకు 30 మందికి అనుమతిస్తే 300 మంది వచ్చారన్నారు. సీఎం గా పని చేసిన వ్యక్తి ఈ సమాజానికి ఎలాంటి మెసేజ్ ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. ముందు వేసుకున్న ప్లాన్ ప్రకారమే ర్యాలీలు చేస్తున్నారన్నారు. పోలీసులు, విలేకరులపైనా దాడులకు తెగబడుతున్నారన్నారు. మంత్రివర్గం సమావేశం అనంతరం సహచర మంత్రులు నాదెండ్ల మనోహర్ ,అనగాని సత్యప్రసాద్‌తో కలిసి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. రాబోయే సమస్యలను ముందే ఊహించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. చిత్తూరు,అన్నమయ్య, జిల్లాల్లో మామిడిరైతులుఇబ్బందులు పడ్డారు. 2.5 లక్షల టన్నుల తోతాపురి మామిడి ఉత్పత్తి జరిగింది. మామిడతి ఉత్పత్తి బాగా పెరిగే సరికి ధర తగ్గింది. తోతాపురి మామిడిని పల్ప్ పరిశ్రమలే కొంటాయి. గతేడాది నిల్వలు ఉండటంతో ఆ పరిశ్రమలూ ఆసారి కొనలేదు. తోతాపురి మామిడిని రూ.12కు కొనాలని నిర్ణయించాం. రూ.8కు మామిడికొనాలని ఆయా పరిశ్రమలకు చెప్పాం. ప్రభుత్వం తరపున కిలోకు రూ.4 సాయం చేస్తామని చెప్పాం. అన్నమయ్యజిల్లాల్లో 99శాతం కొనుగోలు చేశాం. చిత్తూరు జిల్లాలో 80 శాతంకొనుగోలు జరిగింది.

### పాపాలు చేసిన జగన్ నాకు శాపాలు పెట్టడం ఏంటి? : మంత్రి నారా లోకేష్

**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంది మీరే కదా జగన్‌గారు అంటూ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్రశ్నించారు.,"ఎక్స్" వేదికగా ఆయన మాజీ సీఎం జగన్‌పై పలు విమర్శలు చేసారు.

ఇప్పుడు దొంగే దొంగా దొంగ అన్నట్టు, ఎందుకీ నాటకాలు? 2020- 21లో మొదటి బ్యాచ్ ప్రారంభం అయ్యింది. యూనివర్సిటీకి కనీసం సొంత బిల్డింగ్ లేకుండా, ఫుల్ టైం ఫ్యాకల్టీ కూడా లేకుండా 3 ఏళ్ళు నడిపించింది మీ ప్రభుత్వంలో కాదా? కనీసం ఫుల్ టైం ఫ్యాకల్టీ కూడా లేకుండా కన్సల్టెంట్లతో నడిపించి, విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారు.

# కీలక పోస్టుల భర్తీకి చర్యలు

## ఎంవిఐ పాసింగ్ పెరేడ్‌లో రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్



బుధవారం ఎంవిఐల గౌరవ వందనం స్వీకరిస్తున్న రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికిరవాణా శాఖలో పలు కీలక పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.బుధవారం రాజా బహదూర్ వెంకటరామరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసిన 96 మంది అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ ఔట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంవిఐల గౌరవ వందనం స్వీకరించి శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఏవీఎంబలకు ఆవార్డులు ప్రదానం చేశారు.అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నాలుగు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎంవీఐలకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వంలో అనేక ప్రజా యుత కార్యక్రమాలు తెచ్చిందని దాంతో తెలంగాణ రవాణా శాఖ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. పోలీస్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ తీసుకున్న పిఎంవీఐలు రోడ్డు ప్రమాదాలు నివారించడానికి మీ శక్తి ఉపయోగించాలని యాక్సిడెంట్‌లో డెత్ రేట్ తగ్గించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాడంతో పాటు ట్రాఫిక్ ఉల్లంఘన చేస్తున్న వారిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చేస్తూ కఠినంగా వ్యవహరించాలని సూచించారు.రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్( ఏఐ) తీసుకొచ్చి వెహికిల్ ఫిట్‌నెస్ చేస్తున్నామన్నారు. మీరంతా రవాణా శాఖలోకి రావడంతో ఈ డిపార్ట్ మెంట్ మరింత పటిష్టమైందన్నారు.దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలలో గాయపడితే క్యాష్ లెస్ ట్రీట్మెంట్ విధానం కేంద్రం తీసుకొచ్చిందని, రోడ్డు ప్రమాదాలు నివారించేలా చర్యలు తీసుకో వాలని ఇప్పటికే విధుల్లో ఉన్న 300కి పైగా సిబ్బందికి 2నెలలచొప్పున శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.హైదరాబాద్‌లో ఈవీ, సిఎన్జీ ఎల్పీజ్ వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.దేశంలో రవాణాశాఖలో నియామకం అవుతున్నవారందరికీ మీరు రోల్ మోడల్‌గా ఉండాలని,జిల్లా అధికారులతో సమన్వ యం చేసుకుంటూ మంచి పేరు తెచ్చుకుని మీ తల్లితండ్రులతో పాటు మీ గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

# విద్యార్థులకు మోడీ కిట్స్ ఇస్తా

## సైకిళ్లు పంపిణి చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్


బుధవారం కరీంనగర్‌లో పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణి చేస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:** కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పదవతరగతి చదివే విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసే కార్యక్రమానికి హాజరయ్యారు. మొత్తం 20 వేల సైకిళ్లను స్వయంగా కొనుగోలు చేసిన బండి సంజయ్ వాటిని దశల వారీగా పంపణీ చేసే కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. మొదట కరీంనగర్‌టౌన్ లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బండి సంజయ్ తోపాటు టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య,జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ అశ్వినీ, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజీపీ కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి,ఆర్డీవో, డీఈవోతోపాటు పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అండగా ఉంటూ సమాజానికి సేవ చేయాలనే మా లో ఎప్పటికప్పుడు స్ఫూర్తినింపిన నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ అని అన్నారు.వారి బాటలో నడుస్తూ మాకు చేతనైనంత సాయం చేస్తున్నాం. ఈ సైకిళ్ల పంపిణీ ఆలోచన ఇచ్చిందే జిల్లా కలెక్టర్. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో బాలికలకు సైకిళ్లు ఇస్తే బాగుంటుందని జిల్లా కలెక్టర్ ప్రతిపాదించారు. ఆ ఆలోచనతోనే టెన్త్ విద్యార్థినీ, విద్యార్థులందరికీ సైకిళ్లు పంపిణీ చేస్తున్నం. ఇవి ప్రభుత్వ నిధులు కావు. అట్లని నేను కోట్లు ఖర్చు పెట్టేంత సంపన్నుడిని కాదు. మా దగ్గరకు వచ్చిన కొందరు కార్పోరేట్ కంపెనీల యాజమానులను మీరు సంపాదించిన సొమ్ములో కొంత సీఎస్ఆర్ ఫండ్ కింద ఇవ్వాలని కోరితే వారు సానుకూలంగా స్పందించి ఆ నిధులు అందిస్తే వాటితో సైకిళ్లను కొని మీకు పంపిణీ చేస్తున్నా. నేను కూడా చిన్నప్పటి నుండి మీలాగే పేదరికంలో పెరిగిన. ఇక్కడే కాపువాడలో పుట్టి పెరిగిన. తినడానికి ఇబ్బంది పడ్డ. మా తల్లి దండ్రులు మమ్ముల్ని ఎంతో కష్టపడి చదివించారు. కష్టాలు తెలిసిన వ్యక్తిని కాబట్టే మీరు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని సైకిళ్లను పంపిణీ చేస్తున్నా. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో రోల్ మోడల్. ఒడిశా నుండి వచ్చి కష్టపడి పని చేస్తూ మీఅందరికీ స్ఫూర్తిగా ఉన్నారు. పోలీస్ కమిషనర్ బీహార్ నుండి ఇక్కడికి వచ్చారు. ఆయన తండ్రి మిలటరీలో పనిచేశారు. క్రమ శిక్షణతో ఎదిగి వచ్చారు. వీళ్లే కాదు... మహాత్మా గాంధీ, అంబేద్కర్, మోదీ కూడా పేదరికం నుండి ఎదిగిన వాళ్లే.ముఖ్యంగా అంబేద్కర్ ఎన్ని కష్టాలు అనుభవించారో, అంటరానితనాన్ని ఎదుర్కొన్నారో మాటల్లో చెప్పలేం. ఇప్పుడు మీ కష్టాలను తీర్చడానికి మోదీ ఉన్నాడు. మా హయాంలో ఆదుకునే వాళ్లే లేరు.మోదీ ప్రభుత్వం విద్యా రంగానికి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. యూపీఏ హయాంలో (2014 15 బడ్జెట్‌లో) విద్యా రంగానికి కేంద్రం 68 వేల 728!!కోట్లు మాత్రమే కేటాయిస్తే. ఈ ఒక్క ఏడాదే(2025 26) 1 లక్షా 28వేల 650 కోట్ల రూపాయలు కేటాయించింది. అంటే యూపీఏతో పోలిస్తే విద్యా రంగానికి నిధుల కేటాయింపు రెట్టింపు పెరిగింది. ఈ 11 సంవత్సరాల్లో ఒక్క విద్యా రంగానికే దాదాపు 8!!లక్షల కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేశామంటే విద్యా రంగంపై మోదీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అయితే...ఇన్ని నిధులు ఖర్చు చేస్తున్నా విద్య అనేది 1976 వరకు రాష్ట్ర ప్రభుత్వాల నిధుల విషయానికొస్తే రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్రం కూడా నిధులు కేటాయిస్తుంది. అయితే పాఠశాలలను నడిపే బాధ్యతను, స్థానిక భాషలో పాఠ్యంశాలు బోధించే అంశాలను అమలు చేయాల్సింది మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే. ఎందుకంటే కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో విద్యా రంగం ముందుకు సాగుతుందనే నమ్మకంతోనే ఈ జాతీయ విద్యా విధానాన్ని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చింది.మీకందిస్తున్న సైకిళ్లు మోదీ గిఫ్ట్. అతి త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అతి త్వరలో "మోదీ కిట్స్"ను అందజేయబోతున్నాం. ఎన్ని వేల మంది ఉన్నా, ఎన్ని లక్షల మంది ఉన్నా వాళ్లందరికీ మోదీ కిట్స్‌ను అందిస్తామని అన్నారు.

# మూతపడిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల పునరుద్ధరణకు సహకరించండి

## కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డి కుమార స్వామికి విజ్ఞప్తి చేసిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,జులై 9, ప్రభాతవార్త** :తెలంగాణాలో మూతపడిన రెండు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల పునరుద్ధరణకు చొరవ చూపాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డి కుమార స్వామికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలోని సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) పునరుద్ధరణకు కేంద్ర మంత్రి హెచ్ డి కుమార స్వామి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు సిసిఐ, ఎస్ఐఐఎల్ పై కేంద్రమంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించడం పట్ల మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణలో పారిశ్రామిక ప్రగతి,ఉపాధి కల్పన రంగాలను బలోపేతం చేసేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని, రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ పునరుద్ధరణకు నోచుకున్నట్లుగానే సిసిఐ,ఎస్ఐఐఎల్‌ల పునరుద్ధరణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని మంత్రి ఈ సందర్భంగా ఆయనకు వివరించారు.సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) పునరుద్ధరణ అవసరాన్ని, ప్రాధాన్యతను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి తెలిపారు.గతంలో పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ పునరుద్ధరణను రూ. 5000 కోట్లతో చేపట్టిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఆదిలాబాద్ లోని సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) మూతపడడానికి దారితీసిన పరిస్థితులను,ఈ పరిశ్రమల పునరుద్ధరణతో యువతకు ఉపాధి అవకాశాల మెరుగుదల, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి వివరించారు. వెనుకబడిన, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలైన ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ పరిశ్రమల పునరుద్ధరణతో ప్రాంతీయాభివృద్ధిలో సమతుల్యత సాధ్యమై రాష్ట్రం,దేశం ప్రగతిబాటలో పయనిస్తాయని కేంద్రమంత్రికి వివరించారు.ఆర్థిక, సామాజిక పురోగతికి దన్నుగా నిలిచే ఈ పరిశ్రమలను పునరుద్ధరించాల్సిందిగా కోరారు.సమగ్ర వివరాలతో కూడిన లేఖను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి అందించారు.ఈ నెలాఖరులో తెలంగాణ రాష్ట్రానికి వచ్చి, తెలంగాణలో నెలకొని వున్న కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల పనితీరుతో పాటు, సంబంధిత పరిశ్రమల పునరుద్ధరణకు చర్యలు చేపట్టే దిశగా సమీక్షను నిర్వహిస్తానని కేంద్రమంత్రి మంత్రి శ్రీధర్ బాబుకు స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల మేరకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

# నియోజక వర్గాల్లో పంచాయితీలు సహజం

## మంత్రి వివేక్ వెంకట స్వామి


బుధవారం గాంధీభవన్‌లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్,జులై 9, ప్రభాతవార్త** :బిఆర్ఎస్‌లో కెటిఆర్, కవితకు మధ్యనే పంచాయితీ ఉన్నప్పుడు నియోజవర్గాల్లో పంచాయితీ సహజం అని అన్నారు మంత్రి వివేక్. అందర్నీ కలుపుకుపోయి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో ప్రజల వినతులు స్వీకరించిన మంత్రి..సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి కొన్ని లైవ్ లోనే పరిష్కరించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి గత బీఆర్ఎస్ పాలనపై విమర్శలు గుప్పించారు. గత10 ఏండ్లు మంత్రులతో ప్రజలు మాట్లాడే అవకాశం లేదని అన్నారు మంత్రి వివేక్. కానీ తమ ప్రభుత్వంలో ర్జాగా మంత్రులను కలిసే అవకాశం ఉందని చెప్పారు. బీఆరెస్ హయాంలో పోలీసుల పహారా ఉండేదని.. కానీ తమ ప్రభుత్వంలో ఇప్పటి వరకు ఎవ్వరిపైనా కేసులు కూడా పెట్టలేదని గుర్తు చేశారు.గత బిఆర్ఎస్ ధర్నా చౌక్ ఎత్తివేసిందని కానీ తమ ప్రభుత్వం ధర్నాలకు అవకాశం ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పాలన అందిస్తుందని అన్నారు.పాశమైలారం ఘటన జరిగిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారని.. కానీ గతంలో కొండ గట్టు ఘటన జరిగితే కేసీఆర్ పోయిన పాపాన పోలేదని విమర్శించారు. పాశమైలారం ఘటన వద్దకు సీఎం వెళ్లినా కూడాసీఎం వెళ్ళలేదని కేటీఆర్ ట్వీట్ చేయడంపై మంత్రి మండిపడ్డారు.పిసిసి చీఫ్ మహేష్ కుమార్ ఇన్షియేటివ్ తో మంత్రులతో ముఖాముఖీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకే మంత్రితో ముఖాముఖి కార్యక్రమం అన్నారు.మంత్రులు, ఎమ్మెల్యేలు జనంలో ఉండాలని సీఎంఆదేశించారని చెప్పారు.నియోజకవర్గంలో ఎమ్మెల్యేలే సుప్రీం అని అన్నారు మంత్రి వివేక్. ఇన్నాళ్లుగా పార్టీని నమ్ముకుని ఉన్నవాళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టత ఇచ్చారని తెలిపారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో జాయిన్ అయ్యి పార్టీ కోసం పనిచేసిన వారికి కూడా కొంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారని అన్నారు. పీసీసీ పదవులు.. పార్టీ పదవుల గురించి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పరిశీలిస్తున్నారని తెలిపారు. పాత, కొత్త విబేధాలు లేవనీఅందరినీ కలుపుకుని ముం దుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు.గురువారం కేబినెట్ లో యాక్షన్ టేకెన్ రిపోర్ట్ గురించే చర్చ ఉంటుందని తెలిపారు మంత్రి వివేక్. గత కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలు అమలు అవుతున్నాయో లేదో డిస్కషన్ ఉంటుందని అన్నారు. గిగ్ వర్కర్ల చట్టం గురించి ప్రిపరేషన్స్ నడుస్తున్నాయని.. గిగ్ వర్కర్స్ హక్కుల కోసం చర్యలు తీసుకుంటామని సీఎం సలహా మేరకు అసెంబ్లీలో పెట్టే అవకాశం ఉందని తెలిపారు.

సిగాచి 43 మంది చనిపోయిన ఘటనలో ఎంక్వైరీ చేయాల్సి ఉందని తెలిపారు. డిసెంబర్ లో ఇన్ స్పెక్టర్ రిపోర్టు ఇచ్చారు అందులో అన్నీ మెన్షన్ చేశారని చెప్పారు. కంపెనీ సూచనలు పాటించి ఉంటే ఇంత పెద్ద ప్రమాదం జరిగి ఉండేది కాదని తెలిపారు.మేనేజ్‌మెంట్స్, ఫెడరేషన్స్ తో25 న మీటింగ్ ఉందని భవిష్యత్తులో ప్రమాదం జరగకుండా ఉండేందుకు ఏంచేయాలో అక్కడ నిర్ణయం తీసుకుంటామన్నారు.

# రిజర్వేషన్లు అమలు చేయపోతే యుద్ధమే: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్,జూలై 9,ప్రభాతవార్త:** స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 రిజర్వేషన్లు అమలు చేస్తూ జీవో జారీ చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని లేకుంటే రాష్ట్రంలోని బిసిలంతా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం చేస్తామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాజారామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 (4), ఆర్టికల్ 16 (4) ప్రకారం ఏ వర్గాలకైతే సరైన ప్రాతినిధ్యం లేదని భావిస్తే.. కుల గణన లెక్కల ఆధారంగా వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని అన్నారు. ఇటీవల బీహార్ రాష్ట్ర ప్రభుత్వం కులగణన ద్వారా 63 రిజర్వేషన్లు ఇచ్చి, బీసీలకు లక్షకుపైగా ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అధికారం తమ చేతుల్లో ఉన్న.. కేంద్ర ప్రభుత్వంపైకి నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీలను మోసం చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లితే మండల్-2 ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బీసీ హిందూ ఆజాది జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వరులు, బీసీ అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లోడంగి గోవర్ధన్ యాదవ్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు వాసుకే యాదవ్, గొర్ల కాపరుల సంక్షేమ సంఘంరాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండెబోయిన అయోధ్య యాదవ్, బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడు అంజి యాదవ్, శ్రీరామ్ యాదవ్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అభయ హస్తం దరఖాస్తు గడువు పెంపు

**హైదరాబాద్, జూలై 9, ప్రభాతవార్త:** కార్పోరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రారంభించిన సివిల్స్ అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు.ఈమేరకు హైదరాబాద్‌లో బుధవారం ఒక ప్రకటనలో ఈ పథకం ద్వారా రాష్ట్రం నుండి సివిల్స్ ప్రిలిమ్స్‌లో పాసై మెయిన్స్‌కు హాజరవుతున్న అభ్యర్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణకు గడువు ఈనెల 7వ తేదీతో ముగిసిపోయిందని, అయితే అభ్యర్థుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకుదాన్ని ఈ నెల 12వ తేదీ వరకుపెంచుతూనిర్ణయంతీసుకున్నట్లు వెల్లడించారు.


బుధవారం చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో గుజ్జ కృష్ణ, దుర్గానరేశ్ తదితరులు

# 23, 24 తేదీలలో 'చలో ఢిల్లీ' : ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై 9 ప్రభాతవార్త:** దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బిసిలకు పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23, 24 'చలో ఢిల్లీ' పేరిట ఓబిసి జాతీయస్థాయి సదస్సులు నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ సదస్సులకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుంచి బిసిలు పాల్గొంటారని చెప్పారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గానరేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చలో ఢిల్లీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో బిసిలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, రెండు లక్షల కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పథకం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నాయకులు కవిత హైందవి, జోషి, రవియాదవ్, పగిళ్ళ సతీష్, జిల్లపల్లి అంజీ, రాందేవ్, నిఖిల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఐ రామకృష్ణపై దాడిని ఖండించిన తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్

**హైదరాబాద్,జులై 9, ప్రభాతవార్త** :కోర్ట్ ఆదేశాల మేరకు విధి నిర్వహణలో భాగంగా ఫీల్డ్ ఎంక్వయిరీకి వెళ్ళిన గద్వాల మండలం,జోగులాంబ గద్వాల జిల్లా రెవిన్యూఇన్స్పెక్టర్ రామకృష్ణపై జరిగిన దాడిని తెలంగాణ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్రకమిటి తీవ్రంగా ఖండిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి,ప్రధాన కార్యదర్శి బిక్షం ఒక ప్రకటనలో తెలిపారు.క్షేత్ర స్థాయిలో సిబ్బంది లేకున్న అనేక కష్ట నష్టాలకు ఓర్చి విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్‌లపై దాడులు దురదృష్టకరమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా భాద్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. నిబద్ధత, అంకిత భావంతో పనిచేస్తున్న రెవిన్యూ కుటుంబసభ్యులకు రాష్ట్రకమిటి అన్ని వేళలలో, అన్నిరకాలుగా అండగా ఉంటుందన్నారు.

# సమ్మెతో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్

## సింగరేణికి రూ.76 కోట్ల నష్టం!

**హైదరాబాద్, జూలై 9, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన భారత్ బంద్ పిలుపు మేరకు సింగరేణిలో ఒక రోజు టోకెన్ సమ్మెలో కార్మికుల పాల్గొన్నారు. దీంతో బుధవారం సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్ పడింది. ఫలితంగా సంస్థకు పెను భారంగా పరిణమించింది.ఒక్కరోజు సమ్మెతో 1.92 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. దాదాపు 76 కోట్ల రూపాయల విలువైన బొగ్గు ఉత్పత్తికి నష్టంతో పాటు, సమ్మెలో పాల్గొనే కార్మికులకు కూడా వేతన రూపంలో కొంత నష్టం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ విధంగా కార్మికులు దాదాపు 13 కోట్లు నష్టపోవాల్సి వస్తుందని అంచనా. ఎట్టి పరిస్థితుల్లో కార్మిక వర్గం సమ్మెలో పాల్గొనకుండా సహకరించి ఉత్పత్తికి అవాంతాలు కలుగకుండా చూడాలని సింగరేణి యాజమాన్యం విజ్ఞప్తి చేసినా వాటిని కార్మికులు ఖాతరు చేయలేదు. ఈ సమ్మెకు ముందునే కార్మిక సంఘాలన్నీ సింగరేణిలో సమావేశం నిర్వహించారు. ఒక్కరోజు సమ్మె విజయవంతం కోసం కార్మిక సంఘాలన్నీ గేట్ మీటింగ్ నిర్వహించాయి. విస్తృతంగా ప్రచారం చేశాయి. తొలుత మార్చి 20న సమ్మె చేయాలని అనుకున్నా భారత్, పాకిస్థాన్ సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ సమ్మె వాయిదా పడింది. కాగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఐదు జాతీయ సంఘాల్లో నాలుగు సమ్మెకు మద్దతు తెలిపాయి. బీజేపీ అనుబంధ సంఘం మాత్రం సమ్మెకు దూరంగా ఉంది. విప్లవ కార్మిక సంఘాలు సైతం సింగరేణి సమ్మెకు మద్దతు ప్రకటించాయి. కార్మికుల హక్కులు రక్షించుకోవాలంటే సమ్మెలో కచ్చితంగా పాల్గొనాలని కార్మిక సంఘాలు ముందుగానే నిర్ణయించి, ఈ సమ్మెను విజయవంతం చేశాయి.

# ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు వేగవంతానికి కీలక నిర్ణయం

## ప్రాజెక్ట్ డైరెక్టర్లుగా గ్రూప్-1 అధికారులు

**హైదరాబాద్,జులై 9, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలును వేగవంతం చేయడానికి కీలక చర్యలు తీసుకుంటోంది. జిల్లాల హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లుగా గ్రూప్1 అధికారులను (డిప్యూటీ కలెక్టర్లు) నియమిస్తోంది. ఇప్పటివరకు 3.71 లక్షల ఇళ్లు మంజూరు కాగా 40 శాతం లోపే గ్రౌండింగ్ అయ్యాయి. సిబ్బంది కొరత, నిధుల జాప్యం, నిర్మాణ సామగ్రి ధరలు, లబ్ధిదారుల ఎంపికలో అస్పష్టత వంటివి జాప్యానికి కారణాలుగా అధికారులు భావిస్తున్నారు. ఈ సవాళ్లను అధిగమించి పథకాన్ని వేగవంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా గ్రూప్ 1 అధికారులను పీడీలుగా నియమిస్తోంది. ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం, ఆసిఫాబాద్, నిజామాబాద్, గద్వాల, మహబూబాబాద్, కరీంనగర్ జిల్లాలకు కొత్తపీడీలను నియమించారు. వీరంతా రెవెన్యూశాఖలో డిప్యూటీ కలెక్టర్ల స్థాయి అధికారులు. వీరిని డిప్యుటేషన్‌పై గృహనిర్మాణ శాఖకు బదిలీ చేశారు.సాధారణంగా హౌసింగ్ పీడీలుగా ఎస్ఈ (సూపర్ఇంటెండెంట్ ఇంజనీర్) స్థాయి అధికారులు ఉంటారు. ప్రస్తుతం పలు జిల్లాల్లో డీఈఈ (డివిజనల్ ఇంజనీర్), ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)లు పీడీలుగా కొనసాగుతున్నారు. అయితే, వీరి పర్యవేక్షణలో పథకం అమలు అనుకున్నంత వేగాన్ని అందుకోలేకపోవడంతో పలు జిల్లాల్లో పథకం నత్తనడకన సాగుతోంది. ఈ నేపథ్యంలో పథకం అమలులో వేగం పెంచేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తాజాగా,సూర్యాపేట, సిరిసిల్ల, వనపర్తి జిల్లాలకు హౌసింగ్‌శాఖలోని సీనియర్ అధికారులను పీడీలుగా నియమించారు. ఈ నియామకాలు పథకం అమలులో జాప్యాన్నితగ్గించి, వేగాన్ని పెంచుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది. హౌసింగ్ శాఖలో సిబ్బందికొరత పథకం అమలులో ఒక ముఖ్యమైన అడ్డంకిగామారింది. ఈ సమస్యను అధిగమించడానికి, ప్రభుత్వం మండలానికి ఒక్కో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) చొప్పున పొరుగుసేవల పద్ధతిలో 712మందిని నియమించాలని భావించింది. వీరితో పాటు, డీఈఈలు (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు), వర్క్ ఇన్స్పెక్టర్ల నియామకాలను కూడా చేపట్టనున్నట్లు ప్రకటించింది. అయితే, ఇప్పటివరకు కేవలం 315మందిని మాత్రమే నియమించారు.

## కల్తీకల్లు బాధితులకు మెరుగైన వైద్యం

### మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్,జులై 9, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి కల్తీకల్లు ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతోంది. బాధితులలో నిన్న ఒకరు మృతి చెందగా గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు మరణించారు. ఈ ఘటనపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విచారం వ్యక్తం చేశారు. నిమ్స్ డాక్టర్లతో ఫోన్ లో మాట్లాడి బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.బాధితులందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. కాగా మంగళవారం కల్లు కాంపౌండ్ లో కల్లు తాగిన వారిలో 19 మంది అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే.

## విత్తనోత్పత్తితో నష్టపోయిన రైతులకు రూ.4 కోట్లు చెల్లింపు

### రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, జూలై 9, ప్రభాతవార్త:** తెలంగాణలో విత్తనోత్పత్తి చేసి నష్టపోయిన 671మంది రైతులకు నష్టపరిహారం కింద 4కోట్ల రూపాయలు ఇప్పించడం జరిగిందని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి తెలిపారు.బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్రంలో పర్యటించి రైతు సమస్యలను తెలుసుకున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని ములుగులో మొక్క జొన్న విత్తనోత్పత్తిలో జరిగిన మోసాలు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. మల్టీనేనల్ కంపె నీలు రైతులతో ఒప్పందం చేసుకొని విత్తనోత్పత్తి చేస్తున్నాయని తద్వారా పలువురు రైతులు నష్టపోయారన్నారు. దీంతో విత్తన కంపెనీల నుండి రైతులకు పరిహారం ఇప్పించామని చెప్పారు. ఇలా ఇప్పటి వరకు దేశంలో ఎక్కడా లేదని తామే మొదటి సారిగా నష్టపరిహారం ఇప్పించామని వెల్లడించారు. కాగా ఏడాదిన్నర కాలంలోనే ప్రభుత్వం రూ.లక్ష 4వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. రైతు కమిషన్ రైతులకు భరోసాగా పనిచేస్తోందని వివరించారు. తాము మళ్లీ ఆదర్శ రైతును ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. మోడీ సర్కార్ విత్తన చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు.

# తెర



# మళ్లీ చుక్కెదురు

పూజాహెగ్డేతో బ్యాడ్ టైమ్‌కు మళ్లీ చుక్కెదురైంది. బంతాడేసుకుంటోంది. మొన్నటి వరకు బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో సిల్వర్ స్క్రీన్ పై రచ్చ చేసిన బ్యూటీ... ఇప్పుడు కొత్తగా అవకాశాలు రావడం లేదు. రజనీకాంత్ కూలీలో స్పెషల్ సాంగ్ చేస్తున్న పూజా హెగ్డే, విజయ్ మూవీ ఖజన నాయగన్‌లోనూ, లారెన్స్ ఖకాంచన 4ఖలో పూజా హెగ్డే నటిస్తోంది. బాలీవుడ్‌లో మెరుపులు మెరిపిస్తున్నా... కోలీవుడ్‌లో మాత్రం ఆమె అవకాశాలను వేరొకరు చేజిక్కించుకుంటున్నారు. తెలుగులో పూజా హెగ్డే ఛాన్స్ లను శ్రీలీల కొట్టేస్తే... మరో చోట ప్రేమలు బ్యూటీ మమిత చేజిక్కించుకోవడం సెన్సేషన్‌గా మారింది. తాజాగా స్టార్ హీరో మూవీ నుంచి పూజాను తప్పించి మరో బ్యూటీని తీసుకోవడం వైరల్‌గా మారింది. కుబేర విడుదల తర్వాత హీరో ధనుష్ వరుస ప్రాజెక్టులను లైన్లో పెడుతున్నాడు. అక్టోబర్‌లో ఇడ్లీ కడై రిలీజ్‌కు సిద్ధం అవుతుండగా, మరో భారీ పీరియడ్ డ్రామాకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరన్న గుసగుసలు మొన్నటి వరకు ఫ్యాన్స్‌లో క్యూరియాసిటీని పెంచాయి. మొదట పూజా హెగ్డే పేరు బలంగా వినిపించి, అందరూ ఫైనల్ అనుకున్నారు. కానీ, ఇప్పుడు ఊహించని ట్విస్ట్‌తో మరో బ్యూటీ ఎంట్రీ ఇచ్చింది. ఆ ముద్దుగుమ్మనే మమితా బైజు. ఈ ప్రాజెక్ట్‌తో పాటు మరో నాలుగైదు సినిమాలతో బిజీగా మారింది బ్యూటీ.

ప్రేమలు సినిమాతో సౌత్ ఇండియాను అట్రాక్ట్ చేసిన మమితా, ఇప్పుడు ఈ భారీ అవకాశంతో మరో మెట్టు ఎక్కబోతోంది. ధనుష్‌తో జోడీ కడుతూ తన పాపులారిటీని మరింత పెంచుకోబోతోంది. ఈ వారంలో సినిమా పూజా కార్యక్రమంతో ఘనంగా షురూ కాబోతోంది. ఈ ఏడాది చివర్లో షూటింగ్ పూర్తి చేసి, 2026 ప్రారంభంలో రిలీజ్ చేయాలని మేకర్స్ భావిస్తున్నారట. ఈ చిత్రాన్నిరాయన్స్ డైరెక్టర్ విఘ్నేష్ రాజా తెరకెక్కిస్తున్నాడు. అభిమానులు మమితా ధనుష్ జోడీని తెరపై చూసేందుకు ఎగ్జైటెడ్‌గా ఉన్నారు. ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని అప్డేట్స్ కోసం అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మమితా ఈ సినిమాతో తన క్రేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్తుందని అంచనా. ఇక ధనుష్ నటన, విఘ్నేష్ రాజా విజన్‌తో రాబోతున్న ఈ పీరియడ్ డ్రామా ఎలా ఉంటుందనేది చూడాలి.



# కష్టపడితేనే విజయం

సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తుతున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఖఓ భామ అయ్యో రామఖ. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ బ్యానర్‌పై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 11న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ కానుంది. కాగా ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు రాకింగ్ స్టార్ మంచు మనోజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలో మంచు మనోజ్ బిగ్ టికెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ సుహాస్ ఎటువంటి నేపథ్యం లేకుండా హీరోగా ఎదిగాడు. నేపోకిడ్స్ అయినా సినిమా పరిశ్రమలో కష్టపడాల్సిందే. కష్టపడితేనే విజయం. నేను ఈ విషయాన్ని ఓ నెపోకిడ్‌గా చెబుతున్నా. యూట్యూబ్ నుంచి హీరోగా ఎదిగిన సుహాస్ జర్నీ ఎంతో ఇన్‌స్పిరేషన్. తమిళంలో విజయ్‌సేతుపతిలా తెలుగులో సుహాస్ కూడా అలాంటి స్టారే.. అన్ని తరహా సినిమాలను చేస్తాడు. ఇండస్ట్రీలో సక్సెస్ కావడం కష్టమే. కాని కష్టపడితే సక్సెస్ సాధిస్తాం. ఈ సినిమా విజయం సాధించి నిర్మాతలకు, దర్శకుడికి బ్రేక్ నివ్వాలి. మంచి టీమ్‌తో రూపొందిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ కావాలిఖ అన్నారు. హీరో సుహాస్ మాట్లాడుతూ ఈ సినిమా కోసం టీమ్ అంతా ఎంతో కష్టపడ్డారు. అందరూ ఈ సినిమా చూసిన తరువాత మాళవిక ప్రేమలో పడిపోతారు. అలీ, అనిత, పృథ్వీ లాంటి సీనియర్ ఆర్టిస్టులతో నటించడం ఎంతో హ్యాపీగా ఉంది. ప్రతి అబ్బాయి సక్సెస్‌ఫుల్ లైఫ్‌లో తల్లి, భార్యలు ఇద్దరూ ఎంతో కీలకంగా ఉంటారు. ఈ పాత్రలకు సంబంధించిన ఎమోషన్స్ ఈ చిత్రంలో అందరి హృదయాలను హత్తుకుంటాయి. అందరి సపోర్ట్‌తో మంచి సినిమాలు చేస్తున్నారు. త్వరలో నా కెరీర్‌కు సంబంధించిన మరిన్ని బిగ్‌న్యూస్ తెలియజేస్తాను అన్నారు. నిర్మాత హరీష్ నల్లా మాట్లాడుతూ స్నేహితుడు ప్రదీప్ సహకారంతో సుహాస్‌తో మా జర్నీ ప్రారంభమైంది. సుహాస్ కథ ఒకే చెప్పగానే సినిమా హిట్ అనుకున్నాను. మణికందన్ ఫోటోగ్రఫీ విజువల్స్ ఈ సినిమాలో ఎంతో రిచ్‌గా ఉంటాయి. బ్రహ్మ కడలి వేసిన సెట్స్ చూస్తుంటే నాకే ఆశ్చర్యమేసింది. ఇంత తక్కువ ఖర్చుతో ఇలాంటి సెట్స్ వేశాడా అనిపించింది. రథన్ సంగీతం ఈ సినిమాకు ఎంతో ప్లస్ అయ్యింది. ఈ సినిమాకు మాటీమ్ మల్టీటాస్కులు చేశారు. దర్శకుడు మంచి టీమ్‌ను సెట్ చేసుకున్నాడు. అందువల్లే ఈ రోజు మంచి అవుట్‌పుట్ వచ్చింది. రామ్‌కు దర్శకుడిగా మంచి భవిష్యత్ ఉంటుంది. సినిమా చూశాను. కొత్త దర్శకుడిలా కాకుండా ఎంతో అనుభవం ఉన్న దర్శకుడిలా చేశాడు. ఈ చిత్రంలో సుహాస్ పర్ఫార్మెన్స్ మరో రేంజ్‌లో ఉంటుంది అన్నారు. దర్శకుడు రామ్ గోధల మాట్లాడుతూ ఈ సినిమాలో గెస్ట్ రోల్ చేసిన హరీశ్ శంకర్, మారుతిల సహకారం మరువలేనిది. ఈ సినిమా లైఫ్ టైమ్ మెమెరీ. ఈ సినిమా చేయడానికి కారణం సుహాస్. ఆయన కోసం ఎన్నో కథలు రాస్తాను. ఎన్నో సినిమాలు తీయలని ఉంది అని చెప్పారు.

# హైదరాబాద్ కల్చర్‌ను చూపిస్తున్నాం



'రాజు గాని సవాల్ల్' టీజర్ రిలీజ్ అనంతరం మాట్లాడుతున్న మూవీ టీం

లెలిజాల రవీందర్, రితికా చక్రవర్తి హీరో హీరోయిన్‌లుగా నటిస్తున్న సినిమా 'రాజు గాని సవాల్ల్'. ఈ చిత్రాన్ని లెలిజాల కమల ప్రజాపతి సమర్పణలో, ఎల్ ఆర్ ప్రొడక్షన్ బ్యానర్‌పై లెలిజాల రవీందర్ నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా రక్షా బంధన్ పండుగ సందర్భంగా ఆగస్టు 8న శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. సినిమా టీజర్‌ను వర్సటైల్ యాక్టర్ జగపతి బాబు రిలీజ్ చేశారు. అనంతరం ఫిల్మ్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ప్రముఖ నిర్మాత దామోదర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇది నాకు ఫ్యామిలీ ఈవెంట్ లాంటిది. బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ సినిమాలను మన ప్రేక్షకులు అద్భుతంగా ఆదరిస్తారు. ఈ సినిమా కూడా అలాంటి మంచి సక్సెస్ అందుకోవాలని కోరుకుంటున్నా.. అని అన్నారు. అతిథిగా వచ్చిన నిర్మాత సాంబశివరావు మాట్లాడుతూ 'రాజు గాని సవాల్ల్ సినిమా ప్రేక్షకులకు సవాల్ విసరాలి అన్నారు. నటుడు రవీందర్ బొమ్మకంటి మాట్లాడుతూ ఈ చిత్రంలో నేను ఎదురుచూస్తున్న క్యారెక్టర్ దక్కింది. నెగిటివ్ షేడ్స్‌లో బాగా పర్ ఫార్మ్ చేస్తానని నమ్మకం ఉంది. నటి పద్మ మాట్లాడుతూ సినిమాలో నేను హీరోకు అక్క క్యారెక్టర్‌లో నటించాను. తెలంగాణ ఆడపడుచులు జరుపుకునే ఒక పండుగను పాట రూపంలో తెరకెక్కించారు. ప్రొడ్యూసర్ తరుణిక మాట్లాడుతూ 'రాజు గాని సవాల్ల్ సినిమా కోసం మూవీ టీమ్ చాలా కష్టపడ్డారు. ఈ సినిమా మాస్ ఎలిమెంట్స్ తో పాటు మనసుకు హత్తుకునే సెంటిమెంట్ తో ఉంటుంది. సినిమా సక్సెస్ పై నమ్మకం ఉంది. ఈ సినిమాను మీరంతా ఆదరించాలని కోరుకుంటున్నా. హీరోయిన్ రితికా చక్రవర్తి మాట్లాడుతూ సినిమా నేటివ్ ఎలిమెంట్స్‌తో పక్కా లోకల్‌గా ఉండి ఆకట్టుకుంటుంది.

హీరో లెలిజాల రవీందర్ మాట్లాడుతూ మా మూవీ హైదరాబాద్ కల్చర్‌ను చూపిస్తూ, తెలంగాణలో ఫ్యామిలీ బాండింగ్‌ను రిఫ్లెక్ట్ చేసేలా ఉంటుంది.

ఇక్కడ బ్రదర్ సిస్టర్ మధ్యలో బాండింగ్ ఎలా ఉంటుంది, అలాగే కుటుంబంలోని బంధాలు ఎలా ఉంటాయి, స్నేహితుల మధ్య ఉన్న రిలేషన్ ఎలా ఉంటుందని చూపించాం. హైదరాబాద్‌లో జరిగే కల్చరల్ ఈవెంట్స్‌లో ఎలాంటి ఇన్సిడెంట్స్ జరుగుతాయి అనేది

### హీరో రవీందర్

సహజంగా తెరకెక్కించేందుకు లోయర్ ట్యాంక్ బండ్ లోని కవాడిగూడలో రియల్ లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. తెలంగాణ సంస్కృతి నేపథ్యంగా సాగే క్లాసిక్ మూవీ ఇది. ఎంటర్ టైన్‌మెంట్ తో పాటు మంచి ఎమోషనల్ డ్రామా ఉంటుంది. రియల్ ఫీల్ కలిగేలా కొత్త వాళ్లతో పాటు పేరున్న మా మూవీకి ఆర్టిస్టులను తీసుకున్నాం. సినిమా ఇండస్ట్రీలో ఎంతో అనుభవం ఉన్న బాపిరాజు గారు మా సినిమాను చూసి రిలీజ్ చేసేందుకు ముందుకొచ్చినందుకు ఆయనకు రుణపడి ఉంటాం. మా మూవీ కంటెంట్ మీద పూర్తి నమ్మకం ఉంది. ఈ సినిమా విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాం అన్నారు. నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు మాట్లాడుతూ బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్‌తో తెలంగాణ నేపథ్యంతో వస్తున్న చిత్రమిది. ప్రొడక్షన్ డైరెక్షన్ చేస్తూ హీరోగా నటించడం మామూలు విషయం కాదు. ఈ చిత్రం కోసం లెలిజాల రవీందర్ గారు ఎంతో కష్టపడ్డారు. హీరోగా ఆయన పర్ ఫార్మెన్స్ మీ అందరినీ ఆకట్టుకుంటుంది. సినిమాను రాఖీ పండుగ సందర్భంగా ఆగస్టు 8న గ్రాండ్‌గా థియేటర్స్‌లోకి తీసుకొస్తున్నాం అని వివరించారు.



# ఒక్కటిగా 'బాహుబల్లి

ఒక్క తెలుగు సినిమా స్థాయినే కాకుండా మొత్తం భారతీయ సినిమా రూపు రేఖలనే మార్చేసిన సినిమా ఏదన్నా ఉంది అంటే అది పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన 'బాహుబలి' సినిమానే అని చెప్పాలి. దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి తెరకెక్కించిన ఈ ఎపిక్ చిత్రం ఒక గేమ్ ఛేంజర్ గా నిలిచింది. అయితే ఈ సినిమా రీరిలీజ్ కోసం ఎప్పుడు నుంచో అభిమానులు ఎదురు చూస్తుండగా ఆ మధ్య నిర్మాత శోభు యార్లగడ్డ బాహుబలి రీరిలీజ్ ఈ ఏడాది అక్టోబర్ లో ఉంటుంది అని కన్ఫర్మ్ చేశారు. ఇక రేపు జూలై 10తో బాహుబలి సినిమా వచ్చి పదేళ్లు పూర్తవుతుంది. దీనితో చిత్ర యూనిట్ ఇప్పుడే మంచి హింట్స్ రీరిలీజ్ పై ఇస్తున్నారు. రెగ్యులర్ సినిమా లెవల్లో బాహుబలి రెండు భాగాలను కలిపి ఓ సినిమాగా భారీ ప్రచారంతో రిలీజ్ చేయటానికి నిర్మాతలు రెడీ అవుతున్నారు. రెండు భాగాలతోనూ విశేషంగా అలరించిన బాహుబలి కథ, ఒకే చిత్రంగా ఎలా రక్తి కట్టిస్తుందో చూడాలి.

# బ్యాడాస్



టాలీవుడ్ స్టార్ బాయ్ సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా చేసిన అన్ని సినిమాల్లో బాగా గుర్తుండిపోయిన సినిమా పేరు డీజే టిల్లు. ఒక బాహుబలి, పుష్ప లాంటి ఐకానిక్ పాత్రల్లా టిల్లు గాడు కూడా ఒక బ్రాండ్‌ని సెట్ చేసుకున్నాడు. ఇప్పుడు వరకు మంచి కామికల్ యాంగిల్ ఇంకా రొమాంటిక్ పాత్రలు చేసిన యంగ్ హీరో ఇప్పుడు మాస్ అవతార్ లోకి మారాడు.

తన టిల్లు ప్రొడ్యూసర్స్‌తో కలిసి బ్యాడాస్ అనే సాలిడ్ ప్రాజెక్ట్‌ని ఇపుడు అనౌన్స్ చేశారు. తనపై ఒక మాస్ లుక్‌ని మేకర్స్ రివీల్ చేయగా ఈ పోస్టర్‌లో సిద్ధూ మంచి డైనమిక్‌గా కనిపిస్తున్నాడు. మీడియా ముందు స్టైలిష్‌గా సిగరెట్ కలుస్తూ తన మార్క్ యాటిట్యూడ్‌ని చూపిస్తున్నాడు. ఇక ఈ చిత్రానికి రవికాంత్ పేరెపు దర్శకత్వం వహిస్తుండగా ఈ సినిమాని వచ్చే ఏడాది మేకర్స్ రిలీజ్‌కి లాక్ చేసేసారు.

**త్రివిక్రమ్ అభిమానులు ఆవేదన**

మరోవైపు బ్యాడాస్ అనే టైటిల్ పైకి టఫ్ గై అనే అర్థాన్ని తెలియచేసినా... స్లాంగ్‌లో వచ్చే విపరీతార్థంపై కొందరు ఆక్షేపణ వ్యక్తం చేస్తున్నారు. ఇక దీని ట్యాగ్ లైన్ ఇఫ్ మిడిల్ ఫింగర్ వజ్ యె మ్యాన్ అట.. హీరో క్యారెక్టరైజేషన్‌ను ప్రతిఫలించేలా ఈ టైటిల్ పెట్టినట్టు మేకర్స్ చెబుతున్నారు. దీని అర్థం పైకి చెప్పుకోవడానికి ఎలా ఉన్నా... స్లాంగ్‌లో దీన్ని బూతు మాటగానే ఉపయోగిస్తారు.

# సంక్రాంతి కానుకగా తెలుగు జన నాయకుడు



దళపతి విజయ్ చివరి చిత్రం జన నాయగన్. వచ్చే యేడాది సంక్రాంతి కానుకగా ఇది విడుదల కాబోతోంది. పూజా హెగ్డే నాయికగా నటించిన ఈ సినిమాను హెచ్. వినోద్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని కె.వి.ఎన్. ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎన్. కె. లోహిత్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాను తెలుగులో జన నాయకుడు పేరుతో డబ్ చేస్తున్నామని ఆయన అన్నారు. బుధవారం తిరుమలలో స్వామి వారిని దర్శనం చేసుకున్న అనంతరం ఎన్. కె. లోహిత్ అక్కడ మీడియాలో మాట్లాడారు. విజయ్ తో తాను నిర్మిస్తున్న జన నాయగన్ ఘన విజయం సాధించాలని కోరుకున్నానని, అతి త్వరలోనే తెలుగులోనూ ఓ భారీ చిత్రాన్ని నిర్మించబోతున్నానని ఆయన అన్నారు. జన నాయగన్ సినిమా విషయానికి వస్తే... ఈ సినిమా సెట్స్ కు వెళ్ళడానికి ముందే విజయ్ సొంత రాజకీయ పార్టీని అనౌన్స్ చేశారు. అయితే ముందుగా కుదర్చుకున్న ఒప్పందం ప్రకారం ఆయన దీనిని చివరి చిత్రంగా చేయడానికి ముందుకొచ్చారు. ఇటీవల విజయ్ బర్త్ డే సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ రోర్ వీడియోకు మంచి స్పందన లభించింది. అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. జనవరి 9న ఈ సినిమా గ్రాండ్ గా తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది.



### ప్రతిష్టాత్మకంగా
# పారడైజ్

నేచురల్ స్టార్ నాని ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ది పారడైజ్. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో లిజు సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని భారీగా నిర్మిస్తున్నారు. దసరా బ్లాక్ బస్టర్ తర్వాత నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రం కోసం మరోసారి చేతులు కలిపారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఆర్‌ఎఫ్సీలో జరుగుతోంది. స్పెషల్‌గా వేసిన మ్యాసీవ్ సెట్‌లో ఫైట్ మాస్టర్ రియల్ సతీష్ సూపర్విజన్‌లో భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ హైఇన్‌టెన్సిటీ యాక్షన్ సీక్వెన్స్ కోసం రియల్ సతీష్ మాస్టర్‌తో పాటు ఫారిన్ స్టంట్ మాస్టర్స్ కూడా వర్క్ చేస్తున్నారు. ఈ యాక్షన్ సీక్వెన్స్ సినిమాలో హైలెట్‌గా ఉండనుంది. ది పారడైజ్ గ్లోబల్ లెవెల్‌కు వెళ్లబోతోంది. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ 8 భాషలలో విడుదల కానుంది. టైటిల్ పోస్టర్, గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు పెరిగాయి. ముఖ్యంగా గ్లింప్స్‌లో ఉన్న పవర్‌ఫుల్ డైలాగ్, విజువల్స్, రాక్‌స్టార్ అనిరుధ్ రవిచంద్రన్ బ్యాగ్రౌండ్ స్కోర్, నాని స్ట్రాంగ్ ఎంట్రీ... ఇవన్నీ సినిమా పై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి.

# న్యూ టాలెంట్‌కు ఊతం



షార్ట్ ఫిలింస్ స్థాయి నుంచి హీరోగా తనకొక స్థాయి సంపాదించుకునే వరకు ఎదిగారు కిరణ్ అబ్బవరం. ఈ క్రమంలో ఫిలింమేకింగ్‌లో ఆయన ఎన్నో ఇబ్బందులు, కష్టాలు చూశారు. ఎవరి సపోర్ట్ లేకుండా గుర్తింపు తెచ్చుకున్నారు. స్ట్రాంగ్ కంటెంట్, ఇన్నోవేటివ్ మేకింగ్‌తో మూవీస్ చేస్తున్నారు. ఒక్క ఛాన్స్ కష్టాలు తెలిసిన హీరో కాబట్టే తనలా ఏ బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలో పేరు తెచ్చుకోవాలని ఆశపడే ఔత్సాహిక నటీనటుల, సాంకేతిక నిపుణులకు అండగా నిలుస్తానని దిల్ రూబా సినిమా ఈవెంట్స్ లో చెప్పారు కిరణ్ అబ్బవరం. చెప్పినట్లే తన మాట మీద నిలబడుతూ కొత్త వాళ్లతో తన సొంత బ్యానర్ పై మూవీ ప్రొడ్యూస్ చేస్తున్నారాయన. తన గత సినిమాల్లో కెమెరా అసిస్టెంట్‌గా పనిచేసిన సాయి తేజ్ ను హీరోగా పరిచయం చేస్తూ సినిమా నిర్మిస్తున్నారు కిరణ్ అబ్బవరం. తన మూవీస్ కు ఆన్‌లైన్ ఎడిటింగ్ చేసిన టెక్నీషియన్ మునికి దర్శకుడిగా అవకాశం కల్పిస్తున్నారు. నిజ జీవిత ఘటనల స్ఫూర్తితో ఎమోషనల్ డ్రామాగా మంచి కథా కథనాలతో ఈ సినిమా తెరకెక్కనుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే ఈ సినిమా ఫస్ట్ లుక్, టైటిల్ అనౌన్స్ చేయనున్నారు. ఈ ఏడాది చివరలో షూటింగ్ ప్రారంభించనున్నారు. తను నడిచొచ్చిన దారిని మర్చిపోని కిరణ్ అబ్బవరం కెరీర్ ప్రారంభంలో తనతో పనిచేసిన ఎంతోమంది టెక్నీషియన్స్ నే తమ కొత్త మూవీస్ కు కొనసాగిస్తున్నారు.




# ఆగస్ట్7న కూలీ

ప్రస్తుతం సౌత్‌లో గట్టి హైప్ ని సెట్ చేసుకొని అదరగొట్టేందుకు వస్తున్న భారీ సినిమా ఏదన్నా ఉంది అంటే అది కూలీ అని చెప్పవచ్చు. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా కింగ్ నాగార్జున, అమీర్ ఖాన్ అలాగే ఉపేంద్ర లాంటి స్టార్స్ కలయికలో టాలెంటెడ్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ సాలిడ్ వర్క్ కోసం తమిళ్ తో పాటుగా తెలుగు ఆడియెన్స్ కూడా చాలా ఎగ్జైటెడ్ గా ఎదురు చూస్తున్నారు. ఇక తెలుగు వెర్షన్‌కి సంబంధించే లేటెస్ట్ న్యూస్ అయితే తెలుస్తుంది. దీనితో ఈ ఆగస్ట్7న తెలుగులో మేకర్స్ గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌కి సెట్ చేసినట్టుగా తెలుస్తోంది.

# నన్ను విలన్‌లా చూశారు

2002లో చిన్న పాత్రతో సినీ కెరీర్ మొదలుపెట్టిన అడివి శేష్.. ఇప్పుడు హీరోగా పాన్ ఇండియా సినిమా చేసే స్థాయికి ఎదిగారు. అమెరికాలో సినిమా కోర్సులో చేరినప్పటికీ, ఒక సంఘటనతో చదువును మధ్యలోనే ఆపేసినట్లుగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. తండ్రికి హీరో అవ్వాలనే కోరిక ఉన్నప్పటికీ, కొన్ని కారణాల వల్ల అది నెరవేరలేదని శేష్ తెలిపారు. పవన్ కళ్యాణ్ హీరోగా చేసిన ఖపంజాఖ సినిమాలో విలన్‌గా నటించిన తర్వాత, అన్నీ నెగెటివ్ రోల్స్‌లో అవకాశాలు వచ్చాయన్నారు. 2002లో సొంతం సినిమా చిన్న పాత్రలో నటించిన టాలెంటెడ్ యాక్టర్ అడివి శేష్.. ఇప్పుడు హీరోగా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఈ స్థాయికి రావడానికి శేష్ చాలా కష్టపడ్డారు. కెరీర్ ప్రారంభంలో పవన్ కళ్యాణ్, ప్రభాస్, రవితేజ సినిమాల్లో విలన్ క్యారెక్టర్స్ పోషించారు. ఖక్షణంఖ చిత్రం అతని కెరీర్ ను మలుపు తిప్పింది. అక్కడి నుంచి మళ్ళీ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన పరిస్థితి రాలేదు. ప్రస్తుతం ఖడెకాయిట్ఖ, ఖగూఢచారి 2ఖ వంటి పాన్ ఇండియా చిత్రాల్లో నటిస్తున్న శేష్.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. అడివి శేష్ సినిమాల్లోకి రావాలనే ఇంట్రెస్ట్‌తో అమెరికాలో శాన్ ఫ్రాన్సిస్కో స్టేట్ యూనివర్సిటీలో బ్యాచిలర్స్ ఇన్ సినిమా కోర్స్ లో జాయిన్ అయినట్లుగా చెప్పారు. కానీ ఒక లేడీ కారణంగా థర్డ్ ఇయర్ లో డ్రాప్ అవుట్ అయ్యానని తెలిపారు. ఖఖథర్డ్ ఇయర్ ఫైనల్ ఎగ్జామ్స్ కోసం చదువుతున్నప్పుడు, లైబ్రరీలో ఓ లేడీ హెల్ప్ చేస్తున్నారు. ఏం చేస్తుంటారని ఆమెను క్యాజువల్ గా అడిగితే.. ఫిలింలో పీహెచ్డీ చేశానని చెప్పింది. డిగ్రీలతో సినీ ఇండస్ట్రీలో జాబ్స్ దొరకవని, తీస్తే సినిమా తీయాలి లేకపోతే లేదు అని చెప్పింది. సో సినిమా తీయడమే బెటర్ కదా అనుకొని చదువు ఆపేసి బయటకు వచ్చేసా. ఒక్క ఏడాది ఆగితే కోర్స్ కంప్లీట్ అయ్యేది కదా అని ఇప్పుడు రిగ్రెట్ అవుతున్నా. అర్జెంట్ గా హీరో అయిపోదామనే తాపత్రయంలో, తెలియని తనంలో అలా వచ్చేశాఖఖ అని శేష్ చెప్పారు.



# కూలీల నుండి వ్యాపారులుగా..



పద్మజ ఆదాయం నెలకు రూ.40 వేలు. ప్రభావతి రూ.30వేలకు పైనే సంపాదిస్తారు. వీళ్ల మాదిరిగానే ఆ చుట్టుపక్కల గ్రామాల్లో వందల మంది మహిళల ఆదాయం ఇప్పుడు రూ.20-40 వేల మధ్య ఉంటోంది. అలాగని వాళ్లేమీ ఉద్యోగాలు చేయలేదు. పని చేస్తున్నది వ్యవసాయ రంగంలో ఈ మార్పు ఎలా సాధ్యమైందంటే... వ్యవసాయ కూలీల్లో ఎక్కువ మంది మహిళలే వారి ఆదాయాలు మాత్రం దేశంలో అరకొరగా ఉంటాయి. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లా కర్మడ్ పరిధిలోని మహిళలూ మినహాయింపు కాదు. కానీ ఇప్పుడు వాళ్లు రోజుకు రూ.700 నుంచి రూ.1500 వరకూ సంపాదిస్తు న్నారు. సావిత్రీబాయి పూలే పౌండేషన్, నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్)ల చొరవతో వీరి జీవితాల్లో విప్లవాత్మక మార్పు వచ్చింది. ఈ రెండు సంస్థలూ కలిసి 2020లో రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎపిఒ) ఏర్పాటు దిశగా అడుగులు వేశాయి. దీనికోసం 'వి ఫర్ విమెన్ ఎంపవర్‌మెంట్ సంస్థను ఏర్పాటు చేశాయి. ఈ సంస్థ డైరెక్టర్ల బోర్డులోని ఏ మహిళల సంస్థ పరిధిలో మూడు వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. శంభాజీనగర్‌కు 30 కి.మీ. దూరంలో ఉండే కర్మద్ పరిసర గ్రామాలకు చెందిన 3,500 మందికి పైగా మహిళలకు ఇక్కడ ఉపాధి లభిస్తోంది ఉల్లి, వెల్లులి, అల్లం, టొమాటో, మొక్కజొన్నల్ని ఇక్కడ ప్రాసెస్ చేస్తారు హోటళ్లు, ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలకు ఉత్పత్తులను అందిస్తున్నారు. రుణాలు అందించడంతో పాటు యూనిట్ల అవకాశాలను ఏర్పాటు చేయడం, సాంకేతికత, మార్కెట్ చూపుతోంది నాబార్డ్, మొక్కజొన్నను ప్రాసెస్ చేస్తే ఆరు రకాల ఉత్పత్తులు వస్తాయి పౌల్ట్రీ ఆహారం, నూనె, పిండి.. లాంటి ఉప ఉత్పత్తుల్ని వేర్వేను కంపెనీలకు అమ్ముతారు.

**రూ. 74 కోట్ల టర్నోవర్...**

మహారాష్ట్రలో ఉల్లి, టొమాటో రైతులు ఎక్కువ. ఒకప్పుడు గిట్టుబాటు ధర లభించక వీళ్లంతా ఇబ్బంది పడేవారుప. ఈళ్ల నుంచి పంటలను కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేయించడానికి 'వి ఫర్ విమెన్' ప్రాధాన్యత ఇస్తోంది. ఈ సంస్థ 2024-2025లో రూ. 74 కోట్ల టర్నోవర్ సాధించింది. వీరికి మొక్క జొన్న ఉల్లిపాయల ప్రాసెసింగ్ నుంచే అధిక ఆదాయం వస్తోంది. రోజుకు సగటున 3 టన్నుల మొక్కజొన్నను ప్రాసెస్ చేస్తారు. ఈ పరిశ్రమలో పనిచేసే పద్మజ మేదపాఠక్ మాట్లాడుతూ. గతంలో వ్యవసాయ కూలీగా వెళ్లినప్పుడు రోజుకు రూ.300 వచ్చేవి. కాన్నీ ఇప్పుడు రోజుకు రూ.1000- 1500 దాకా వస్తున్నాయి. దీంతో జీవితం మారి పోయింది' అని చెబుతారు. సంపాదన పెరిగాక మహిళలు కుటుంబం అప్పులు తీర్చేయడమే కాదు, పొదుపు. దిశగానూ అడుగులు వేస్తున్నారు.

# గురువులకు అభివందనాలు



మన సనాతన ధర్మంలో గురువుకు చాలా పెద్దపీట వేశారు మన పెద్దలు. 'తల్లి, తండ్రి,' 'గురువు, దైవం' అంటే తల్లి, తండ్రి తర్వాత గురువుకు ప్రాధాన్యతనిస్తున్నాం. గురువే జగత్ మూలం. అందుకే ఆలయం లేని గ్రామం గురువులేని జ్ఞాన సముపార్జన నిష్ప్రయోజనమని గురువు పాత్రను గొప్పగా నిర్వహిం చాయి పురాణాలు. ప్రతి మనిషిలోను జ్ఞానం ఉంటుంది, సత్ప్రవర్తన ఉంటుంది, మంచి ఉంటుంది. వాటిని బయటకు తీసి జ్ఞానాన్ని బోధించి ఋజువర్తన నేర్పించి మంచి మార్గంలో నడిపించే దైవమే గురువు. తల్లిదండ్రులు జన్మనిస్తే గురువు జీవితాన్ని ఇస్తారు. ప్రాచీన కాలం నుంచి గురువును దైవంగా భావించే సంస్కృతి మనది. సంప్రదాయాలు, కాలం మారుతున్న నేటి తరుణంలో గాడి తప్పుతున్న సమాజాన్ని సన్మార్గంలో పెట్టడంలో గురువులు పాత్ర ఎంతో కీలకమైంది. 'గురువు' అంటే జ్ఞానాన్ని బోధించేవాడని అర్థం. గురువులో 'గు' శబ్దం అంధకారానికి చిహ్నం. 'రు' అంటే అంధకారాన్ని తొలగించే కాంతి అని అర్థం. అజ్ఞానమనే చీకటిని పారద్రోలి స్వయం ప్రకాశమగు పరబ్రహ్మను తెలియజేసే శక్తి గురువు. వ్యక్తులు, సమాజం దారి తప్పినప్పుడు దానిని సన్మార్గంలో పెట్టే అంకుశం ఆచార్యుడు. అందుకే "ఆచార్యదేవోభవ" అంటూ గురువుని దైవంతో సమానంగా పూజిస్తుంది మన భారతీయ సంస్కృతి. తల్లిదండ్రులు జన్మని ఇస్తారు, సహోదరులు ప్రేమను పంచుతారు, స్నేహితులు ఆప్యాయతను అందిస్తారు, పరిచయం ఉన్న ప్రతి ఒక్కరితో ఇలా ఏదో ఒక అనుబంధాన్ని కలిగి ఉంటాం. వారందరితో అనుబంధం మనం జీవించి ఉన్నంతవరకే ఉంటుంది. కానీ గురువు సకల జ్ఞానాన్ని మనకు అందిస్తారు. గురువుతో ఉన్న సంబంధం అద్భుతమైనది, ఆధ్యాత్మిక మైనది, వెలకట్టలేనిది. అందుకే మనకి మార్గదర్శకంగా నిలిచిన వారిని గురు స్థానంలో ఉంచుదాం. ఈ గురు పూర్ణిమ ఇప్పుడు వచ్చినటువంటిది కాదు. ద్వాపరం చివరలో వ్యాసుల వారి జయంతిని గురుపూర్ణిమగా చెప్పుకొంటాం. ప్రధానంగా గురుపూర్ణిమని వ్యాసుల వారి జయంతి అని చెప్పుకోవడానికి కారణమేమిటంటే ఆ కాలం నుండి మన భారతదేశంలో ఉన్నటువంటి భారతీయ తత్వంలో అప్పుడు ఉన్నటు వంటి హైందవ సంప్రదాయమే ఉంది కనుక అక్కడ ఈ సంప్ర దాయం కొనసాగాలంటే గురుతత్వం ఉండాలి. ఇది ఏ గురుతత్వం వల్ల వచ్చింది అంటే ఆయన విభజించినటువంటి వేదాల వల్ల, ఆయన రచించినటువంటి పురాణాల వల్ల, ఉప పురాణాల వల్లభారతం వల్ల, మన సంస్కృతి మిగిలింది. ఆయన గురుతుల్యంగా ఉన్నారు కాబట్టి ఆ గురుతుల్యమైనటువంటి వారి యొక్క జన్మదినం ఆషాడ పౌర్ణమి కనుక ఆ రోజు నుండి గురుపూర్ణిమి ఆషాడ పౌర్ణమిగా గురుపౌర్ణమిగా జరుపుకుంటున్నాము. 2025వ సంవత్సరం గురు పౌర్ణమి ఆషాడమాసం శుక్లపక్షం జూలై 10న గురువారం రోజున వచ్చింది. ఈ గురు పౌర్ణమి రోజు ప్రతి ఒక్కరూ తమ గురువుల్ని భక్తిశ్రద్ధలతో గౌరవించి పూజిస్తారు. ఎవరైతే విద్యను అందిస్తారో లేదా ఎవరైతే గురు స్థానంలో ఉంటారో వాళ్ళని పూజించడం కావచ్చు, వాళ్ళని గౌరవించడం కావచ్చు ఇదొక సంప్రదాయకంగా మన పూర్వీకుల నుంచి వచ్చినటువంటిదిగా భావించి ఈరోజు మన గురువుల్ని సత్కరించి గౌరవించుకుంటాం. ఇలా సమస్త గురువుల్ని ఈ రోజున ఆరాధిస్తే మంచి శుభాలు కలుగుతాయని భక్తుల, శిష్యుల నమ్మకం."గురువే సర్వలోకానాం" అంటే లోకాన్నంతటిని శాసించేవాడు, లోకాన్నంతటినీ సన్మార్గంలో పెట్టేవాడు గురువే. కనక ఆ గురువును ఆరాధిస్తే మనకి సద్బుద్ధి కలిగి మంచి శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఇలా గురువుల పరంపర కొనసాగుతుండగా ఈ కలియుగంలో ఇప్పుడు గురువులు జ్ఞానాన్ని అందిస్తున్నారు కావున గురువుల్ని ఆశ్రయిస్తే






శుభాలు కలుగుతాయి. భక్తులు శ్రద్ధా భక్తులతో గురువును ఆశ్రయిస్తే తప్పకుండా గురువు యొక్క అనుగ్రహం కలిగి అనేక శుభాలు కలుగుతాయి. ప్రపంచంలో ఉన్న మానవులకు రెండు రకాల కోరికలు ఉంటాయి. అవి 'భౌతికం, ఆధ్యాత్మిక'. ఎక్కువ మంది భౌతికమైన కోరికల్ని కోరుతారు. మంచి విద్య, మంచి ఉద్యోగం, మంచి జీవితం లాంటివి. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు మంచి సంస్కారాన్ని ఇస్తే విద్య నేర్పే గురువులు ఆ సంస్కారానికి మెరుగులు పెట్టి మన భవిష్యత్తుకి పునాదులు వేస్తారు. ప్రపంచంలో ఏ గొప్ప స్థాయిలో ఉన్న వ్యక్తి అయినా వారికి బలమైన పునాదులు వేసింది వారి గురువులే. వారు చేసేదల్లా ఆ పునాదులపై కష్టపడి శ్రమించి ఆ పునాదులపై అంతస్తులు వేసుకుంటూ ముందుకు సాగడమే. లౌకికమైన విద్య ఉదర పోషణకు, ఆధ్యాత్మిక విద్య మరు జన్మ లేకుండా చేసేందుకు ఉపయోగపడుతుంది. "విద్యా దధాతి వినయం/ వినయా ధ్యాతి మాత్రతం/ పాత్రత్వ ధన మాప్నోతి/ ధనాతే ధర్మంతతా సుఖం/" .అంటే విద్య వినయాన్ని ఇస్తుంది. వినయం యోగ్యతను ప్రసాదిస్తుంది. యోగ్యతతో ధనప్రాప్తి కలుగుతుంది. ధనంతో ధర్మం, ధర్మంతో సుఖం కలుగుతాయి. దాంతో ఈ జగత్ సుభిక్షంగా ఉంటుంది. అందుకే తరాలు మారినా, యుగాలు మారినా గురు స్థానం ఎప్పుడూ గురు స్థానమే. ఆది గురువు వ్యాసుడు, దత్తాత్రేయ. సద్గురువు షిరిడి సాయి, రఘువేంద్ర మొదలు మనకు పాఠం చెప్పిన ప్రతి ఒక్క గురువు అందరూ పూజ్యనీయులే. గురువులందరికి శతకోటి వందనాలు, జేజేలు.

**- పింగళి భాగ్యలక్ష్మి**

# కొత్త అందాలతో మ్యాటీలు

**ఫ్యాషన్ ఫ్యాషన్**







కాలేజీకీ స్టైలిష్‌గా, ఆఫీసుకి సింపుల్‌గా, హుందాగా వెళ్లే అమ్మాయిలు.. ట్రెడిషనల్ లుక్‌ని ఏం ఇష్టపడతారు? అంటూ పెదవి విరిచే రోజులు కావివి. పెళ్లి, పండుగ.. ఇలా శుభ సందర్భం ఏదైనా పట్టు చీరలు కట్టేస్తున్నారు. అలనాటి నగల డిజైన్లను ఎంచుకొని ధరించడంలోనూ ముందుంటున్నారు. అలా వీరి మనసు ఇప్పుడు మ్యాటీలపైకి మళ్లింది. చెవులకు చెంపసరాలు ఉన్నా సరే! ముఖానికి మ్యాటీలు తెచ్చే మెరుపు అంతా ఇంతా కాదు. అందుకే ఒకప్పుడు పెళ్లీడుకొచ్చిన అమ్మాయిలకు చేయించాల్సిన నగల్లో ఇవి ముందుండేవి. అయితే, కాలచక్రంలో కొన్నేళ్లపాటు కనుమరుగై మళ్లీ ఇప్పుడు కొత్త అందాలను అద్దుకుని వచ్చేశాయి. అయితే సాదాసీదాగా కాకుండా పసిడి చెక్కుళ్లు, ముత్యాలు, పచ్చలు, టెంపుల్ డిజైన్లతో అదరగొట్టేస్తున్నాయి. మరి ఆ డిజైన్లను మీరూ ఒకసారి చూస్తారా?



























# డెలివరీ తర్వాతే ఎందుకు ?



జుట్టు రాలడం. ఎక్కువమంది అమ్మాయిల్లో తరచుగా కనిపించే సమస్య అయితే, ప్రసవం తర్వాత కాస్త ఎక్కువగా కనిపిస్తుంది. అలా ఊడిపోవడాన్ని పూర్తిగా ఆపలేకపోవచ్చు కానీ, కొన్ని చిట్కాలు పాటించడం వల్ల తీవ్రతను కొంతవరకు తగ్గించండి. ప్రసవనంతరం హార్మోన్ల అసమతుల్యత, మానసిక ఒత్తిడి కారణంగా మహిళల్లో ఎక్కువగా జుట్టు రాలిపోతుంది. మొదట్లో ఈ సమస్య ఎక్కువగా కనిపించినా, మెల్లగా తగ్గుతుంది. దీని కోసం ప్రొటీన్, ఐరన్, జింక్, ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. వీటితోపాటూ జీవనశైలిలోనూ కొన్ని మార్పులు చేసుకోవాలని బిగుతుగా ఉంటే పోనీటెయిల్ వేసుకోకుండా జుట్టును వదులుగా వదిలేయాలి. తలస్నానం చేసినప్పుడు కురులను గాలికి అదనిచ్చి, పెద్దపళ్లు ఉన్న దువ్వెనతో చిక్కు తీసుకోవాలి, ముఖ్యంగా విటమిన్ డి3, బి12 లోపం, థైరాయిడ్ వంటి సమస్యలను చెక్ చేసుకుంటే మేలు గర్భధారణ సమయంలో థైరాయిడ్ కొందరిలో వచ్చినా జుట్టు ఎక్కువగా రాలుతుంది. దీనితోపాటు ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగ, మెడిటేషన్, బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు వంటివి.

# పెనం మీదే పూరీలు

పూరీలు గోధుమపిండితో చేస్తాం. నూనెలో వేయిస్తాం. కానీ బియ్యప్పిండితో.. పైగా నూనెలో దేవకుండానే పూరీలు తయారైతే ఎలా ఉంటుంది? ఇది అతిశయం కాదు, నిజంగానే చేయొచ్చు. రుచీ, ఆరోగ్యం కూడా. అందుకోసం.. బియ్యప్పిండి 2 కప్పులు, బంగాళదుంప ఒకటి, కొత్తిమీర తరుగు చారెడు, మెంతి ఆకుల పొడి, చిల్లీ ఫ్లేక్స్ చెంచా చొప్పున, ఉప్పు రుచికి తగినంత, నూనె నాలుగు చెంచాలు తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. బంగాళదుంపను ఉడికించి, పొట్టు తీయాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో కప్పున్నర నీళ్లు పోసి సన్న సెగ మీద మరిగించాలి. అందులో చల్లీ ఫ్లేక్స్ ఉప్పు, మెంతి ఆకుల పొడి, బియ్యప్పిండి వేసి కలియబెట్టాలి. అన్నీ కలిశాక అర నిమిషం మూత పెట్టేసి ఉంచి, తర్వాత దించేయాలి. అందులో బంగాళదుంపను తురిమి మొత్తం కలిసిపోయేలా బాగా కలపాలి. మెత్తటి పిండి తయారయ్యాక..



పూరీలు చేసి ఎనం మీద చెంచాతో కొద్దిగా నూనె రాస్తూ కాల్చుకోవాలి. నూనెలో వేసిన పూరీలకు మల్లేనే పొంగుతాయివి.రంగూ రుచీ కూడా వారెవా అనిపిస్తుంది. నచ్చితే మీరూ చేసి చూడండి.

# బాడీలోషన్ రాస్తున్నారా?



ఎప్పటికప్పుడు మారే వాతావరణం చర్మంపైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది. తద్వారా చర్మం పొడిబారి నిర్జీవంగా మారుతుంది. అయితే చర్మంలో తేమని నిలిపి ఉంచడానికి ఏదో ఒక క్రీమ్/బాడీ లోషన్ రాసుకుంటే సరిపోతుందనుకుంటారు చాలా మంది. కానీ వీటిలో కూడా చర్మతత్వానికి నప్పే లోషన్లను ఎంచుకోవడం ముఖ్యమంటున్నారు నిపుణులు. అప్పుడే ఫలితం ఉంటుందంటున్నారు.

**కాస్త తడిగా ఉన్నప్పుడే..** ముఖానికి చర్మానికి క్రీమ్‌లు, లోషన్లు.. మొదలైనవి రాసుకునే ముందు చర్మాన్ని శుభ్రం చేసుకోవడం తప్పనిసరి. అలాగే చర్మం కాస్త తడిగా ఉన్నప్పుడే వాటిని రాసుకోవాలి. అప్పుడే అది చర్మ గ్రంథుల్లోకి చేరే అవకాశం ఉంటంది. తద్వారా చర్మం తేమను కోల్పోకుండా జాగ్రత్తపడచ్చు. స్నానం చేసిన వెంటనే.. క్రీమ్ లేదా బాడీ లోషన్స్ ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా.. స్నానం చేసిన వెంటనే రాసుకోవాలి. ఎందుకంటే ఆ సమయంలో చర్మ కణాలు తెరుచుకొని ఉంటాయి. కాబట్టి ఆ సమయంలో క్రీమ్ లేదా లోషన్స్ రాసుకుంటే అది చర్మ గ్రంథుల్లోకి చేరి సులభంగా ఇంకుతుంది. అలాగే స్విమ్మింగ్ పూల్ ఈత కొట్టిన తర్వాత కూడా తప్పకుండా క్రీమ్ లేదా బాడీ లోషన్ రాసుకోవాలి. లేదంటే నీటిలో ఉండే క్లోరిన్ వల్ల చర్మం మరింత పొడిగా మారే ప్రమాదం ఉంటుంది.

**చర్మం ఉష్ణోగ్రతను బట్టి..** అలాగే చర్మం కాస్త ఉన్నప్పుడే క్రీమ్ లేదా లోషన్స్ రాసు కుంటే అవి చర్మంలోకి సులభంగా ఇంకుతాయంటున్నారు నిపుణులు. అందుకే క్రీమ్ లేదా లోషన్ రాసుకునే ముందు చర్మం చల్లగా అనిపిస్తే.. గోరువెచ్చని నీళ్లలో ముంచిన టవల్‌తో తుడుచుకొని ఆపై లోషన్‌ను చర్మానికి అప్లై చేసుకోవాలంటు న్నారు.

**ఎన్నో ప్రయోజనాలు..**

1 పొడిబారి నిర్జీవంగా మారిపోయిన చర్మానికి క్రీమ్ లేదా లోషన్ రాసుకోవడం వల్ల అది తేమను సంత రించుకుంటుంది.

2. బాడీ లోషన్ చర్మంపై ఉన్న మచ్చల్ని క్రమంగా తగ్గించ డానికీ ఉపయోగపడుతుంది. అలాగే బాడీ లోషన్ వెదజల్లే పరిమళాలు మానసిక ప్రశాంతతనూ అందిస్తాయి. గరుకుగా ఉండే చర్మ ఏ భాగాలపై తరచుగా క్రీమ్ లేదా లోషన్స్ అప్లై చేయడం వల్ల కొన్నాళ్లకు అవి మృదువుగా మారతాయి.

# వ్యథ: బాధలు చెప్పకుంటే తీరవు



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**ప్రశ్న:** బాధలు చెప్పుకుంటే తీరవు నా భర్త నాకు, నా పిల్లలకు నరకం చూపిస్తున్నారు. ఆయన వ్యసనాలు మాకు శాపంగా పరిణమిస్తోంది. ఏరి కోరి ఎంచుకున్న భర్తతో వేగలేకపోతున్నాను. బిడ్డల కోసం ఆత్మహత్య చేసుకోలేక పోతున్నాను. నా చదువు, జ్ఞానం తెలివితేటలు బూడిదలో పోసిన పన్నీరులా అయ్యాయి. క్షణం, క్షణం ఒక యుగంలా బ్రతుకు సాగిస్తున్నాను. ఆఫీసులో సక్రమంగా పనిచేయలేక పోతున్నాను. ఎంటెక్ చదివి మల్టీనేషనల్ కంపెనీలో మంచి ఉద్యోగం చేస్తున్నాను. పదేళ్ళ క్రితం పలు మ్యారేజిబ్యూరోల ద్వారా అన్వేషించి మంచి ఉద్యోగం చేస్తున్న వ్యక్తిని ఎంచుకుని పెళ్లి చేసుకున్నాను. ఆయన కూడ ఎంటెక్ చదివి ఒక మల్టీనేషనల్ కంపెనీలో మేనేజరుగా పని చేస్తున్నారు. నెలకు రెండు లక్షల జీతం సంపాదిస్తున్నారు. నాకు ఒకటిన్నర లక్షరూపాయలు జీతం వస్తోంది. ఆయన హోదా, జీతానికి ఆకర్షితురాలిని అయ్యాను. ఇద్దరి జీతంతో విశాలమైన ఇల్లు, మంచి కారు సంపాదించుకుని దర్జాగా బ్రతకవచ్చని భావించాను. అయితే పెళ్ళయిన రెండు రోజులకే ఆయనకు తాగుడు అలవాటు ఉన్నట్టు తెలుసుకున్నాను. వారం తరువాత ఆయన తాగుడు అలవాటు గూర్చి చర్చించాను. అది ఆరోగ్యానికి, అన్యోన్యతకు మంచిదికాదని సున్నితంగా చెప్పాను. తన ఉద్యోగ బాధ్యతల్లో అప్పుడప్పుడు పార్టీలు ఇవ్వడం, పార్టీలో పాల్గొనడం తప్పదని చెప్పుకొచ్చారు. నలుగురితో కలసినపుడు కంపెనీకోసం కొద్దిగా అయినా తాగక తప్పడం లేదని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయితే క్రమంగా మానేస్తానని హామీ ఇచ్చారు. అయితే ఆ వ్యవసనం క్రమంగా ఆయనను లొంగ దీసుకున్నది.



ఇప్పుడు ఒళ్ళు తెలియకుండా తాగుతున్నారు. ఇంటికి వచ్చి నానా అల్లరిచేస్తున్నారు నా మీద, పిల్లల మీద చేయి చేసుకుంటున్నారు. బూతులు తిట్టి నానా భీవత్సం చేస్తున్నారు. ఈ స్థితిలో నాకు సరైన పరిష్కార మార్గం చెప్పండి.

**- ఒక సోదరి, నెల్లూరు**

**జవాబు:** అమ్మా, మీ సమస్య అర్థం అయ్యింది. సుఖమయ దాంపత్య జీవితానికి డబ్బు, హోదాకంటే సఖ్యత, సాన్నిహిత్యం ముఖ్యం. మన సమాజంలో పెళ్లిళ్ల పట్ల దృక్పధం మారి పోతోంది. జీతాన్ని బట్టి అబ్బాయి, ఉద్యోగాన్ని బట్టి అమ్మాయిని ఎంచుకుంటున్నారు. డబ్బు, హోదానే సర్వస్వం అనుకుంటున్నారు. ఏమి చేసినా, ఎలా సంపాధించినా డబ్బు ఉంటే చాలనుకుంటున్నారు. వ్యక్తిత్వం ప్రవర్తన సంస్కారం, కుటుంబ నేపథ్యం గూర్చి ఎవరూ పట్టించు కోవడం లేదు. వ్యసనాలను నాగరిక లక్షణంగా భావించే స్థితికి చేరుకుంటున్నాము. పెళ్ళయిన తరువాత ప్రేమ, అన్యోన్యత, అనురాగం కోరుకుంటు న్నారు. దీనితో దంపతుల మధ్య సంఘర్షణలు తలెత్తుతు న్నాయి. కేసులు, విడాకులు, ఆత్మ హత్యలు శరణ్యంగా భావిస్తున్నారు. ఇలాంటి వారి కోసం మన పెద్దలు ఒక సామెత చెప్పారు. ముళ్ల కంపమీద ఆరబెట్టిన బట్టను నెమ్మదిగా తీసు కోవాలి. అంటారు. పెళ్లికి ముందే జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం. పెళ్లయిన తరువాత లోపాలు గుర్తిస్తే నెమ్మదిగా, సున్నితంగా పరిష్కరించు కోవడం మంచిది మీవారు పూర్తిగా వ్యసనానికి బానిస అయ్యారు. ఆయన హితోపదేశాలు వినరు, భయపెట్టినా లొంగరు. కాబట్టి ఏదో ఒక విధంగా ఆయనను డి-అడిక్షన్ కేంద్రంలో చేర్పించి చికిత్స చేయించండి. పరిస్థితిని బట్టి 15 రోజులు లేదా నెల అయినా అక్కడే ఉంచండి. తరువాత కూడ జాగ్రత్తలు తీసుకోండి. అంతే తప్ప నిత్యం బాధపడుతూ బ్రతకడం మంచిది కాదు.





## ఆర్చరీ ప్రపంచ కప్.. జ్యోతి, రిషబ్ వరల్డ్ రికార్డు

**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్-2025 కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలో భారత్ అథ్లెట్లు వెన్నం జ్యోతి సురేఖ-రిషబ్ యాదవ్ కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 4 లో మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఈ ఇరువురు అద్భుత ప్రదర్శన చేశారు. మాడ్రిడ్‌లో జరిగిన ఈ ఆర్చరీ పోటీల్లో జ్యోతి మరియు రిషబ్ మొత్తం 1431 స్కోరుతో 2023 యూరోపియన్ గేమ్స్ తర్వాత డెన్మార్క్‌కు చెందిన టాంజా గెల్లెంథియన్ మరియు మథియాస్ ఫుల్లెర్టన్ పేరిట ఉన్న 1429 పరుగుల ప్రపంచ రికార్డును అధిగమించారు. ముఖ్యంగా రిషబ్ పూర్తి స్థాయిలో రాణించాడు. పురుషుల వ్యక్తిగత కాంపౌండ్ అర్హత రౌండ్‌లో అతను 716 పాయింట్లు సాధించి వేదికపై అగ్రస్థానంలో నిలిచాడు. ఇది అతని కెరీర్‌లో అత్యుత్తమ స్కోరు మాత్రమే కాదు, 716 స్కోరు బ్రాడెన్ గెల్లెంథియన్ పేరిట ఉన్న పురుషుల వ్యక్తిగత ప్రపంచ రికార్డుకు కూడా కొంచెం దూరంలో ఉంది. అదే సమయంలో జ్యోతి అంతర్జాతీయ వేదికపై కూడా వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన చేసింది, మహిళల వ్యక్తిగత కాంపౌండ్ అర్హత రౌండ్‌లో 715 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. మిశ్రమ కాంపౌండ్ జట్టు మొత్తం అంటే ఇద్దరు ఆర్చర్ల వ్యక్తిగత స్కోర్లు కలిపితే వస్తుంది.



## వింబుల్డన్‌లో జోకోవిచ్ ముందడుగు

**న్యూఢిల్లీ:** ఏడు సార్లు ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ 2025 వింబుల్డన్ టోర్నమెంట్‌లో తనదైన ముద్ర వేశాడు. నాలుగో రౌండ్‌లో అలెక్స్ డి మినార్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. మొదటి సెట్ కోల్పోయినప్పటికీ అద్భుతంగా పుంజుకొని తర్వాతి మూడు సెట్లు గెలిచి మ్యాచ్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆదిలో తడబడినప్పటికీ జకోవిచ్ అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించాడు. 2016 తర్వాత వింబుల్డన్‌లో ఇంత త్వరగా బయటపడే ప్రమాదం ఉన్నప్పటికీ జకోవిచ్ డి మినార్‌ను 1-6, 6-4, 6-4, 6-4తో ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. 38 ఏళ్ల జకోవిచ్ పేలవమైన ఆరంభం చేసి మొదటి సెట్‌ను చేజార్చుకున్నాడు. అయితే జకోవిచ్ వెంటనే పుంజుకుని తర్వాతి రెండు సెట్లు గెలిచి 2-1 ఆధిక్యంలో నిలిచారు. నాలుగో సెట్‌లో డి మినార్ మళ్లీ 4-2 ఆధిక్యం సాధించాడు. కానీ ప్రపంచ మాజీ నంబర్ వన్ ఆటగాడు జకోవిచ్ వరుసగా రెండు సార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి సెట్‌ను, మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. ఎనిమిదో వింబుల్డన్ టైటిల్, రికార్డును మెరుగుపరిచే 25వ సింగిల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం ప్రయత్నిస్తున్న జకోవిచ్ తదుపరి రౌండ్‌లో ఇటలీకి చెందిన 22వ సీడ్ ఫ్లావియో కోబోలితో తలపడనున్నారు. ఫ్లావియో కోబోలి 2014 యూఎస్ ఓపెన్ ఛాంపియన్ మారిన్ సిలిక్‌ను 6-4, 6-4, 6-7, 7-6తో ఓడించి తన కెరీర్‌లో తొలిసారిగా గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు.

# నేటి నుండి మూడో టెస్టు

### సిరీస్ అధిక్యం కోసం భారత్ పట్టు.. టీమ్‌లో మరిన్ని ఛేంజింగ్స్

**న్యూఢిల్లీ:** ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత్ గట్టి పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో టీమిండియాలో మళ్లీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఈ నెల 10 నుంచి 14 వరకు లండన్‌లోని లార్డ్స్ మైదానంలో జరగనున్న మూడో టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌లో ఆధిక్యంతో దూసుకెళ్లేందుకు భారత్ వ్యూహాత్మకంగా బరిలోకి దిగబోతోంది. హెడింగ్లీ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఓడిపోయినా ఎడ్జ్ బాస్టన్‌లో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో భారత్ ఘన విజయాన్ని




అందుకుంది. దీంతో ప్రస్తుతానికి సిరీస్ 1-1తో సమంగా ఉంది. రెండో టెస్టులో విజయం సాధించినప్పటికి మూడో టెస్టులో జట్టులో మార్పులు తప్పవనే విషయాన్ని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇప్పటికే వెల్లడించాడు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా రెండో టెస్టుకు విశ్రాంతినిచ్చిన జస్‌ప్రీత్ బుమ్రా మూడో టెస్టులో ఆడడం ఖాయం. అదే సమయంలో జట్టులో ఇంకొన్ని మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇంగ్లాండ్‌తో సిరీస్ ప్రారంభానికి ముందు ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో సత్తా చాటడడంతో పేస్ ఆల్‌రౌండర్‌గా ఆస్ట్రేలియాలో రాణించిన నితీశ్ కుమార్‌ని కాదని శార్దూల్ ఠాకూర్‌ను తొలి టెస్టుకు తీసుకున్నారు. అయితే శార్దూల్ ఈ మ్యాచ్‌లో దారుణంగా విఫలం అయ్యా డు. బ్యాటింగ్‌లో తొలి ఇన్నింగ్స్ 8 బంతుల్లో 1 పరుగు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 12 బంతుల్లో 4 పరుగులు మాత్రమే చేశాడు. ఇక బౌలింగ్‌లో 2 వికెట్లు మాత్రమే తీశాడు. దీంతో రెండో టెస్టుకు శార్దూల్‌ను పక్కన బెట్టిన మేనేజ్‌మెంట్ నితీశ్‌కు చోటు ఇచ్చింది. వచ్చిన అవకాశాన్ని ఈ హైదరాబాదీ ఆటగాడు సద్వినియోగం చేసుకోలేక పోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో 6 బంతుల్లో 1 పరుగే చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 2 బంతులు ఆడి 1 పరుగే చేశాడు. ఇక బౌలింగ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 6 ఓవర్లు వేసి 29 పరుగులు ఇచ్చాడు. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అతడి చేతికి బంతినే ఇవ్వలేదు. ఈ మ్యాచ్‌లో నితీశ్ ఒక్క వికెట్ కూడా తీయలేదు. ఈ క్రమంలో లార్డ్స్ టెస్టులో పేస్ ఆల్‌రౌండర్ కోటాలో ఎవరిని ఆడించాలోనని టీమ్‌మేనేజ్‌మెంట్ సందిగ్ధంలో పడింది. అటు శార్దూల్, ఇటు నితీశ్ కుమార్‌లు ఘోరంగా విఫలం కావడంతో జట్టుకు ఎం చేయాలో పాలుపోవడం లేదు. లార్డ్స్ పిచ్ పేసర్లకు అనుకూలం కావడంతో ముగ్గురు పేసర్లతో పాటు వీరిద్దరిలో ఎవరో ఒకరికి జట్టులో చోటు దక్కడం ఖాయం. మరి నితీశ్‌కే అవకాశం ఇస్తారా? లేదంటే అనుభవానికి ఓటు వేసి శార్దూల్‌కు అవకాశం ఇస్తారా? అన్నది చూడాల్సిందే. లేక వీరిద్దరిని కాదని మరో ఆటగాడికి ఛాన్స్ ఇస్తారా ?అన్నది ఆసక్తికరంగా మారింది.







## వరల్డ్ నం. 1గా హ్యారీ బ్రూక్

### బౌలింగ్ టాప్‌లో బుమ్రా..

### బ్యాటర్ల టాప్10లోకి గిల్

**న్యూఢిల్లీ:** ప్రపంచ నెంబర్1గా ఇంగ్లండ్ స్టార్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ నిలిచాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో సరికొత్త రారాజుగా ఉద్భవించాడు. ఐసీసీ ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో బ్రూక్ తన సహచరుడు జో రూట్‌ను అధిగమించి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఈ ఇంగ్లండ్ వైస్ కెప్టెన్ 886 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. అతడి తర్వాత స్థానంలో జో రూట్ 868 పాయింట్లతో ఉన్నాడు. భారత్‌తో ఇటీవల ముగిసిన రెండో టెస్టు మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో బ్రూక్ 158 పరుగులతో అద్భుతమైన సెంచరీ చేసి చెలరేగాడు. అంతకు ముందు తొలి టెస్టు మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో బ్రూక్ రాణించాడు. ఈ క్రమంలో అతడు వర్డ్ నెంబర్ 1 టెస్టు బ్యాటర్‌గా అవతరించాడు. ఇక ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో ఇంగ్లండ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ (269), రెండో ఇన్నింగ్స్‌లో భారీ శతకం (161) సాధించిన టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సైతం తాజా ర్యాంకింగ్స్‌లో అదరగొట్టాడు. గిల్ 807 పాయింట్లతో ఏకంగా 15 స్థానాలు మెరుగుపరచుకుని తన కెరీర్ బెస్ట్ ర్యాంకింగ్ అరో స్థానానికి చేరుకున్నాడు. ఇక గిల్‌తో పాటు, మరో ఇద్దరు బ్యాటర్లు టాప్10లో చోటు దక్కించుకున్నారు.

యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ 4వ స్థానంలో ఉండగా, వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ 8వ స్థానంలో నిలిచాడు.. మరోవైపు భారత్‌తో రెండో టెస్టులో సత్తా చాటిని ఇంగ్లండ్ కీపర్ జెమీ స్మిత్ 753 పాయింట్లతో 16 స్థానాలు ఎగబాకి 10వ ప్లేస్‌కు చేరుకున్నాడు. అయితే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో పెద్దగా మార్పులు చోటు చేసుకోలేదు. టీమిండియా పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా (898) టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా, సఫారీ పేసర్ కగిసో రబాడ (851) రెండో ప్లేస్‌లో ఉన్నాడు. ఇక అల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

### ఆసియా ఛాంపియన్‌షిప్‌లో..

## ఛాంపియన్‌గా భారత్ రెజ్లింగ్ టీమ్

### ఖాతాలో 6 స్వర్ణాలు సహా 8 పతకాలు

**న్యూఢిల్లీ:** ఆసియా అండర్ 15 ఛాంపియన్‌షిప్‌లో భారత్ రెజ్లింగ్ బృందం ఆధిపత్యం చెలాయించింది. బిష్కెక్‌లో జరిగిన ఈ పోటీల్లో పురుషుల ఫ్రీస్టైల్ జట్టు ఛాంపియన్‌గా, మహిళల జట్టు రన్నరప్‌గా నిలిచింది. కిర్గిజస్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 2025 అండర్15 ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ రెజ్లింగ్ జట్లు అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాయి. ఫ్రీస్టైల్ జట్టు 6 స్వర్ణాలు, 1 రజతం, 1 కాంస్యంతో సహా 8 పతకాలను గెలుచుకుని మొత్తం 203 పాయింట్లను సాధించాయి. ఈ నేపథ్యంలో 166 పాయింట్లతో జపాన్‌ను అధిగమించి మొత్తం ఛాంపియన్‌గా నిలిచింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్లో 9 8 స్కోరుతో జపాన్ ప్రత్యర్థిపై విజయం సాధించి వాన్ష్ అహ్లావత్ పతకాల పట్టికను ప్రారంభించాడు. 44 కిలోల విభాగంలో ఆర్యన్ కిర్గిజ్ రెజ్లర్‌ను సాంకేతిక ఆధిపత్యంతో (16 6) ఓడించాడు. అలాగే




ప్రథమేష్ సూర్యకాంత్ పాటిల్ తన ఉజ్బెక్ ప్రత్యర్థిని 74 తేడాతో, శరదృతువు నాటికి సచిన్ (68 కిలోలు) తన ఉజ్బెక్ ప్రత్యర్థిని ఓడించి గెలిచారు. రోహిత్ మాన్ తజికిస్తాన్‌పై 100 టెక్నికల్ సుపీరియారిటీ విజయాన్ని సాధించాడు. కార్తీక్ (85 కిలోలు) కజకిస్తాన్‌పై 31 విజయంతో పోరాడాడు. కాగా మహిళల జట్టు సాహసోపేతమైన ప్రదర్శనను ప్రదర్శించి, 202 పాయింట్లతో మొత్తం మీద రెండవ స్థానంలో నిలిచింది. జపాన్ 217 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. భారతదేశం మరియు జపాన్ మధ్య జరిగిన పోటీలో భారతదేశం 2 స్వర్ణాలు, కాంస్యాన్ని గెలుచుకుంది, చివరికి మొత్తం 3 స్వర్ణాలు, 5 రజతాలు మరియు 1 కాంస్య పతకాన్ని సాధించింది. జియా (33 కిలోలు) తన జపాన్ ప్రత్యర్థిపై 42 తేడాతో విజయం సాధించి స్వర్ణం గెలుచుకోగా, పూర్వి శర్మ (66 కిలోలు) తన జపాన్ ప్రత్యర్థిపై 80 తేడాతో ఆధిపత్యం చెలాయించింది. ఇక దీక్ష (39 కిలోలు) తన కిర్గిజ్ ప్రత్యర్థిని పతనంలో ఓడించడం ద్వారా అద్భుత ప్రదర్శన ఇచ్చింది. 58 కిలోల కాంస్య పతక పోరులో, భారతదేశం జపాన్‌ను అధిగమించి మరో పతకాన్ని జోడించింది. గ్రీకో రోమన్ రెజ్లర్లు కఠినమైన సవాళ్లను ఎదుర్కొని మొత్తం పతకాల జాబితాలో 5వ స్థానంలో నిలిచారు. చాలా మంది రెజ్లర్లు కాంస్య పతక పోటీలలో ఓడిపోయినప్పటికీ, అభిషేక్ (48 కిలోలు) ఫైనల్‌కు చేరుకుని రజత పతకాన్ని సాధించాడు, కజకిస్తాన్‌పై 80 స్కోరుతో ఓడిపోయాడు. అదనంగా, పర్నమ్ సింగ్ (68 కిలోలు) కిర్గిజ్ రెజ్లర్‌పై 101 తేడాతో ఘన విజయం సాధించి కాంస్యం సాధించాడు.

# వాణిజ్యం

## ఆపిల్ సిఒఒగా సబిహ్ ఖాన్..

**వాషింగ్టన్, జులై 9:** టెక్ దిగ్గజం ఆపిల్ నాయకత్వ బాధ్యతల్లో కీలక మార్పులు చేసింది. భారతీయ మూలాలున్న వ్యక్తికి ముఖ్య బాధ్యతలు అప్పగించింది. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జెఫ్ విలియమ్స్ కంపెనీని వీడనుండడంతో, సిఇఒ టిమ్ కుక్ అదనపు భారం స్వీకరించనున్నారు. విలియమ్స్ సిఇఒ బాధ్యతలను ఆపిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సబిహ్ ఖాన్‌కు ఈ నెలాఖర్లో అప్పగించనున్నారు. ఈక్రమంలో డిజైనింగ్ టీమ్ బాధ్యతలను నేరుగా టిమ్ కుక్ స్వీకరించనున్నారు. ఇక విలియమ్స్ స్థానంలో బాధ్యతలు స్వీకరించనున్న సబిహ్ ఖాన్‌కు సంస్థలో 30యేళ్ల అనుభవం ఉంది. గత ఆరేళ్లుగా ఆపిల్ గ్లోబెల్ సప్లై చైన్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఉత్పత్తి కార్యకలాపాలనూ పర్యవేక్షిస్తున్నారు. ఖాన్ మూలాలు భారత్‌లో ఉన్నాయి. ఆయన ఉత్తరప్రదేశ్ మొరాదాబాద్ జిల్లాలో 1966వ సంవత్సరంలో జన్మించారు. ఖాన్‌కు ప్రమోషన్‌పై సిఇఒ టిమ్ కుక్ మాట్లాడుతూ, ఆపిల్ పంపిణీ వ్యవస్థలను పర్యవేక్షిస్తూనే, అత్యాధునిక ఉత్పాదక విధానాలకు సంబంధించి కీలక టెక్నాలజీల్లో సంస్థకు మార్గదర్శకత్వం చేశారు. అమెరికాలో ఆపిల్ కంపెనీ మానిఫ్యాక్చరింగ్ విస్తరణలో ఆయన కృషి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లను ఆపిల్ చురుగ్గా ఎదుర్కొనేలా సిద్ధం చేశారు అని పేర్కొన్నారు. ఈ యేడాది విలియమ్స్ సిఇఒ పదవి నుంచి వైదొలగినా, సిఇఒ టిమ్ కుక్‌తో కలిసి కొంత కాలం పనిచేయనున్నారు. దీంతో పాటు డిజైన్ టీమ్, ఆపిల్ వాచ్, కంపెనీ హెల్త్ ఇనీషియేటివ్‌ను పర్యవేక్షించనున్నారు. కానీ డిజైన్ టీమ్ మాత్రం టిమ్‌కుక్‌కు రిపోర్టింగ్ చేయ నుంది. జెఫ్‌తో కలిసి సుదీర్ఘకాలం పనిచేశాను. అతడు లేకుండా నేడు ఆపిల్ ఇలా ఉండేది కాదు. ఆయన ప్రపం చంలోనే అత్యంత గౌరవప్రద మైన పంపిణీ వ్యవస్థను సృష్టించారు. ఆపిల్ వాచ్ లాంచింగ్, దాని డెవలప్‌మెంట్ పర్యవేక్షించారు. ఇక ఆపిల్ హెల్త్ వ్యూహాన్ని రూపొందించారు. అద్భుతమైన దార్శనికతతో మా డిజైనర్స్ బృందానికి నాయకత్వం వహించారు అని సిఇఒ టిమ్ కుక్ పేర్కొన్నారు.



## ఆర్‌బిఐ బాండ్లకు 8శాతానికిపైగా వడ్డీ!

**న్యూఢిల్లీ, జులై 9:** ఆర్‌బిఐ రెపో రేటును తగ్గించడంతో దాదాపు అన్ని బ్యాంకులూ ఫిక్స్‌డ్ డిపాజిటర్లపై వడ్డీరేట్లను తగ్గించాయి. దీంతో అధిక వడ్డీనిచ్చే ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాల కోసం చాలా మంది చూస్తున్నారు. అధిక ప్రతిఫలం ఉన్న చోట రిస్క్ కూడా పొంచి ఉంటుంది. అలా రిస్క్ వద్దనుకునే వారికి మరో స్కీమ్ అందుబాటులో ఉంది. అదే రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టిన ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్ 2020. ఈ బాండ్లపై అధిక వడ్డీతో పాటు ఆర్‌బిఐ సార్వభౌమ గ్యారెంటీ కూడా లభిస్తుంది. మన డబ్బుకు పూర్తి భద్రత, దీర్ఘ కాలంలో మంచి రాబడి లభిస్తుంది. ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్లలో వడ్డీ రేటు ఎల్లప్పుడే ఒకేవిధంగా ఉండదు. ఆరు నెలలకోసారి మారుతూ ఉంటుంది. చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో ఒకటైన నేషనల్ సేవింగ్స్ స్కీమ్ (ఎన్ఎస్‌సి)తో ఈ వడ్డీ రేట్లు ముడిపడి ఉంటాయి. ఎన్ఎస్‌సి వడ్డీ రేటును పెంచితే ఈ బాండ్ల రేటు కూడా పెరుగుతుంది. అలాగే



ఎన్ఎస్‌సి వడ్డీ రేటు తగ్గితే ఈ బాండ్లపై వడ్డీ కూడా తగ్గుతుంది. ఎన్ఎస్‌సి అందించే వడ్డీ రేటు కన్నా 0.35శాతం ఎక్కువ రేటు ఈ బాండ్లపై లభిస్తుంది. 2025 జులై-డిసెంబరు అర్ధ వార్షికానికి 8.05శాతంగా వడ్డీ రేటును ఆర్‌బిఐ జులై 1న ఖరారు చేసింది. నేషనల్ సేవింగ్స్‌స్కీమ్ 7.7శాతం వడ్డీరేటు లభిస్తుండగా, ఆర్‌బిఐ బాండ్లపై 8.05శాతం వడ్డీ అందుతుంది. యేడాదికి రెండుసార్లు జనవరి1, జులై1 వడ్డీ మొత్తంఖాతాలో జమ అవుతుంది.

## 24% పెరిగిన 'ఫండ్స్' పెట్టుబడులు

### 'ఆంఫీ' లెక్కలప్రకారం మొత్తం రూ.74.4 లక్షల కోట్ల టర్నోవర్

**ముంబై, , జులై 9:** భారత్ ఈక్విటీ మ్యూచువల్‌ఫండ్స్ మార్కెట్‌లోకి పెట్టుబడులు ఒక్కసారిగా పెరిగాయి. గతనెలలో 24శాతం పెరిగి 23,587 కోట్ల రూపాయలు వచ్చినట్లు మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ వెల్లడించింది. గడచిన ఐదునెలల క్షీణత నుంచి ఒక్కసారిగా మెరుగుపడింది. ఈక్విటీ రంగాల్లోకి మ్యూచువల్ ఫండ్స్ 23,587 కోట్లు వచ్చాయి. అంతకుముందు నెలలో 19,013 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడులు ఉన్నట్లు తెలింది. గడచిన సంవత్సరం డిసెంబరు నుంచి వరుసగా తగ్గుతూనే వచ్చాయి. 41,156 కోట్ల నుంచి డిసెంబరులో 39,688 కోట్లకు దిగివచ్చాయి. ఫిబ్రవరిలో 29,303 కోట్లు, మార్చిలో 25,082కోట్లు, ఏప్రిల్‌లో 24,269 కోట్లు పెట్టుబడులు క్షీణించాయి. ఈ తగ్గుదలకు ముందు పెట్టుబడులు నవంబరులో 35,943 కోట్లు వరకూ వచ్చాయి. ఇక ఇతరత్రా చూస్తే డెట్‌ఫండ్స్‌లో 1711 కోట్లు విత్‌డ్రా అయ్యాయి. మేనెలలో 15,908 కోట్ల కంటే కొంతమేర మెరుగనిపించింది. అంతకుముందు ఏప్రిల్‌లోనే ఫండ్స్ మార్కెట్‌లోకి కరెన్సీ, ఈక్విటీ, ఫండ్స్ రంగాల్లోకి 2.2 లక్షల కోట్లు పెట్టుబడులుగా రావడం విశేషం. మొత్తంగా మ్యూచువల్‌ఫండ్ రంగం మొత్తం 49 వేల కోట్ల మేర జూన్‌నెలలో పెట్టుబడులు వచ్చినట్లు తేలింది. ఈ మొత్తంతో ఫండ్స్‌రంలో మొత్తం పెట్టుబడులు 74.4 లక్షల కోట్లుగా ఉన్నాయి. మేనెలాఖరునాటికి 72.2 లక్షల కోట్లుగా ఉంటే కొంతమేర మెరుగుపడింది. ఈక్విటీ అనుసంధానిత పెట్టుబడుల పథకాల్లో 556 కోట్లు వరకూ పెట్టుబడులు వచ్చాయి. ఈక్విటీ ఫండ్ కేటగిరీల్లో ఫ్లెక్సీ క్యాప్‌ఫండ్స్ జూన్‌నెలలో 5733కోట్ల వరకూ పెట్టుబడులు అందాయి. వీటికి అదనంగా స్మాల్ క్యాప్‌ఫండ్స్ 4024కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్ 3754 కోట్లు పెట్టుబడులు సాధించాయి. భారీ పెట్టుబడులపరంగా ఫండ్స్ నికరంగా 1694 కోట్లు మాత్రమే వచ్చాయని ఆంఫీ ప్రకటించింది.




## జూన్‌లో సిప్ పెట్టుబడుల రికార్డ్

**న్యూఢిల్లీ, జులై 9:** క్రమానుగల పెట్టుబడి విధానం (సిప్)లో పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. జూన్ నెలలో రికార్డు స్థాయిలో రూ.27,269 కోట్లు మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు వచ్చాయి. మే నెలలో ఈ మొత్తం రూ.26,668 కోట్లుగా ఉంది. సిప్ పెట్టుబడులు తొలిసారి రూ.27వేల కోట్ల మార్కు దాటడం ఇదే తొలిసారి. గత నెలతో పోలిస్తే మొత్తంగా మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు 67శాతం మేర పెరిగాయి. మే నెలలో రూ.29,572 కోట్లు పెట్టుబడులు రాగా, జూన్‌లో ఈ మొత్తం రూ.49,310 కోట్లుగా ఉన్నట్లు మ్యూచువల్ ఫండ్ సంస్థల సంఘం (ఆంఫీ) బుధవారం వెల్లడించింది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ కేటగిరీలో జూన్ నెలలో రూ.23,587 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మే నెలలో ఈ మొత్తం రూ.19,013 కోట్లుగా ఉంది. ఇఎల్ఎస్ఎస్ ఫండ్స్ మినహా అన్ని ఈక్విటీ కేటగిరీల్లోనూ పెట్టుబడులు తరలివచ్చాయి. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.5,733 కోట్లు రాగా, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.4,024 కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.3,754 కోట్లు వచ్చాయి. డెట్ మ్యూచుల్ ఫండ్స్ కేటగిరీలో జూన్ నెలలో నికరంగా రూ.1,711 కోట్లు పెట్టుబడులు తరలి వెళ్లాయి. మే నెలలో ఈ మొత్తం రూ.15,908 కోట్ల ఔట్‌ఫ్లో ఉంది. షార్ట్ డ్యూరేషన్ ఫండ్స్‌లోకి రూ.10,276 కోట్లు, మనీ మార్కెట్ ఫండ్స్‌లోకి రూ.9,484 కోట్లు వచ్చాయి. లిక్విడ్ ఫండ్స్ నుంచి అత్యధికంగా రూ.25,196 కోట్లు తరలిపోయాయి. హైబ్రిడ్ ఫండ్స్‌లోకి ఇన్‌ఫ్లోస్ 12శాతం మేర పెరిగి రూ.23,222 కోట్లుగా నమోదైనట్లు డేటా వెల్లడించింది. ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లోకి రూ.15,584 కోట్లు వచ్చాయి. జూన్ నెలలో గోల్డ్ ఇటిఎఫ్‌ల్లోకి అత్యధికంగా రూ.2,080 కోట్లు వచ్చాయి. మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ 3శాతం పెరిగి రూ.74.14 లక్షల కోట్లకు చేరింది. మే నెలలో ఈ మొత్తం రూ.71.93 లక్షల కోట్లుగా ఉంది. జూన్ నెలకుగానూ సిప్ చేసిన ఖాతాల సంఖ్య మే నెలతో పోలిస్తే 8.56 కోట్ల నుంచి 8.64 కోట్లకు పెరిగాయి.




## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జులై 9:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిసాయి. రేంజిబౌండ్ సెషన్ తర్వాత దిశా సంకేతాలు లేకపోవడంతో భారత ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు నష్టాల వద్ద ముగిసాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 176.43 పాయింట్లు క్షీణించి 83,536.08 వద్ద, ఎన్ఎస్ఇ నిఫ్టీ 46.4 పాయింట్లు నష్టపోయి 25,476.10 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ మిడ్‌క్యాప్100 0.13శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.59శాతం పెరిగాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ రియాల్టీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ వరుసగా 1.49శాతం, 1.4శాతం, 1.25శాతం నష్టపోయాయి. నిఫ్టీ ఎనర్జీ, ఐటి, మీడియా, పిఎస్‌యు బ్యాంకు, హెల్త్‌కేర్ వంటి షేర్లు క్షీణించాయి. వేదాంత షేర్లు 3శాతానికిపైగా నష్టపోయాయి. నిఫ్టీ ఎఫ్ఎంసిజి, ఆటో, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ లాభాల్లో ముగిసాయి. సెన్సెక్స్‌లోని 17 షేర్లు ప్రతికూలంగా ముగిసాయి. అదే సమయంలో హెచ్‌సిఎల్ టెక్, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు రెండు శాతం వరకు నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఏసియన్ పెయింట్స్ భారీ లాభాల్లో ముగిసాయి.




## రిలయన్స్ జియో ఐపిఒ ఈ యేడాది లేనట్లే!

**ముంబై, జులై 9:** ఇన్వెస్టర్లు ఎంతగానో ఎదురుచూస్తున్న ఐపిఒల్లో రిలయన్స్ జియో ఒకటి. రాబోయే ఐదేళ్లలో రిలయన్స్ నుంచి రిటైల్, జియో కంపెనీలు లిస్టింగ్‌కు రాబోతున్నాయంటూ ముఖేష్ అంబానీ ప్రకటించినప్పటి నుంచి జియో ఐపిఒ పట్ల ఇన్వెస్టర్లలో ఆసక్తి నెలకొంది. కానీ ఎప్పటికప్పుడు ఈ ప్రణాళికలు వాయిదా పడుతూనే ఉన్నాయి. ఈ యేడాది కూడా ఐపిఒకు తీసుకురాకూడదని రిలయన్స్ భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అతిపెద్ద టెలికం కంపెనీ అయిన జియో విలువను 100 బిలియన్ డాలర్లుగా అనలిస్టులు పేర్కొంటున్నారు. ఈ మొత్తాన్ని ఐపిఒకు ముందే పెంచాలని జియో భావిస్తోంది. టెలికం విభాగంలో అధిక ఆదాయం సాధించడంతో పాటు సబ్‌స్క్రైబర్ల బేస్ పెంచుకోవడం ఇందులో మొదటిది. జియో ప్లాట్‌ఫామ్స్‌కు వచ్చే వార్షికాదాయంలో దాదాపు 80శాతం ఆదాయం టెలికం వ్యాపారం నుంచే సమకూరుతోంది. ఈ సంస్థ టెలికం వ్యాపారంతో పాటు వివిధ యాప్స్‌ను, కనెక్టెడ్ డివైజులు, ఎంటర్‌ప్రైజెస్‌కు ఎఐ సొల్యూషన్లను అందిస్తోంది. దీన్ని విస్తరించాలని భావిస్తోంది. తద్వారా రెవెన్యూను పెంచుకోవాలనుకుంటోందని కూడా పేర్కొన్నాయి. జియోను ఐపిఒకు తీసుకురావానుకుంటున్న విషయాన్ని 2019లో ముఖేష్ అంబానీ ప్రకటించారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.